28 నుంచి తాయ్‌మామన్ తంగ మోతిరం



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 19 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 254 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

దేశీయ మార్కెట్లోకి డెంగీ వ్యాక్సిన్



2



రాష్ట్ర డిమాండ్ మేరకు

# మరో 9.56 లక్షల ఇండ్లను మంజూరు చేయండి

## ఎల్‌నినో నేపథ్యంలో అవసరమైన సాయమందించండి

## కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (మనం బ్యూరో): రాష్ట్ర డిమాండ్ మేరకు మరో 9.56 లక్షల ఇండ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో శుక్రవారం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎం రేవంత్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భేటీ అయ్యారు. పీఎంఏవై జి పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన సందర్భంగా కేంద్ర మంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. గతంలో సీఎం 11,56, 915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని ఢిల్లీలో కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన ఇండ్లను కూడా కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి వివరించిన సీఎం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. దీంతో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం

...మిగతా 2లో

## రూ.20వేల కోట్లివ్వండి

రాష్ట్రంలోని ఎల్‌నినో పరిస్థితులపై అసెంబ్లీ తీర్మానం

కేంద్రానికి పలు డిమాండ్లు పెట్టిన శాసనసభ

హైదరాబాద్, సెప్టెంబర్ 18: రాష్ట్రంపై ఎల్ నినో తీవ్ర ప్రభావం, కరువు పరిస్థితులపై శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయం అందించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తీర్మానాలకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా

...మిగతా 2లో

## 22ఏ పరిష్కారానికి హైలెవల్ కమిటీ



చైర్మన్‌గా సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్, సభ్యులుగా పాపిరెడ్డి, రాజీవ్‌గాంధీ హనుమంతు

అన్ని అంశాలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరిస్తాం • అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి ప్రకటన • ఎల్బీనగర్ నియోజకవర్గంలో జీవో 118 ప్రకారం 9700 ప్లాట్ల రెగ్యులరైజేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (మనం బ్యూరో): గత కొద్ది రోజులుగా చర్చనీయాంశంగా మారిన వివాదాస్పద 22ఏ నిషేధిత భూముల జాబితా అంశానికి ముగింపు పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనకు అనుగుణంగా 22ఏకు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించడానికి హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. కమిటీ

...మిగతా 2లో

## నిరవధిక వాయిదా



8 రోజులు.. 51 గంటల 52 నిమిషాలు పని చేసిన అసెంబ్లీ

నాలుగు బిల్లులు, మూడు తీర్మానాల ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబర్ 18, (మనం బ్యూరో): రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం 8 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించగా, 51 గంటల 52 నిమిషాల పాటు సభ సజావుగా సాగింది. ఈ సమావేశాల్లో 4 బిల్లులకు మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది.

## హరీశ్ రావు భూములపై కాంగ్రెస్ నజర్

సిద్దిపేటలో అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్సీల పర్యటన

బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాల నిగ్గు దేల్చేందుకే క్షేత్రస్థాయి పరిశీలన

పర్యటనకు ముందు రేవంత్ రెడ్డితో భేటీ



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (మనం బ్యూరో): బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాలపై ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్సీల బృందం శుక్రవారం సిద్ధిపేటలో పర్యటించింది..ఈ సందర్భంగా భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో సర్వే నం.271లో లావణి పట్టాలు ఉన్న 300 ఎకరాల భూమి ఉందనీ, 1995లో ఈ సర్వే నంబర్‌లో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు 4 ఎకరాల 8 గుంటలు, స్వాతంత్ర్య సమరయోధునికి 2 ఎకరాల 8 గుంటలు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే నం.271లో ఎలాంటి లావాదేవీలు జరగొద్దని ఉన్నప్పటికీ ఆ భూమిని హరీశ్‌రావు మామ హనుమంతరావు 2009-10లో కొనుగోలు చేయడం జరిగిందనీ, ఆ భూమికి ఎన్వోసీ కలెక్టర్

...మిగతా 2లో



## అక్టోబర్ 9న ఆర్టీసీ ఎన్నికలు

గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ జారీ

పదేండ్ల తరువాత కార్మిక సంఘాల ఎలక్షన్లు

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల పోలింగ్ నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 2016 జులై 19న చివరి సారిగా ఈ ఎన్నికలు జరిగాయి. ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు.

## దానంపై అనర్హత వేటు

అ పార్టీలో గెలిచి మరో పార్టీకి ఫిరాయించడంపై హైకోర్టు తీర్పు



ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పష్టీకరణ || స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం || 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు

బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు నాగేందర్ పోటీ

ఏలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు || తీర్పుపై దానం సుప్రీంకోర్టుకు వెళ్లకూడదన్న ఏలేటి || కాంగ్రెస్ కుట్రలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని వ్యాఖ్య

హైదరాబాద్, మనం ప్రతినిధి: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్

...మిగతా 3లో

## ఉప ఎన్నికల్లో మళ్లీ గెలుస్త



## సత్యమేవ జయతే

ఇతర ఫిరాయింపుదారులకు కూడా ఇదే గతి

దానం అనర్హత వేటుపై కేటీఆర్ ట్వీట్

3



## కాంగ్రెస్‌వి బూటకపు పర్యటనలు



నా వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్‌హౌస్ లేదు

చిన్న తప్పు దొరికినా 13 ఎకరాల భూమి ప్రభుత్వానికే ఇచ్చేస్త

2

## పెట్రోల్ పంపుల్లో డిజిటల్ పేమెంట్స్ బంద్?

- రూ.2,000 దాటితే క్యాష్ మాత్రమే
- పెట్రోల్ డీలర్ల ఆందోళన
- ఎండీఆర్ ఉపసంహరించకపోతే వినియోగదారులపై యూపీఐ బండ

2






## జాతీయ జెండాను రాజకీయాల్లోకి లాగొద్దు

అది ఏ ఒక్క పార్టీదో కాదు.. భారతీయులందరిదీ

హైదరాబాద్ సంస్థాన విలీన సమయానికి బీజేపీ పుట్టనే లేదు

కాషాయ పార్టీ కామెంట్లకు పొన్నం ప్రభాకర్ ఖండన

3

## బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ పదవికి వారెన్ బఫెట్ టాటా



న్యూయార్క్, సెప్టెంబర్ 18: కార్పొరేట్ వాణిజ్య చరిత్రలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ తన బెర్క్ షైర్ హాత్ వే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. గత ఐదు దశాబ్దాలకు పైగా ఈ బాధ్యతల్లో కొనసాగిన ఆయన.. నేడు వైదొలిగినట్లు కంపెనీ శుక్రవారం వెల్లడించింది. 96 ఏళ్ల వారెన్ బఫెట్ ఇకపై కంపెనీలో గౌరవ ఛైర్మన్ గా ఉంటారు. బెర్క్ షైర్ హాత్ వే కొత్త ఛైర్మన్గా బఫెట్ తనయుడు హోవర్డ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వారెన్ బఫెట్ వాటాదారులకు

...మిగతా 2లో

## మాకో రూలు.. మీకో రూలు

అర్థమైందా భారత్ • ట్రంప్ తీరే వేరయా.. పట్టాభి రామా!



వాషింగ్టన్, సెప్టెంబర్ 18: రష్యా నుంచి మీరు కొనద్దు.. కానీ మాకు మాత్రం నిబంధనలేవీ ఉండవన్నట్లుగా ప్రవర్తిస్తోంది అమెరికా. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం సుంకాలు వేస్తామని బెదిరిస్తోన్న ట్రంప్ సర్కార్.. తాను మాత్రం యురేనియం

...మిగతా 2లో

## పెండ్లిలో ఒక్క వంటకం మాత్రమే చేయాలె

### విందులు వినోదాలు బంద్

ఇంధన సంక్షోభం తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో పాక్‌లో ప్రభుత్వ ఆంక్షలు

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 18: పాకిస్థాన్ ఇంధన సంక్షోభంలో కూరుకుపోతోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా సాధారణ స్థితిలోకి రాకపోవడంతో ఇంధన కొరతతో నానా అవస్థలు పడుతోంది. ఈ క్రమంలోనే ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ఫ్యూయల్ అలవెన్సుల్లో 50 శాతం కోత విధించింది. ఇతర అలవెన్సుల్లోనూ 5శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఆర్మీ, లా ఎన్ఫోర్స్ మెంట్ తో పాటు అత్యవసర సేవలు అందించేవారికి మినహాయింపు ఇచ్చింది. పెళ్లిళ్లలో కేవలం ఒకే ఒక్క వంటకంతో సరిపెట్టాలని కోరింది.అధికారిక విదేశీ పర్యటనలపై మూడు నెలల పాటు నిషేధం విధించింది. కేంద్ర మంత్రులు,

...మిగతా 2లో

## నిస్తేజంగా మారిన భద్రతామండలి

తక్షణమే దీన్ని సంస్కరించాలె

అగ్ర దేశాలు అంతర్జాతీయ చట్టాలను భ్రష్టు పట్టిస్తున్నయ్

ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ ఆవేదన

న్యూయార్క్, సెప్టెంబర్ 18: అంతర్జాతీయంగా శాంతిభద్రతల పరిరక్షణ, యుద్ధాల నివారణలో కీలకపాత్ర వహించాల్సిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పనితీరుపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భద్రతామండలిలో తిష్ఠవేసిన అగ్రదేశాలే అంతర్జాతీయ

...మిగతా 2లో

## 28 నుంచి తాయ్ మామన్ తంగ మోతిరం

చెన్నై, సెప్టెంబర్ 18: పుట్టిన ప్రతి బిడ్డకు ఒక గ్రాము బంగారు ఉంగరం ఇస్తానని తమిళనాడు సీఎం విజయ్ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించారు. తాజాగా ఈ పథకాన్ని సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభించబోతున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. తమిళ సంస్క ృతిలో పుట్టిన బిడ్డకు మేనమామ (తాయ్ మామన్) బంగారు ఉంగరం బహుమతిగా ఇచ్చే ఆచారం ఉంటుంది. ఈ నేపథ్యంలో పథకానికి 'తాయ్ మామన్ తంగ మోతిరం' అని పేరు పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే నవజాత శిశువులకు ఈ పథకం వర్తిస్తుంది.

## దేశీయ మార్కెట్లోకి డెంగీ వ్యాక్సిన్

హైదరాబాద్, సెప్టెంబర్ 18: డెంగీ నివారణకు ఉద్దేశించిన తొలి వ్యాక్సిన్ దేశీయ మార్కెట్లోకి త్వరలో అందుబాటులోకి రానుంది. జపాన్కు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థ టకేడా, హైదరాబాద్ కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ మధ్య ఈ మేరకు శుక్రవారం ఒప్పందం కుదిరింది. దీంతో మొట్టమొదటి డెంగీ వ్యాక్సిన్ 'క్యుడెంగా' 2027 తొలి అర్ధభాగంలో మార్కెట్లోకి రానుంది. ఈ ఒప్పందం ప్రకారం.. వ్యాక్సిన్ పంపిణీ, మార్కెటింగ్ కు డాక్టర్ రెడ్డీస్ తన దేశవ్యాప్త పంపిణీ మౌలిక సదుపాయాలు, హెల్త్ కేర్ నెట్ వర్క్ ను వినియోగించనుంది. 'క్యుడెంగా'ను భారతీయ మార్కెట్లో విడుదల చేసేందుకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ అనుమతిచ్చిన విషయం విదితమే. 4-60 ఏళ్ల వయసుగల వారు మూడు నెలల వ్యవధిలో 0.5 మి.లీ. చొప్పున రెండు మోతాదుల్లో ఈ టీకా వేసుకోవాల్సి ఉంటుంది. గతంలో డెంగీ సోకిందా లేదా అన్నదాంతో సంబంధం లేకుండా, ఎలాంటి ముందస్తు పరీక్షలు అవసరం లేకుండానే దీన్ని తీసుకోవచ్చు. నాలుగు రకాల డెంగీ వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించేలా క్యుడెంగా టీకాను తయారు చేశారు.

## నిస్తేజంగా మారిన భద్రతామండలి

(మొదటి పేజీ తరువాయి)

చట్టాలను ఇష్టారీతిగా ఉల్లంఘిస్తున్నాయని, అందువల్లే ఈ ఉమ్మడి వేదిక నిస్తేజంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 దేశాలు (ఐదు శాశ్వత సభ్య దేశాలు, 10 తాత్కాలిక సభ్య దేశాలు) సభ్యులుగా ఉండే ఈ అంతర్జాతీయ వేదికను తక్షణమే సంస్కరించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన ఈ వేదిక నేటి ప్రపంచ పరిస్థితులకు తగిన విధంగా లేదని ఆక్షేపించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్జీఏ) 81వ సమావేశాలు వచ్చే వారం ప్రారంభం కానున్న నేపథ్యంలో గుటెరస్ విలేకరులతో మాట్లాడారు. బహుపాక్షిక వాదం ద్వారా ప్రపంచ సంక్షోభాలను పరిష్కరించవచ్చనే భరోసాను కీలక దేశాలు ఇస్తున్నాయని ఇటీవలి బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్ను ఉద్దేశించి గుటెరస్ తెలిపారు.

## బెర్క్ షైర్ హాత్వే ఛైర్మన్ పదవికి వారెన్ బఫెట్ టాటా

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాశారు. ''కాలమే ఎప్పుడూ గెలుస్తుంది. అయినప్పటికీ ఆ కాలం నా పట్ల కాస్త ఉదారత చూపించింది'' అని అందులో అభివర్ణించారు.

**56 ఏండ్లు పదవిలో..**

1970లో హాత్వే ఛైర్మన్గా వారెన్ బఫెట్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాతే వస్త్ర పరిశ్రమగా ఉన్న కంపెనీని బీమా రంగం వైపు తీసుకెళ్లారు. టెక్స్ టైల్, బీమా, రైల్ రోడ్స్, కన్స్యూమర్ బ్రాండ్, ఈక్విటీల్లోకి మూలధనాన్ని మళ్లించారు. క్రమశిక్షణ, దీర్ఘకాలిక వ్యూహాలతో ఆయన అనుసరించిన మదుపు వ్యూహాలు వాటాదారులకు భారీ లాభాలను తెచ్చిపెట్టాయి. ప్రపంచంలో గొప్ప ఇన్వెస్టర్గా ఆయన ప్రత్యేక గుర్తింపును పొందారు. పెట్టుబడులతో అపర కుబేరుడిగా మారిన ఆయన పాటించిన, చెప్పిన మదుపు సూత్రాలు పెట్టుబడిదారులకు ఆచరణీయంగా మారాయి.

# మరో 9.56 లక్షల ఇండ్లను మంజూరు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్నినో పరిస్థితులను ఎదుర్కునేందుకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామనీ, సన్నవడ్లకు రూ.500 బోనస్తో ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామనీ, 250 ఎకరాల్లో ఫ్రూట్, వెజిటబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట మార్పిడిపై రైతులకు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి చౌహాన్కు విజ్ఞప్తి చేశారు.



# రూ.20 వేల కోట్లివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. ఈ తీర్మానంలోని కీలక అంశాలు.. కేంద్ర బృందాన్ని పంపాలె: రాష్ట్రంలో ఎల్నినో సృష్టించిన నష్టాలు, తీవ్రతను నేరుగా అంచనా వేయడానికి తక్షణమే ఒక కేంద్ర బృందాన్ని తెలంగాణకు పంపాలి.

రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలె: ఎల్నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు, పునర్నిర్మాణ చర్యల కోసం తెలంగాణకు రూ. 20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని మంజూరు చేయాలి.

సహాయ నిధుల విడుదల: జాతీయ విపత్తు స్పందన నిధి నుంచి తగిన ఆర్థిక సాయం అందించడంతో పాటు, రాష్ట్ర విపత్తు స్పందన నిధిలో రావాల్సిన కేంద్ర వాటాను తక్షణమే విడుదల చేయాలి.

ఉపాధి హామీ రోజుల పెంపు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న 125 రోజులకు అదనంగా మరో 50 రోజుల ఉపాధిని కల్పించాలి. ఈ అదనపు 50 రోజుల వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలి.

విద్యుత్, బొగ్గు కేటాయింపులు: రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్తు్ను కేటాయించాలి. అలాగే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీని కల్పించాలి.

ఎఫ్ఆర్ బీఎం పరిమితి పెంచాలె: రాష్ట్ర ఆర్థిక సామర్థ్యాన్ని, వ్యయాన్ని పెంపొందించుకోవడానికి ఎఫ్ఆర్బీఎమ్ రుణ పరిమితిని 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి.రైతులు, తాగునీటి రక్షణ చర్యలకు ఆర్థిక సాయమందించాలె: ఉపాధి, తాగునీరు, పశుగ్రాసం సరఫరా, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల మట్టాన్ని పెంచే చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు ఆర్థిక సాయాన్ని అందించాలి.

## ట్రాన్స్ కో ఉద్యోగి కుటుంబానికి రూ. కోటి బీమా చెక్కు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 18: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన ట్రాన్స్ కో ఉద్యోగి మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 1 కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అసెంబ్లీలోని తన చాంబర్లో మృతుడి తల్లి (నామిని)కి ఈ పరిహారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కేవీ సబ్స్టేషన్లో జూనియర్ లైన్మన్ గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్ ఇంటికి వెళ్తుండగా జరిగినరోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీ ట్రాన్స్కో ఉద్యోగులకు ఎస్బీఐ శాలరీ ప్యాకేజీ కింద కల్పిస్తున్న ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధితుడి కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చేసి, ఆగస్టు 20న రూ. 1 కోటి పరిహారాన్ని మృతుడి తల్లి ఖాతాకు సకాలంలో జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# భూదోపిడీపై.. త్వరలో బీజేపీ దండయాత్ర

- **ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి, పేదలకు పంచుతం**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే బాటలో పయనిస్తున్నయ్?**
- **పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తుండ్రు?**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**

హైదరాబాద్, మనం ప్రతినిధి: సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణలో రాజకీయం మరింత రాజుకుంది. అయితే, ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్లో మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు.



ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

# మాకో రూలు.. మీకో రూలు

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతి చేసుకుంటుందట. రష్యా, ఇరాన్, చైనా, భారత్లను ఒకేసారి దెబ్బతీసేలా 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' బిల్లులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఉభయసభలు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇక ట్రంప్ సంతకమే మిగిలి ఉంది. అయితే ఈ బిల్లులో అగ్రరాజ్యం తనకుతాను మినహాయింపులు ఇచ్చుకుంది. దీనిద్వారా అణు ఇంధన అవసరాలను తీర్చుకోనుంది.చమురు కొనుగోలు విషయంలో ఇతర దేశాలపై కఠిన ఆంక్షలు విధిస్తున్నప్పటికీ, తన సొంత అణు విద్యుత్ అవసరాల కోసం రష్యన్ యురేనియం దిగుమతులకు అమెరికా మినహాయింపులు ఇచ్చుకుంది. తన పౌర అణు రంగానికి అవసరమైన యురేనియం శుద్ధి లో దాదాపు 26% వరకు రష్యాపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం అమెరికాలో ఒకే ఒక్క యురేనియం శుద్ధి ప్లాంట్ మాత్రమే ఉంది. దాంతో దేశీయంగా ప్రాసెసింగ్ కొరత ఉంది. రష్యన్ ఇంధన సంస్థ 'రోసాటమ్' చాలా చౌకగా, నాణ్యమైన ప్రాసెస్డ్ యురేనియాన్ని సరఫరా చేస్తోంది. దాంతో అమెరికన్ పవర్ కంపెనీలు దశాబ్దాలుగా రష్యాపైనే ఆధారపడి ఉన్నాయి.

ఇక, అమెరికాలో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తులో దాదాపు 20 శాతం వరకు అణు విద్యుత్ ప్లాంట్ల నుంచే వస్తుంది. ఇప్పుడు ఆంక్షల బిల్లులో మినహాయింపులు ఇచ్చుకోకపోతే ఆ విద్యుత్ ఆగిపోయి, యుఎస్ పవర్ గ్రిడ్పై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రస్తుతం అమెరికా దేశీయంగా యురేనియం శుద్ధి రంగాన్ని పునరుద్ధరించడానికి బిలియన్ల డాలర్లను వెచ్చిస్తోంది. అయితే ఆ వ్యవస్థలు అందుబాటులోకి రావడానికి కొన్ని సంవత్సరాల సమయం పట్టనుంది.



# 22ఏ పరిష్కారానికి హైలెవల్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్గా సిసిఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్, సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈమేరకు జీవోఆర్టి నం.564ను జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే, మల్కాజ్గిరి ఎంపీగా ఉన్న సమయంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఉన్న రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు జీవో 118 ప్రకారం 9700 ప్లాట్ల రెగ్యులరైజేషన్కు సంబంధించిన మెమోను కూడా జారీ చేయడం జరిగిందన్నారు. ఈ జీవో ప్రకారం శనివారం నుంచే రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నామనీ, ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల కాలంగా అక్కడ ప్లాట్లు తీసుకుని ఇండ్ల నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న యజమానులు జీవో 118 ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. అలాగే, రెవెన్యూ రికార్డులలో 22ఏలో ఉండి హెచ్ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్ఎంసి అనుమతులతో లేఔట్లు వేసిన ప్రాంతాలను ఆ జాబితా నుంచి తొలగించడానికి ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన 10-12 అంశాలపై నెల రోజుల వ్యవధిలో నిర్ణయం తీసుకుని 22ఏ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వెల్లడించారు.




## పెండ్లిలో ఒక్క వంటకం మాత్రమే చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సలహాదారులు, అధికారులు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే.. ఎకానమీ క్లాస్లోనే ప్రయాణించాలని షరతు పెట్టింది. వీలైనంత వరకు వర్చువల్గానే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని అధికార యంత్రాంగాన్ని కోరింది. విదేశీ అతిథులు వచ్చిన సందర్భాల్లో మినహా.. అధికారిక విందులపైనా నిషేధం కొనసాగనుంది. సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు, కాన్ఫరెన్స్ల పేరిట అనవసరపు ఖర్చులు చేయరాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా, దుకాణాలు, వాణిజ్య సముదాయాలను రాత్రి 9 గంటలలోపే మూసివేయాలని కోరింది. రెస్టారంట్లు, కేఫ్లను మాత్రం రాత్రి 11 గంటల వరకు నిర్వహించుకోవచ్చని ప్రకటించింది.

## హరీశ్ రావు భూములపై కాంగ్రెస్ నజర్

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆర్డీవో నుంచి తీసుకున్నారని ఆరోపించారు. ఎన్హెచ్ రాజీవ్ రహదారిపై ఉన్న 6.18 ఎకరాల భూమిని హనుమంతరావు పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారనీ, కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో అసైన్డ్ భూమిని అధికార దుర్వినియోగం చేసి తమ పేరు మీద బదలాయించుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఎన్వోసీలు దొరికే పరిస్థితి లేదనీ, రంగనాయకసాగర్ ప్రాజెక్టు కోసం 2212 ఎకరాలను తీసుకుని చివరకు అందులో 30 ఎకరాలను పక్కనబెట్టారని వివరించారు. ఆ 30 ఎకరాల్లో 13 ఎకరాల 20 గుంటలు హరీష్రావు 2028లో తీసుకున్నారనీ, హరీష్ రావు తీసుకున్న భూమి చుట్టూ సుడా పార్క్ను ఏర్పాటు చేశారని తెలిపారు. టెండర్లు లేకుండా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో తన భూమికి 5 కోట్ల 30 లక్షలతో బ్లాక్టాప్ రోడ్డు నిర్మించుకున్నారని తెలిపారు. ఇరిగేషన్ శాఖకు భూమిని బదిలీ చేసి హరీష్ రావు ఎందుకు తీసుకున్నారు? తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే క్షేత్రస్థాయిలో పర్యటించామని ఈ సందర్భంగా చామల వెల్లడించారు. కాగా, సిద్దిపేట పర్యటనకు ముందు కాంగ్రెస్ ఎంపీలు ఎమ్మెల్సీలు ఎంపీ మల్లురవి నేతృత్వంలో అసెంబ్లీలోని చాంబర్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. హడావుడి కార్యక్రమాలు సరికాదని వారికి సూచించారు. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భూ కబ్జా వ్యవహారాలు ప్రజలకు తెలియజెప్పడానికి క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు అభిప్రాయపడ్డారు.

## జపాన్లో తెలంగాణ యువతకు ఉపాధి

హైదరాబాద్, సెప్టెంబర్ 18: తెలంగాణ యువతకు జపాన్లో నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్) జపాన్కు చెందిన పోగ్లీ సంస్థల మధ్య శుక్రవారం సచివాలయంలో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. మంత్రి వివేక్ వెంకటస్వామి, శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన సమక్షంలో టామ్కామ్ ఎండీ కాంతి వెస్లీ, పోగ్లీ సీఈవో డాక్టర్ కరుణ్ మల్హోత్రా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తొలి ఏడాదిలో 400 నుంచి 500 మంది తెలంగాణ యువతకు జపాన్లో ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జపాన్లోని కన్సాయ్ ప్రాంతం సహా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలను గుర్తించడం పోగ్లీ సంస్థ బాధ్యత కాగా.. అభ్యర్థుల ఎంపిక, జపనీస్ భాషా శిక్షణ, డాక్యుమెంటేషన్ తదితర వ్యవహారాలను టామ్కామ్ చూసుకుంటుంది. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. విదేశాల్లో తెలంగాణ యువతకు సురక్షితమైన, పారదర్శకమైన, దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన మన యువతకు అవకాశాలు దక్కేలా టామ్కామ్ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# పెట్రోల్ పంపుల్లో డిజిటల్ పేమెంట్స్ బంద్?

**ఎండీఆర్ ఉపసంహరించకపోతే వినియోగదారులపై యూపీఐ బండ**




ఢిల్లీ, సెప్టెంబర్ 18: ఇంధన కొనుగోళ్లపై కొత్తగా ప్రతిపాదించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) భారాన్ని ఉపసంహరించుకోవాలని, లేదా పెట్రోల్ పంపులకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ తమకు మినహాయింపు ఇవ్వకపోతే, రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే యూపీఐ డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు మాత్రమే స్వీకరిస్తామని వివిధ రాష్ట్రాల పెట్రోలియం డీలర్లు స్పష్టం చేశారు.

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సవరించిన యూపీఐ ఫ్రేమ్ వర్క్ ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి పెట్రోల్ పంపుల్లో రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధనాన్ని కొనుగోలు చేసి యూపీఐ ద్వారా చెల్లిస్తే రూ.5 ఫ్లాట్ యూపీఐ రుసుము వర్తిస్తుంది. అయితే రూ. 2,000 కంటే తక్కువ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు.ఈ కొత్త నిబంధనపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీ-ఎన్సీఆర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ముంబై, కర్ణాటక, రాజస్థాన్, జమ్మూకశ్మీర్ సహా పలు రాష్ట్రాలకు చెందిన డీలర్లు దీనిని వ్యతిరేకిస్తున్నారు. పెట్రోల్ పంప్ నిర్వాహకులకు లీటరుకు రూ.2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే కమీషన్ లభిస్తుందని, ఇంధన ధరల నిర్ణయం తమ చేతుల్లో ఉండదని వారు స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో ప్రతి లావాదేవీపై రూ. 5 చొప్పున పడితే తమ మార్జిన్లపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వినియోగదారులపై యూపీఐ బండ..**

వాహనదారులు, కమర్షియల్ వాహనాల యజమానులు ఎక్కువగా రూ.2,000 కంటే ఎక్కువ మొత్తానికే ఇంధనం కోనుగోలు చేస్తుంటారు. అక్టోబర్ 15 నాటికి తమ డిమాండ్ నెరవేరకపోతే యూపీఐ సేవలు నిలిపివేస్తామని ముంబై సహా పలు ప్రాంతాల డీలర్లు పేర్కొనడంతో, వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వి బూటకపు పర్యటనలు

**దళితుల భూములను కేసీఆర్ కబ్జా చేయలేదని తేలితే రేవంత్ రాజీనామా చేస్తరా?**

సిద్ధిపేట సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి): ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, తన వ్యవసాయ భూమి వద్దకు కాంగ్రెస్ ఎంపీల పర్యటన ఇందులో భాగమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు పేర్కొన్నారు.

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22అ నిషేధిత జాబితాలో లక్షలాది ఎకరాలు పెట్టి, ప్రజలను నరకయాతనకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. 30 లక్షల ఎకరాలను 22అ లో పెడితే ఆ రైతులు, ప్రజలు ఎంతో ఇబ్బందికి గురవుతున్నారన్నారు.ముఖ్యమంత్రి తమ్ముళ్ల భూ కుంభకోణాలను, మంత్రి పొంగులేటి ఆయన కొడుకు చేస్తున్న భూ దందాలను ఎండగట్టడంతో తమపై ఎదురుదాడి చేస్తున్నారన్నారు. కేటీఆర్ , కృష్ణారావు సస్పెన్షన్ ఎత్తివేయాలని, సభకు వస్తామని కోరినా వినలేదనీ సభలో ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వ బండారం బయటపడుతుందనే దురుద్దేశంతోనే సస్పెండ్ చేసి ఏకపక్షంగా సభను నడిపారన్నారు.

స్థానిక ఎమ్మెల్యేగా వారిని స్వాగతించి, భోజనానికి ఆహ్వానించి దగ్గరుండి నేనే నా వ్యవసాయ భూమిని చూపిస్తానని, వారి అనుమానాలు నివృత్తి చేస్తానని చెప్పానన్నారు.

**నాది సాధారణవ్యవసాయ క్షేత్రం**

నా వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్ హౌస్ ఉందని ముఖ్యమంత్రి అన్నారని, విలాసవంతమైన భవనాలు కాదు కదా, కనీసం ఒక బాత్రూం కూడా లేదన్నారు. సిద్దిపేట పరిధిలోని రంగదాంపల్లి, ఎన్సాన్ పల్లి, మిట్టపల్లి, పొన్నాల తదితర ప్రాంతాల్లో సుమారు 3,000 ఇళ్ల ప్లాట్లను 22అ లో పెట్టారన్నారు.

సిద్దిపేట పై కక్ష కట్టారని కేసీఆర్ మంజూరు చేసిన వెయ్యి పడకల ఆసుపత్రి పనులు 90 శాతం పూర్తయితే కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులను చేయకుండా పక్కనపెట్టిందన్నారు. అర్థాంతరంగా ఆగిపోయిన నర్సింగ్ కాలేజీ పనులు, రంగనాయక సాగర్ వద్ద వంద కోట్లతో చేపట్టి నిలిచిపోయిన టూరిజం ప్రాజెక్టును ఎంపీల పరిశీలిస్తే బాగుంటుందన్నారు.

**సిద్దిపేట పై యుద్ధానికి వచ్చినట్టు ఉంది**

ఎంపీల పర్యటన సిద్దిపేట పై యుద్ధానికి వచ్చినట్లు కనిపించిందని హరీష్ రావు పేర్కొన్నారు. ఐజీ, డీఐజీ, కమిషనర్, అడిషనల్ డీజీ, లా అండ్ ఆర్డర్, డీఎస్పీలు, సీఐలతో కలిపి 3,000 మంది పోలీసులు, డ్రోన్ కెమెరాలు, బుల్లెట్ ప్రూఫ్ బస్సులతో ఏదో యుద్ధానికి వస్తున్నట్లు సిద్దిపేట మీదికి వచ్చారన్నారు. దీంతో ప్రజా ధనాన్ని, ప్రభుత్వ సమయాన్ని ఎంత వృథా చేశారో ప్రజలు గుర్తించాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని మెట్రో ఫేజ్-2 కు, పాలమూరు ఎత్తిపోతల, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతుల సాధన కోసం, రాష్ట్ర హక్కుల కోసం, పెండింగ్ లో ఉన్న పలు పనుల పూర్తి కోసం కలిసికట్టుగా కేంద్రంపై పోరాడ వలసింది పోయి రాజకీయ కక్షసాధింపుల కోసం యాత్రలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.

**వ్యవసాయ భూమి ని విడుతలవారీగా కొనుగోలు చేశాను**

వ్యవసాయ భూమిని 2018 నుంచి 2024 కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి విడతల వారీగా కొనుగోలు చేశానని హరీష్ రావు తెలిపారు. రైతులు నాకు చూపించిన మ్యాప్/హద్దుల ప్రకారమే నేను కొన్నాన ని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తహసీల్దార్, సర్వేయర్ వచ్చి సర్వే చేసి నా భూమికి హద్దులు చూపించారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న 13 ఎకరాల 12 గుంటలకు సర్వే తర్వాత 13 ఎకరాల 10 గుంటల స్వాధీనంలో మాత్రమే ఉన్నానని, 2 గుంటలు తక్కువే ఉన్నట్లు చెప్పారు.

**కేసీఆర్ భూముల్లో దళితుల భూములు లేకుంటే సీఎం రాజీనామా చేస్తరా?**

అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ 300 ఎకరాల దళితుల భూమిని కబ్జా చేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ భూముల్లో దళితుల భూమి లేదని తేలితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొండపోచమ్మ, రంగనాయక, మల్లన్న సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు ఎత్తిపోయకుండా రైతుల పొట్టగొడుతున్న ట్లు హరీష్ రావు ఆరోపించారు.దండయాత్రలు చేసినా, అక్రమ కేసులు పెట్టి బురద రాజకీయాలు చేసినా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.



# జాతీయ జెండాను రాజకీయాల్లోకి లాగొద్దు

## అది ఏ ఒక్క పార్టీదో కాదు.. భారతీయులందరిదీ

## హైదరాబాద్ సంస్థాన విలీన సమయానికి బీజేపీ పుట్టనే లేదు

## కాషాయ పార్టీ కామెంట్లకు పొన్నం ప్రభాకర్ ఖండన

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** జాతీయ జెండాను రాజకీయాల్లోకి లాగొద్దని, ఆ జెండా ఏ ఒక్క పార్టీ సొంతం కాదని, అది దేశ ప్రజలందరిదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సెప్టెంబరు 17 సందర్భంగా గురువారం బీజేపీ నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ నేతలు చేసిన విమర్శలపై ఆయనొక ప్రకటనలో స్పందించారు. 'సెప్టెంబరు 17న జాతీయ జెండాను ఎగురవేయడం బీజేపీకి మాత్రమే వచ్చిన కొత్త ఆలోచన కాదు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అన్ని జిల్లాల్లోని కలెక్టరేట్లు, ప్రభుత్వాఫీసులు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసింది. ముఖ్యమంత్రి, మంత్రులు కూడా అధికారిక కార్యక్రమాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేసుకున్నాం. 'మేమే జాతీయ జెండా ఎగురవేస్తున్నాం.. మిగతావారు ఎగురవేయడం లేదు' అన్న ప్రచారం పూర్తిగా రాజకీయ ప్రయోజనం కోసం చేస్తున్నది. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని స్మరించుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదు కానీ, అదే సమయంలో ఈ చరిత్రను ఒక పార్టీకి, ఒక సిద్ధాంతానికి మాత్రమే చెందినదిగా చూపించే ప్రయత్నం చేయడం సరికాదు. ఆ సమయంలో మీ పార్టీ పుట్టనే లేదు.. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు మాత్రమే ఉద్యమాలు నిర్వహించాయి' అని పొన్నం వివరించారు.

# 9 మందికి జీవిత ఖైదు

## మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు




**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** మానవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 9 మందికి జీవిత ఖైదుతో పాటు రూ.1.37 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా 3 నెలల సాధారణ జైలు శిక్ష అమలు చేయాలని ఆదేశించింది. శిక్ష పడిన వారిలో 8 మంది బంగ్లాదేశ్కు చెందినవారు ఉన్నట్లు ఎన్ఐఏ తెలిపింది. బంగ్లాదేశ్ మహిళలను అక్రమంగా భారత్ కు తీసుకొచ్చినట్లు 2019 సెప్టెంబర్లో పహాడీ షరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఉద్యోగాలు, మంచి వేతనాలు ఇప్పిస్తామంటూ నమ్మించి వారిని బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2019లో కేసు నమోదు అనంతరం జల్పల్లిలోని వ్యభిచార గృహంపై పహాడీ షరీఫ్ పోలీసులు దాడి చేసి ముగ్గురు బంగ్లాదేశ్ మహిళలకు విముక్తి కల్పించారు. బాలాపూర్ మహమూద్ కాలనీలోని ఓ ఇంటి నుంచి మరో మహిళను రక్షించారు. అనంతరం ఈ కేసును ఎన్ఐఏ అధికారులు రీ రిజిస్టర్ చేశారు. మొత్తం 12 మందిపై 2020 అక్టోబర్ 17న ఛార్జిషీట్ దాఖలు చేశారు. తెలంగాణ, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో పలువురు నిందితులను అరెస్ట్ చేశారు. ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎన్ఐఏ తెలియజేసింది.




# ఆర్టీసీలో కారుణ్య నియామకాల క్రమబద్ధీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కారుణ్య నియామకాలు (బ్రెడ్ విన్నర్ స్కీమ్), మెడికల్ ఇన్వాలిడేషన్ స్కీమ్ కింద పనిచేస్తున్న సిబ్బందికి యాజమాన్యం శుభవార్త చెప్పింది. కన్సాలిడేటెడ్ పే కింద సేవలందిస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ (రెగ్యులరైజ్) ఆర్టీసీ ఎండీ సర్క్యులర్ జారీ చేశారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన డ్రైవర్ గ్రేడ్-2, కండక్టర్ గ్రేడ్-2, ఆర్టీసీ కానిస్టేబుల్, శ్రామిక్ ఉద్యోగులు రెగ్యులర్ కావడానికి మూడేళ్ల కన్సాలిడేటెడ్ పే, ఆపై అసెస్మెంట్ టెస్ట్, అలాగే ఏడాదికి కనీసం 240 పనిదినాలు ఉండాల్సి వచ్చేది. ఆ తర్వాత ఈ గడువును రెండేళ్లకు కుదించినప్పటికీ, తాజాగా కార్పొరేషన్ బోర్డు తీసుకున్న నిర్ణయం మేరకు ఆ షరతులన్నింటినీ పూర్తిగా తొలగించారు. కార్పొరేషన్ బోర్డు ఆమోదం తెలిపిన తేదీ (12.08.2026) నుంచే ఈ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని నియామక అధికారులను ఎండీ ఆదేశించారు. దీనికి సంబంధించి ఎలాంటి రెండేళ్ల సర్వీస్ నిబంధన గానీ, ఏడాదికి 240 రోజుల పనిదినాల నిబంధన గానీ అవసరం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ పథకాల కింద చేపట్టే నియామకాలను సైతం మొదటి నుంచే నేరుగా రెగ్యులర్ ప్రాతిపదికనే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులు, అనారోగ్యం, గైర్హాజరు లేదా పుట్-ఆఫ్ డ్యూటీలో ఉన్న ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరిన తేదీ నుంచి వారి సర్వీసును క్రమబద్ధీకరించనున్నట్లు సర్క్యులర్లో పేర్కొన్నారు. కార్పొరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంతో వందలాది కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# చెబితే... నేనే పొలం చూపించేవాడ్ని

## సిద్దిపేట భూముల పరిశీలనపై హరీశ్ వ్యాఖ్య

## 3,000 మంది పోలీసుల మోహరింపు.. ఆశ్చర్యం కలిగించింది?

## కాంగ్రెస్ నేతలకు హరీశ్‌రావు హితవు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** సిద్దిపేటలో తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై స్పందించిన హరీశ్.. సిద్దిపేట మా 'ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి పెట్టింది పేరు అన్నారు.

అటువంటి ఈ ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు? అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

# మా ఆస్తులు తీసుకొని 1,000 కోట్లివ్వండి

## రేవంత్‌కు కేటీఆర్ భారీ ఆఫర్

## మిగిలిన రూ.99,000 కోట్లతో ప్రజలకిచ్చిన హామీలు అమలుజేయండి?

## బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా మారింది?

## కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి.. అసత్య ప్రచారమే: కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. 'మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను అని అన్నారు. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయాలని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే? తమపై అక్రమ కేసులు బనాయించారని కేటీఆర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# ఆ ఫామ్ హౌస్ నాదే?

## జన్వాడ ఫామ్ హౌస్‌తో కేటీఆర్‌కు సంబంధమే లేదు?

## స్పష్టంచేసిన యజమాని ప్రదీప్ రెడ్డి

## కేటీఆర్‌కు లీజుకు ఇచ్చా.. అందులో ఎలాంటి భూ వివాదాలు లేవు?

## రాజకీయ పార్టీల నేతలు తనిఖీకి రావడం సరికాదు?

## చట్టప్రకారం ఏ విచారణకైనా సహకరిస్తా : యజమాని ప్రదీప్ రెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన జన్వాడ ఫామ్ హౌస్ వివాదంపై దాని యజమాని ప్రదీప్ రెడ్డి స్పందించారు. ఆ ఫామ్‌హౌస్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి సంబంధం లేదన్నారు. అది తన వ్యక్తిగత ఆస్తి అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నేతలు ఫామ్ హౌస్‌ను సందర్శించాలని యోచిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ... 'జన్వాడలోని ఫామ్ హౌస్ భూమి నాది అని ఆయన అన్నారు. కేటీఆర్, తాను చిన్ననాటి స్నేహితులం అని అన్నారు. ఆ ఫామ్ హౌస్‌ను కేటీఆర్‌కు లీజుకు ఇచ్చానన్నారు. అంతకుమించి దీనితో ఆయనకు ఎటువంటి సంబంధం లేదు?' అని తెలిపారు. ఆ భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేవన్నారు. అన్ని పత్రాలు చట్టబద్ధంగా, సక్రమంగా తనదగ్గరే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వానికి గానీ, సంబంధిత అధికారులకు గానీ ఏవైనా అనుమానాలుంటే, తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్ రెడ్డి సూచించారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే, ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నేతలు వచ్చి తనిఖీలు చేయడం, దీనిని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టప్రకారం జరిగే ఎటువంటి విచారణకైనా తాను పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎల్ నినో ప్రభావంపై ముందస్తు చర్యలు

## రైతులు, తాగునీరు, పశుసంపద, విద్యుత్ రంగాలపై ప్రత్యేక దృష్టి

## 17 జిల్లాల్లో 20 నుంచి 46 శాతం వరకు తక్కువ వర్షపాతం

## రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనసభలో ఎల్నినోపై జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి మాట్లాడారు. ఎల్నినో గతంలో 1951, 1965, 1972, 1982, 1987, 2002, 2015 సంవత్సరాల్లో వచ్చినప్పటికీ ఈసారి మాత్రం చాలా క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే గణనీయమైన లోటు నమోదవుతోందని తెలిపారు.

ఈ నెల 10వ తేదీ వరకు నమోదైన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరిలో 21 శాతం, హైదరాబాద్లో 22 శాతం, మెదక్లో 23 శాతం, వికారాబాద్లో 26 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 28 శాతం, జనగామలో 30 శాతం, ఆదిలాబాద్లో 31 శాతం, మహబూబ్నగర్లో 32 శాతం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండలో 33 శాతం, సూర్యాపేటలో 34 శాతం, వరంగల్, ఖమ్మంలో 37 శాతం, నారాయణపేటలో 38 శాతం, నాగర్కర్నూల్లో 39 శాతం, వనపర్తిలో 41 శాతం, హనుమకొండలో 42 శాతం, జోగులాంబ గద్వాలలో 46 శాతం వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు. కొన్ని మండలాల్లో ఒకేసారి క్లౌడ్ బరెస్ట్ జరిగినట్లు ఒక నెలలో పడాల్సిన వర్షం ఒక గంటలో కురిస్తే రికార్డులలో వర్షపాతం నమోదైనా వాస్తవానికి ఆనీరు ప్రజలకు ఉపయోగపడదని వివరించారు.

### ముఖ్యమంత్రి స్థాయిలో ముందస్తు సమీక్షలు

ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి గారు ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారని , తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేయాలి, అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో మండలాలు, ప్రధాన గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. జూలై 17న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఎల్నినో ప్రభావం, దాని వల్ల రాబోయే పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. కేబినెట్ నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నష్టనివారణ చర్యలు చేపట్టారని చెప్పారు.

### 33 లక్షల పంప్సెట్లకు నిరంతర విద్యుత్

వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లపై ఆధారపడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 33 లక్షల పంప్సెట్లు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. దీంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిందన్నారు. సెప్టెంబర్ 9న రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సుమారు 19,575 మెగావాట్లకు చేరిందని, ఇలాంటి పరిస్థితుల్లోనూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడటానికి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

### పశుసంపదపైనా ప్రత్యేక దృష్టి

ఎల్నినో ప్రభావం కేవలం వ్యవసాయం, తాగునీటికే పరిమితం కాదని, పశుసంపదపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి అన్నారు. పశువులకు మేత, నీటి లభ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని కేబినెట్లోనే పశుసంవర్ధక, వ్యవసాయ శాఖలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

### కేంద్రం నుంచి అన్నిరంగాల్లో సహకారం అవసరం

ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని మంత్రి కోరారు. ఇప్పటికే రాష్ట్ర కేబినెట్ కేంద్ర సహకారం కోరుతూ తీర్మానం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారని తెలిపారు.

తెలంగాణ ప్రజలను ఎల్నినో ప్రభావం నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ముందస్తు చర్యలు తీసుకుంటోందని కేంద్ర ప్రభుత్వం కూడా పెద్దన్న పాత్ర పోషించి అన్ని రంగాల్లో రాష్ట్రానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి పొంగులేటి కోరారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఇదేనని మంత్రి పేర్కొన్నారు.

# దానంపై అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రిబ్యునల్ 2026 మార్చి 11న పిటిషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. ఈదానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. మరుసటి రోజుకి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

### దానం రాజీనామా చేయాలి?.. హైకోర్టు తీర్పు చెంపపెట్టు : ఏలేటి

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును బీజేపీ తీవ్రంగా స్వాగతించింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

దానం నాగేందర్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున, ఆ వెంటనే బీజేపీ తరపున కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవాలనే కాంగ్రెస్ కుట్రలకు ఈ తీర్పు చెంపపెట్టు అని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు.

### ఇది ప్రజాస్వామ్య విజయం..

మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఆరు నెలల వ్యవధిలోనే రాజ్యాంగబద్ధమైన తీర్పు రావడం చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తీరుకు ఈ తీర్పు సరైన సమాధానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువలతో కూడిన రాజకీయం కోసం హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాయని అభిప్రాయపడ్డారు.

# ఉప ఎన్నికల్లో మళ్లీ గెలుస్తా

## సుప్రీంకోర్టుకు పోయే ఆలోచన లేదు

## హైకోర్టు తీర్పుపై దానం స్పందన



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఎట్టకేలకు తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, తన తదుపరి నిర్ణయాన్ని మీడియా సమావేశంలో వెల్లడిస్తానని అన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... 'ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం అని అన్నారు. తనకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు. గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.

# సత్యమేవ జయతే

## ఇతర ఫిరాయింపుదారులకు కూడా ఇదే గతి

## దానం అనర్హత వేటుపై కేటీఆర్ ట్వీట్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయడంపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. తెలంగాణ హైకోర్టు దారంపై అనర్హత వేటు వేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సత్యమేవ జయతే అంటూ పోస్ట్ పెట్టారు. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందని పేర్కొన్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి, ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే ఆయనపై నమోదైన ఫిరాయింపులపై స్పీకర్ క్లీన్ చీట్ ఇచ్చినా.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు హైకోర్టుకు ఎక్కడంతో తీర్పు దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా వచ్చింది. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. శుక్రవారం రోజున తీర్పు వెలువరించింది. చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం.. స్పీకర్ గడ్డం ప్రసాద్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. తాజా తీర్పులో దానం నాగేందర్‌ను ఆయన ఎంపీగా పోటీ చేసినప్పటి నుంచే అనర్హుడిగా హైకోర్టు పేర్కొంది. అయితే, ఇప్పుడు ఈ తీర్పు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఇప్పటికే కొనసాగుతున్న న్యాయపరమైన వివాదానికి ఈ తీర్పు మరో కీలక మలుపుగా మారింది. దానం నాగేందర్ అనర్హతపై వెలువడిన హైకోర్టు తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్ల విషయంలో తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# యువతకు ఏవియేషన్ శిక్షణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలోని యువతకు ఏవియేషన్ రంగంలో శిక్షణ నిచ్చేందుకుగాను హైదరాబాద్ పాత ఎయిర్ పోర్ట్ లోని తెలంగాణా రాష్ట్ర ఏవియేషన్ ఆకాడమి తో రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.



## శాస్త్రవేత్త - సాహిత్యవేత్త

లోకం పట్టించుకోకున్నవాటిని గమనిస్తూ,
క్షణక్షణజిజ్ఞాసియై
ప్రకృతిలోని
ప్రతిపరిణామాన్ని పరిశీలిస్తూ
మనిషికి అంతుపట్టని
విషయాల గురించి
ఆలోచిస్తూ కారణాలను
కనుక్కుంటూ
అనంతవిశ్వంలోని
నీహారికల గురించీ
ఖగోళ రహస్యాల గురించి
పరిశోధిస్తూ
మానవశ్రేయస్సు కోసం
నిత్యాన్వేషియై
పరిశోధనల ఫలితాలను ఆవిష్కరిస్తూ
విజ్ఞానశాస్త్రాలకు
పుష్టిని సమకూరుస్తూ
మనిషిని -మూఢత్వం నుండి బైటికి తెస్తూ
వివేకిగా తీర్చిదిద్దుతున్నవాడు శాస్త్రవేత్త!

లోకం తనను అపార్థం చేసుకుంటున్నా,
తరచూ దారి తప్పే సమాజాన్ని
తిరిగి దారిలో పెట్టడానికి ప్రయత్నిస్తూ
మనుషుల జీవితాల్లోని,
అంతరంగాల్లోని
ఆనందాకాశాలనూ
ఆవేదనల అగాధాలనూ
లోకానికి వివరించడానికి
గుప్పిట పట్టుకునీ
మనిషి ఊహాలోకాలకూ
రూపాలు కల్పిస్తూ
మనిషి చూసీ,వినీ వదిలేసినవాటినీ
కవియై,రచయితయై
విశిష్టదృష్టితో చూస్తూ
సమాజవైద్యుడిగా,మానసికవైద్యుడిగా
సమయసందర్భోచితంగా ఆలోచిస్తూ
అనితరసాధ్యవాగ్విభవనైపుణితో వర్ణిస్తూ
కవితా,కావ్య,కథాదులను రచిస్తూ
మనుషుల హృదయాలను
విశాలం చేస్తూ
ఆలోచనలను ఉన్నతం చేస్తూ
లోకహితం చెబుతూ వెలుగులోకి
నడిపించేవాడు సాహిత్యవేత్త!!

- 'రఘువర్మ'
9290093933

# సభా మర్యాదలు... రాజకీయ ఉద్రిక్తత



ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు కేవలం చట్టాల రూపకల్పనకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల నైతిక విలువలకు ప్రతిబింబంగా నిలిచే ప్రవర్తనా ప్రమాణాల కేంద్రాలుగా కూడా భావించబడతాయి. ఈ నేపథ్యంలో సభ్యుల ప్రవర్తనను నియంత్రించడం, సభాగౌరవాన్ని కాపాడడం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం వంటి లక్ష్యాలతో ఎథిక్స్ కమిటీ అనే వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఇటీవలి కాలంలో పాడి కౌశిక్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలతో మళ్లీ ఈ కమిటీ ప్రాధాన్యం ప్రజల్లో చర్చనీయాంశమవుతోంది. కడియం శ్రీహరి వైపు చూసి సంజ్ఞలు చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగించడం, శాసన వ్యవస్థలో నైతిక ప్రమాణాలపై మళ్లీ దృష్టిని కేంద్రీకరించింది.

ఎథిక్స్ కమిటీ పుట్టుకను పరిశీలిస్తే, ఇది భారతదేశానికి మాత్రమే పరిమితమైన వ్యవస్థ కాదు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలలో చట్టసభల గౌరవాన్ని కాపాడేందుకు ఇటువంటి కమిటీలు ఏర్పాటయ్యాయి. ముఖ్యంగా బ్రిటిష్ పార్లమెంటరీ సంప్రదాయాల ప్రభావంతో, సభ్యుల ప్రవర్తనను పర్యవేక్షించే విధానాలు అభివృద్ధి చెందాయి. భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత ప్రారంభ దశలో స్పీకర్ అధికారాల ద్వారా సభ్యుల ప్రవర్తనను నియంత్రించే ప్రయత్నాలు జరిగాయి. అయితే కాలక్రమేణా సభా కార్యకలాపాలు విస్తరించడంతో పాటు, రాజకీయ పోటీ తీవ్రత పెరగడంతో ప్రత్యేకంగా నైతిక అంశాలను పరిశీలించే కమిటీ అవసరం ఏర్పడింది.

ఈ నేపథ్యంలో రాజ్యసభలో 1997లో ఎథిక్స్ కమిటీ ఏర్పాటు చేయడం ఒక కీలక మలుపుగా నిలిచింది. అప్పటి ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ ఛైర్మన్ కె.ఆర్. నారాయణన్ 1997 మార్చి 4న ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారికంగా 1997 మే 30న ఇది ప్రారంభమైంది. రాజ్యసభ ఎథిక్స్ కమిటీకి మొదటి అధ్యక్షుడిగా ఎస్.బి. చవాన్ వ్యవహరించారు.

తరువాత లోక్‌సభలో కూడా 2000లో ఎథిక్స్ కమిటీ ఏర్పాటు చేశారు. 13వ లోక్‌సభ సమయంలో, అప్పటి స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి ఈ కమిటీని 2000 మే 16న అడ్-హాక్ (తాత్కాలిక) కమిటీగా ఏర్పాటు చేశారు. లోక్‌సభ మొదటి ఎథిక్స్ కమిటీకి మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. పై రెండు సంఘటనలు భారత పార్లమెంటరీ చరిత్రలో ముఖ్యమైన దశలుగా గుర్తించ బడతాయి. ఈ కమిటీల ప్రధాన ఉద్దేశ్యం సభ్యుల ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడం, నైతిక ప్రమాణాలను నిర్వచించడం, అవసరమైతే చర్యలను సూచించడం. రాష్ట్ర శాసనసభలు కూడా ఈ నమూనాను అనుసరించి తమ తమ ఎథిక్స్ కమిటీలను ఏర్పాటు చేశాయి. పూర్వాపరాలను విశ్లేషిస్తే, ఎథిక్స్ కమిటీలు ఏర్పడడానికి ప్రధాన కారణం రాజకీయ వ్యవస్థలో పెరుగుతున్న అసహన వాతావరణం. 1980ల తర్వాత భారత రాజకీయాల్లో కూటమి రాజకీయాలు, ప్రాంతీయపార్టీల ఎదుగుదల, మీడియా విస్తరణ వంటి అంశాలు రాజకీయ పోటీని మరింత కఠినతరం చేశాయి. ఈ పరిస్థితుల్లో సభల్లో వాగ్వాదాలు, వ్యక్తిగత విమర్శలు, అనుచిత ప్రవర్తన పెరిగాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కేవలం స్పీకర్ చర్యలు సరిపోకపోవడంతో, ప్రత్యేక కమిటీ అవసరమైంది.

ఎథిక్స్ కమిటీ పనితీరును పరిశీలిస్తే, ఇది సాధారణ విచారణ కమిటీ కంటే విభిన్నంగా ఉంటుంది. సభ్యులపై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా పరిశీలించి, సాక్ష్యాలను సేకరించి, సంబంధిత సభ్యులకు వాదనకు అవకాశం ఇచ్చి, చివరగా నివేదికను సభకు సమర్పిస్తుంది. ఈ నివేదిక ఆధారంగా సభ చర్యలు తీసుకుంటుంది. సాధారణంగా మందలింపు, గమనిక, సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సభ్యుని ప్రవర్తన తీవ్రంగా ఉంటే మరింత కఠిన చర్యలు కూడా సూచించబడతాయి.

గణాంకాల దృష్ట్యా పరిశీలిస్తే, గత మూడు దశాబ్దాల్లో భారత పార్లమెంట్ మరియు రాష్ట్ర శాసనసభలలో ఎథిక్స్ కమిటీలకు వెళ్లిన కేసుల సంఖ్య క్రమంగా పెరిగింది. సుమారు 50కు పైగా ప్రధాన కేసులు నమోదయ్యాయి. అందులో దాదాపు 65 శాతం కేసుల్లో సభ్యులకు గమనికలు లేదా మందలింపులు విధించగా, 20 శాతం కేసుల్లో సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకున్నారు. మిగతా కేసుల్లో సరిపడిన సాక్ష్యాలు లభించకపోవడంతో విచారణ ముగిసింది. ఈ గణాంకాలు కమిటీల ప్రాముఖ్యతను మాత్రమే కాకుండా, సభ్యుల ప్రవర్తనపై పెరుగుతున్న ఆందోళనను కూడా సూచిస్తున్నాయి.

ప్రస్తుతం జరిగిన పాడి కౌశిక్ రెడ్డి ఘటనను ఈ విస్తృత నేపథ్యంలో చూడాలి. శాసనసభలో జరిగిన ఈ సంఘటనలో ఆయన సంజ్ఞలు సభా మర్యాదలకు విరుద్ధమని ఆరోపణలు రావడంతో, ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగించారు. ఇది ఒక విధంగా శాసనసభ తన గౌరవాన్ని కాపాడేందుకు తీసుకున్న బాధ్యతాయుత నిర్ణయంగా చెప్పవచ్చు. కమిటీ ఈ వ్యవహారాన్ని విచారించే సమయంలో వీడియో రికార్డులు, సభ్యుల వాంగ్మూలాలు, సభా రికార్డులను పరిశీలించి నిజానిజాలను వెలికితీసే అవకాశం ఉంది.

ఈ ఘటన రాజకీయ పరంగా కూడా ప్రాధాన్యత కలిగినదే. ప్రతిపక్షం ఈ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్తూ సభా విలువలను కాపాడాలని డిమాండ్ చేస్తుండగా, అధికార పక్షం కమిటీ నిర్ణయాన్ని గౌరవించాలని సూచిస్తోంది. ఈ పరిస్థితుల్లో కమిటీ తీర్పు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రజల్లో రాజకీయ నాయకుల ప్రవర్తనపై ఉన్న అభిప్రాయాలను ఇది ప్రభావితం చేయగలదు.

ఎథిక్స్ కమిటీ అవసరాన్ని విశ్లేషిస్తే, ఇది కేవలం శిక్షా విధానం కోసం మాత్రమే కాదు. సభ్యులలో బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించడం, సభా సంస్కృతిని పరిరక్షించడం, ప్రజాస్వామ్య విలువలను బలపరచడం వంటి లక్ష్యాలను సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ప్రజలు తమ ప్రతినిధులను ఆదర్శంగా భావించే పరిస్థితుల్లో, వారి ప్రవర్తనలో నైతిక ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. ఈ నేపథ్యంలో ఎథిక్స్ కమిటీ ఒక నియంత్రణ వ్యవస్థగా పనిచేస్తుంది.

అయితే ఈ కమిటీల పనితీరుపై కూడా కొన్ని విమర్శలు ఉన్నాయి. కొందరు విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కమిటీలు రాజకీయ ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. సభ్యులపై చర్యలు తీసుకునే విషయంలో పార్టీ అనుబంధాలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమిటీలను మరింత స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేసేలా సంస్కరణలు అవసరం అనే అభిప్రాయం బలపడుతోంది.

భవిష్యత్తు దృష్ట్యా ఎథిక్స్ కమిటీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. సభ్యులకు ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, సభా నియమాలను కఠినంగా అమలు చేయడం, చిన్న తప్పిదాలకే హెచ్చరికలు ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంటే పెద్ద వివాదాలను నివారించవచ్చు. అదేవిధంగా ప్రజలకు కూడా కమిటీ పనితీరుపై అవగాహన పెంచడం అవసరం.

మొత్తంగా... ఎథిక్స్ కమిటీలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక అవిభాజ్య భాగంగా మారాయి. శాసనసభల గౌరవాన్ని కాపాడడంలో, సభ్యుల ప్రవర్తనను నియంత్రించడంలో, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. పాడి కౌశిక్ రెడ్డి ఘటన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

ఈ సంఘటనను ఒక హెచ్చరికగా తీసుకుని, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే శాసనసభలు తమ గౌరవాన్ని నిలబెట్టుకోగలవు. ప్రజాస్వామ్యం బలపడాలంటే చట్టసభలు నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంది; ఆ దిశగా ఎథిక్స్ కమిటీలు ఒక మార్గదర్శక శక్తిగా కొనసాగాలి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# విస్తరిస్తున్న నిశ్శబ్ద విప్లవం

రోజు గడప దాటితే చాలు... రయ్... రయ్... అంటూ ఒకటే వాహన శబ్దాల రోత. పల్లెల నుంచి మొదలుకొని పట్నాల దాకా ఇదే పరిస్థితి. ఆధునిక జీవనంలో యాంత్రిక వాహనం లేనిదే మనిషి జీవితం గడిచే పరిస్థితి లేదు. అందులో భాగంగానే రవాణా కోసం వాహనాలపై ఆధారపడటం పెరిగింది. అయితే అవి శిలాజ ఇంధనాలైన పెట్రోల్ డీజిల్ ఆధారంగా నడవడం వల్ల వాటి నుంచి వెలువడే పొగ పర్యావరణాన్ని నాశనం చేస్తూనే, అవి చేసే శబ్దం శబ్ద కాలుష్యానికి కారణమవుతోంది. ఈ వాహనాల రోతకు ముగింపు ఎప్పుడొస్తుంది? వాహనాల శబ్ద కాలుష్యం, పొగ నుంచి మనిషి జీవనం దూరమయ్యే పరిస్థితి వస్తుందా? అంటే... అవుననే చెప్పాలి. రవాణా రంగంలో ప్రస్తుతం శిలాజ ఇంధనాల ఆధారిత వాహనాలకు బదులు బ్యాటరీ ఆధారిత ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. దీంతో పర్యావరణంలో కలిసే పొగ, వాహనాల రోత, శబ్దాల నుంచి మనిషికి విముక్తి కలగనుంది.

మధ్య ప్రాచ్యంలోనీ యుద్ధ పరిణామాలతో ఇంధన సంక్షోభం రావడం అలాగే చమురు ధరలు పెరగడం ప్రపంచ దృష్టిని ఇంధన ప్రత్యామ్నాయాల వైపు మార్చింది. ప్రపంచవ్యాప్తంగా రవాణా రంగంలో భారీ పరివర్తన కొనసాగుతోందని చెప్పాలి. ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలు విక్రయాలు పెరుగుతు వస్తున్నాయి. 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 20 శాతం పెరిగాయి. ప్రస్తుత విధానాలే కొనసాగితే, 2026 సంవత్సరం చివరి నాటికి ఈ వృద్ధి 28 శాతానికి చేరుతుందని, అలాగే 2035 వరకు ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల వృద్ధి రేటు 50 శాతానికి పెరుగుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వాడకంలో చైనా అన్ని దేశాల కంటే ముందు వరసలో ఉంది.

భారత్‌లోనూ ఈవీ రంగంలో విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ విధానాలు, సబ్సిడీలు, పన్ను రాయితీలు, వివిధ ప్రోత్సాహకాలతో ఈ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రవాణా రంగాన్ని మరింత పర్యావరణహితంగా మార్చే లక్ష్యంతో భారత్ 2030 నాటికి దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాల వాటా ఉండేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.



ఈ లక్ష్యం దిశగా దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. 2024-25 సంవత్సరంతో పోలిస్తే 25 శాతం వృద్ధి రేటుతో 2025-26 సంవత్సరంలో సుమారు 25 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. ఇక 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మాత్రమే సుమారు 22 లక్షల ఈవీలు విక్రయించబడటం, ఈ రంగంలో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం వాహనాల్లో ఈవీల వాటా సుమారు 9 శాతానికి చేరుకుంది. దేశంలోని ప్రధాన నగరాలు కూడా ఈ మార్పుకు వేదికలుగా మారుతున్నాయి. ముఖ్యంగా బెంగళూరు, ఢిల్లీ నగరాలు ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు, వినియోగంలో ముందంజలో ఉన్నాయి.

ఎలక్ట్రిక్ వాహనం గ్రిడ్ నుంచి తీసుకునే విద్యుత్‌లో సుమారు 60% వరకు శక్తిని నేరుగా వాహన గమనానికి ఉపయోగించగలదు. అదే సమయంలో పెట్రోల్ లేదా డీజిల్ వాహనాల్లో ఇంధనంలోని నిల్వ ఉన్న శక్తిలో కేవలం 17-21% మాత్రమే ఉపయోగపడుతుంది. మిగిలిన దాదాపు 80% శక్తి ఇంజిన్లో వేడి, శబ్దం, ఇతర నష్టాల రూపంలో వృథా అవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పర్యావరణానికి, భవిష్యత్ తరాలకు ఎంత మేలు చేస్తుంది అనేది స్పష్టమవుతున్నది. ఈవీల వినియోగం పెరిగే కొద్దీ వాటిని ఛార్జ్ చేయడానికి అవసరమైన విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుంది. కాబట్టి వీటి వల్ల నిజమైన పర్యావరణ ప్రయోజనం పొందాలంటే విద్యుత్ ఉత్పత్తి కూడా స్వచ్ఛమైన ఇంధన వనరుల నుంచి రావాలి. భారత్ ఇప్పటికే దేశ విద్యుత్ స్థాపితం సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధన వనరులైన సౌర, పవన, జల, అణు తదితర వనరుల ద్వారా ఉత్పత్తి చేస్తుంది. ఈవీలు పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయం అవుతూ, తక్కువ శక్తితో ఎక్కువ ప్రయోజనం పొందే రవాణా వ్యవస్థకు మార్గం అవుతున్నాయి. అదే సమయంలో విద్యుత్ రంగాన్ని కూడా పునరుత్పాదక ఇంధనాల వైపు తీసుకెళ్తే, రవాణా రంగంలో కాలుష్యం, చమురు దిగుమతులు, ఇంధన వినియోగం గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. భారత రవాణా భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాల వైపే సాగాల్సిన అవసరం ఉంది. దశలవారీగా పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఈవీలను స్వీకరించడం భవిష్యత్తు అవసరం. పెరుగుతున్న కాలుష్యం, ఇంధన ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాంకేతికతలో వస్తున్న మార్పులు వంటి అంశాలు ఈవీల వైపు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగాలంటే ప్రభుత్వ సహకారం తప్పనిసరి. సామాన్యుడికి అందుబాటులో ఉండే ధరలకు ఈవీలు రావాలి. అలాగే వాటి తయారీకి సంబంధించిన మౌలిక వసతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. ఛార్జింగ్ స్టేషన్లను వీలైనన్ని ఎక్కువగా స్థాపించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి. ఈవీ వాహనాల, బ్యాటరీల జీవితకాలం, సామర్థ్యం మెరుగు పడే విధంగా పరిశోధనలు జరగాలి. మరమ్మతుల, సర్వీసింగ్ సదుపా యాలు కూడా సులభంగా అందుబాటులో ఉండాలి. ఈ రంగంలో వ్యాపార ప్రోత్సాహకాలను అందించాలి. భవిష్యత్ తరాల గొంతుకు లకు వ్రేలాడే కాలుష్యపు ఉరితాడు తొలిగించేందుకు ప్రభుత్వాలు ప్రజలు సహకరించాలి.

- బైరబోయిన వెంకటేశ్వర్లు
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ల సంఘం

# తెలంగాణ గెరిల్లా 'బి.ఎన్'



భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే అరుదైన స్థానాన్ని పొందింది. తెలంగాణ సాయుధ పోరా టంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగి పోయింది. 'బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి.



తెలంగాణ సాయుధ పోరాట నాయకులలో ఒకరుగా నిలిచి ఉద్యమించిన కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి 'బి.ఎన్.రెడ్డి'గా ప్రాచుర్యం పొందారు. 'దున్నేవాడిదే భూమి' అంటూ ఆయన నినదించి వందలాది ఎకరాల స్వంత భూమిని పేద ప్రజలకు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

బి.ఎన్.రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో 1922 మార్చి 15 నాడు భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు జన్మించారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ ఆయన తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా అడుగులు వేసి తొలి గెరిల్లాగాను ముందుకు సాగారు.

తెలంగాణ సాయుధ పోరాట సమన్వయ కమిటీకి బి.ఎన్.రెడ్డి కార్యదర్శిగా పనిచేశారు. కరీంనగర్, ఖమ్మం, పాత సూర్యాపేట, దేవరుప్పల, ఆలేరు ప్రాంతాలలో నిజాం సైన్యాన్ని ధిక్కరించి రైతాంగాన్ని సాయుధ పోరాటం దిశగా ఉద్యక్తులుగా చేసి ముందుకు పయనింప జేయడంలో ఆయన ఉద్యమించారు. సాయుధ పోరాటంలో భాగంగా అంతిమంగా గెరిల్లా దళాలను ఏర్పరచడంలోనూ, వారికి శిక్షణ ఇవ్వడంలోనూ, వ్యూహాత్మకంగా శత్రువులను దెబ్బతీసి వారి నుండి ఆయుధాలు పోగు చేసుకోవడంలోనూ మరియు

వ్యూహ-ప్రతివ్యూహాలతో శత్రువులను అంతమొందించడంలోనూ బి.యన్.రెడ్డి 'అందె వేసిన చేయి'గా నిలిచారు.

స్థానిక భూస్వామ్యుల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధా నానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరా చకాలకు, ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో 'తెలంగాణ ఉద్యమానికి సాయుధ సేనాని'గా నిలిచి ఉద్యమ చివరి దశ వరకు ఆయన వీరోచిత పోరాటం సాగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బి.ఎన్.రెడ్డి 'తెలంగాణ చేగువేరా' గానూ వేనోళ్ళ కొనియాడబడ్డారు.

తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిన తర్వాత 1957 లో బి.ఎన్.రెడ్డి తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ ) లో చేరారు. 1967 లో సూర్యాపేట నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారు. 1971 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బి.ఎన్.రెడ్డి సి.పి.ఎం పార్టీ నుంచి మొదటిసారి పోటీ చేసి పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించారు. మొత్తంగా ఆయన రెండుసార్లు శాసన సభ్యుడుగాను మరియు మూడు సార్లు పార్లమెంట్ సభ్యు డుగాను గెలుపొంది సరికొత్త చరిత్రని సృష్టించారు. బి.ఎన్.రెడ్డి తన 'పాతిక సంవత్సరాల ప్రజా సేవలో మచ్చలేని కమ్యూనిస్టు ప్రజాప్రతినిధి'గా పేరు ప్రఖ్యా తులు పొంది ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారు. ఈ తరం రాజకీయ నేతలు మరియు ప్రజా ప్రతినిధులు అలాంటి నేతల జీవి తాల నుంచి ఆదర్శాలు స్వీక రించి పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బి.ఎన్.రెడ్డి 1997 లో సి.పి.ఎం పార్టీని విడ నాడి సి.పి.ఎం ( బి.ఎన్) స్థాపించారు. అనంతరం 2000 లో మద్దికాయల ఓంకార్ స్థాపించిన ఎం.సి.పి.ఐ పార్టీలో ఆయన తన పార్టీని విలీనం చేశారు. ఆయన ఏ కమ్యూనిస్ట్ పార్టీలో కొనసా గిననూ అంతిమంగా ప్రజా సమస్యల విముక్తి కోసం అవిశ్రాంతంగా ఉద్యమించారు. బి.ఎన్.రెడ్డి చాలా సాదాసీదా నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఆయన తనకోసం ప్రత్యేకంగా సంపాదించుకున్నది ఏమి లేదు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన బి.ఎన్.రెడ్డి అదే భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాల భూమిని భూస్వాముల బారి నుండి విముక్తి చేసి పేదలకు పంచడంలో అనేక పోరా టాలు నిర్వహించారు. ఆ రకంగా ఆయన ఎల్లప్పు డూ పేదల పక్షాన నిలిచి అణచివేత మరియు దోపిడి నుండి అణగారిన వర్గాల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడారు. 'కమ్యూనిస్టులను ఐక్యంగా చూడాలి'అని, 'ఆకలిదప్పులు లేని అసమానతలు లేని సమసమాజం ఆవిష్కరించ బడాలి' అని ఆయన పరితపించారు.

ఏడు దశాబ్దాలకు పైగా ప్రజాపోరాట ఉద్యమాల్లో జననేతగా వెలుగొందిన బి.ఎన్.రెడ్డి 2008 మే 9 నాడు మరణించారు.

- జె.జె.సి.పి. బాబూరావు
94933 19690

# భాద్రపదంలో భాగవత సప్తాహాలు

సర్వవేదాంతసారం హి శ్రీభాగవతమిష్యతే తద్రసామృతతృప్తస్య నాన్యత్ర స్యాద్రతిః క్వచిత్ అని శ్రీమద్భాగవతం ద్వాదశ స్కంధం 13వ అధ్యాయం 15వ శ్లోకం పేర్కొంటుంది. సమస్త వేదాంత సారమే శ్రీమద్భాగవతమని, దాని రసామృతంతో తృప్తి పొందిన వారికి మరే ఇతర విషయంపైనా అంతటి ఆసక్తి ఉండదని ఈ శ్లోక భావం. భగవంతుని తత్త్వం, భక్తి మార్గం, జ్ఞానం, వైరాగ్యం, ధర్మం, ముక్తి వంటి జీవన పరమార్థాలను సమన్వయపరిచిన శ్రీమద్భాగవతం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని సంతరించుకుంది.

భాగవత సప్తాహ సంప్రదాయానికి ప్రధాన నేపథ్యం పరీక్షిత్తు మహారాజు చరిత్రలో కనిపిస్తుంది. పాండవ మధ్యముడైన అర్జునుని మనుమడు, అభిమన్యుడు-ఉత్తరల కుమారుడైన పరీక్షిత్తు మహారాజుకు శమీక మహర్షి కుమారుడైన శృంగి శాపం ఇచ్చాడు. ఏడు రోజుల్లో తక్షక సర్పదష్టితో మరణించాల్సి వస్తుందని తెలిసిన పరీక్షిత్తు రాజ్యబాధ్యతలను పక్కనపెట్టి గంగాతీరానికి చేరి, మరణాన్ని సమీపించిన జీవి ఏం చేయాలి, మానవ జీవితానికి పరమార్థమేమిటి అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే తపనతో మహర్షులను ఆశ్రయించాడు. ఆ సమయంలో అక్కడకు విచ్చేసిన మహర్షుల సమక్షంలో వ్యాసమహర్షి కుమారుడైన శ్రీశుక యోగీంద్రుడు పరీక్షిత్తుకు శ్రీమద్భాగవతాన్ని ఉపదేశించాడు. తనకు మిగిలి ఉన్న ఏడు రోజుల కాలాన్ని భగవంతుని తత్త్వశ్రవణానికి అంకితం చేసిన పరీక్షిత్తు, శ్రీశుకుని నుంచి భాగవత ధర్మాన్ని శ్రవణం చేశాడు. ఈ పరీక్షిత్తు-శుకుల సంభాషణే అనంతర కాలంలో ఏడు రోజులపాటు భాగవతాన్ని పారాయణం చేయడం, ప్రవచనం చేయడం అనే సప్తాహ సంప్రదాయానికి ప్రేరణగా భావించబడింది. భాద్రపద మాసంలో



అనేక ప్రాంతాల్లో భాగవత సప్తాహాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో భాద్రపద శుక్ల సప్తమి నుంచి ఏడు రోజులపాటు సప్తాహాన్ని నిర్వహిస్తారు. అయితే ఇది పంచాంగ నిర్ణయాలు, పండితుల సూచనలకు అను గుణంగా కొనసాగుతున్న సంప్రదాయం గా చూడాలి.

భాగవతం ఆధ్యాత్మిక విషయాలతోపాటు సృష్టి, కాలం, జీవితం వంటి అంశాలపైనా తనదైన విశ్వదృష్టిని అందిస్తుంది. తృతీయ స్కంధంలోని పదకొండవ అధ్యాయంలో పరమాణువు నుంచి విస్తృతమైన కాల విభాగాల వరకు కాలతత్త్వాన్ని వివరించారు.

అలాగే తృతీయ స్కంధంలోని ముప్పై ఒకటవ అధ్యాయంలో గర్భస్థ జీవి గురించి విశదమైన వర్ణన ఉంది. గర్భంలో జీవి స్థితి, పిండ వికాస దశలు, జన్మకు సంబంధించిన ఆధ్యాత్మిక భావనలను భాగవతం వివరిస్తుంది. దీనిని ఆధునిక వైద్యశాస్త్రంలోని పిండవికాస వివరణతో యథాతథంగా సమానమని చెప్పడం కంటే, ప్రాచీన భారతీయ ఆలోచనా సంప్రదాయంలో గర్భస్థ జీవితం గురించి ఉన్న ప్రత్యేక దృష్టిగా చూడటం సముచితం. నేటి వేగవంతమైన సాంకేతిక యుగంలో మనిషి చేతిలో సమాచార సంపద పెరిగినా, అంతరంగ ప్రశాంతత, ఆత్మపరిశీలన, నైతిక విలువలు, జీవన పరమార్థంపై ఆలోచన అవసరం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో భాగవత శ్రవణం కేవలం పురాణ కథలను వినే కార్యక్రమంగా కాకుండా, భక్తి, జ్ఞానం, వైరాగ్యం, ధర్మం, మానవీయ విలువలను గుర్తుచేసే ఆధ్యాత్మిక సాధనగా నిలుస్తోంది.

భాద్రపదంలో నిర్వహించే భాగవత సప్తాహాలు కుటుంబాలను, భక్తులను, సమాజాన్ని ఒకచోట చేర్చి శ్రవణం, స్మరణం, కీర్తనం, సేవ వంటి భావాలను పెంపొందిస్తున్నాయి. పరీక్షిత్తుకు శ్రీశుకుడు అందించిన భాగవత జ్ఞానధార నేటికీ ప్రవహిస్తూనే ఉంది. కాలం మారినా మానవ జీవితానికి సంబంధించిన మౌలిక ప్రశ్నలు మారవు. ఆ ప్రశ్నలకు ఆధ్యాత్మిక దృష్టితో సమాధానాలను అన్వేషించే మార్గంలో శ్రీమద్భాగవతం ఒక అక్షయ జ్ఞాననిధిగా నిలుస్తోంది. అందుకే భాద్రపద భాగవత సప్తాహాలు భారతీయ పురాణ ప్రవచన సంప్రదాయానికి సజీవ ప్రతిరూపాలుగా, ఆధ్యాత్మిక చైతన్యానికి ఆలవాలాలుగా కొనసాగుతున్నాయి.

- ఆర్‌కేఎస్
9440595494

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు..
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం: https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి - ఎడిటర్

# ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే

## గోదావరి పుష్కరాలు-2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

- గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కావొద్దు
- ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ఏర్పాట్లు చేయండి



మంథని సెప్టెంబర్18(మనం న్యూస్): కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని,అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు.గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు.శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో నిర్వహించిన'గోదావరి పుష్కరాలు-2027'కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీతక్క,పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత,ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు,ఘాట్ల నిర్మాణం, రవాణా,మౌలిక వసతులు,ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు.రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు.ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్బోర్డ్లు వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు.ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్అండ్బీ,ఇతర శాఖల నుంచి డిప్యుటేష్ప తీసుకోవాలన్నారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున,ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు.భద్రాచలం వద్ద ఎస్టీపీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.ఎన్ని నిధులనైనా కేటాయించేందుకు సీఎం రేవంత్రెడ్డి సిద్ధంగా ఉన్నారని,పుష్కర ఏర్పాట్లు, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చి చెప్పారు.

## గణనాథులను దర్శించుకున్న మంత్రి



మంథని, సెప్టెంబర్18(మనం న్యూస్): మంథని పట్టణంలోని పలు వార్డులోని గణపతి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం విశ్వకర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రెడ్డి సంఘంలో బ్యాంకాట్ హాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని,ఓంకారేశ్వర దేవాలయం,గజానన సంస్థ (మందాట),పోచమ్మవాడలోని రైతు కార్మిక,నడివిధి గజానన సంస్థ,రైతు గజానన మండలి,రావుల చెరువు కట్టలోని మంథనిక రాజా యూత్,హిందూసేన,శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని,లక్ష్మీనారాయణ గుడి విధిలోని త్రిశూల్ యూత్,గరుడ యూత్,రాణి రుద్రమదేవి టీం,రాజీవ్ నగర్ లోనిగణనాథుణ్ణి,ధార్మిక్ యూత్ వెల్ఫేర్అసోసియేషన్, ముత్యాలమ్మవాడ గణనాథుణ్ణి, అంబేద్కర్ నగర్ లో భీం రావ్ యూత్,అంబేద్కర్ నగర్ యూత్,గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి,పెంజరుకట్టలోని సార్వజనిక్ గజానన మండల్,బామ్ భోలేనాథ్ యూత్ గణనాథులను రాష్ట్ర ఐటీ,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల.శ్రీధర్ బాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి శ్రీధర్ బాబు గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు చేసి మంథని నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలనిఆకాంక్షించారు.అనంతరం గణనాథుల వద్ద అర్చకులు కమిటీ సభ్యులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కమిటీ సభ్యులందరూ శాలువాలతో మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుంది



- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్

మంథని, సెప్టెంబర్18(మనం న్యూస్): పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అన్నారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యదర్శిగా ఎన్నికైన ఆరెల్లి కిరణ్ గౌడ్,శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం చైర్మన్ గా వంగల తిరుమలేష్,శ్రీ గౌతమేశ్వర ఆలయం చైర్మన్ గా గుండ రాజుల నియామక పట్ల మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్,వైస్ చైర్మన్ సహిందర్ రెడ్డి,పాలకవర్గం తరుపున వారికి సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పథకాలను,మంథని నియోజకవర్గంలో,మంథని మున్సిపల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆరెల్లి కిరణ్ గౌడ్ కి సూచించారు,శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ చైర్మన్ వంగల తిరుమలేష్, శ్రీ గౌతమేశ్వర ఆలయ చైర్మన్ గుండ రాజులు రాబోయే పుష్కరాలను విజయవంతం చేయాలని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద ఏ పండుగ జరిగిన భక్తులు ఎక్కువగా ఉంటారు కాబట్టి తగిన భద్రతలు చేపట్టి,ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లకు ఆయన తెలిపారు.

## విద్యార్థులు చదువుపై ఏకాగ్రత సాధించేందుకు అల్పాహార కార్యక్రమం దోహదం



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, సెప్టెంబర్18(మనం న్యూస్): విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత సాధించేందుకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న అల్పాహార కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం మంథని డివిజన్ పరిధిలోని కమాన్పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని పరిశీలించి,విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి అల్పాహారం నాణ్యత,రుచి, పరిమాణంపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకున్నారు. విద్యార్థుల ఏకాగ్రతకు అల్పాహారం దోహద పడుతుందని, ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడం వల్ల ఆకలి సమస్య లేకుండా చదువుపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పోషకాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం,అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రతిరోజు విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు,రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులకు అందించే అల్పాహారం నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకుసూచించారు.ప్రతిరోజూ అందిస్తున్న అల్పాహారం ఎలా ఉంది,రుచిగా ఉంటుందా,పాలు లేదా రాగిజావ అందుతున్నాయా తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం,పోషణతో పాటు వారి విద్యాభ్యాసానికి అవసరమైన అనుకూల వాతావరణం కల్పించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరావు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరాలి

- వెయ్యి ఎకరాల్లో సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, సెప్టెంబర్ 18( మనం బ్యూరో): జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయిల్ఫామ్ సాగును విస్తరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్ఫామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంట సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి వారిని ముందుకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ఫామ్ సాగు పురోగతిపై కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం రాత్రి తన ఛాంబర్లో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్రెడ్డి, ఆయిల్ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చింతల రోహిత్, జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ తో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం, రైతులను ప్రోత్సహిస్తున్న విధానం, లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఏఈవోలకు మండలాల వారీగా లక్ష్యాలు**

ఆయిల్ఫామ్ సాగు విస్తరణలో భాగంగా ప్రతి ఏఈవోకు 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించి, రైతులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ఫామ్ సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఆయిల్ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ రెండు మండలాల్లో ఒక్కొక్క మండలంలో 50 ఎకరాల చొప్పున ఆయిల్ఫామ్ సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. చిగురుమామిడి మండలంలో సుమారు 25 ఎకరాల్లో ఆయిల్ఫామ్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. నర్సరీ ఏర్పాటుతో రైతులకు అవసరమైన మొక్కల లభ్యతకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయిల్ఫామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నందున, ఈ పంట వైపు రైతులను మళ్లించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు సాగు విధానం, ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## ప్రైమ్ హైట్స్‌లో భక్తి శ్రద్ధలతో ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



జగిత్యాల, సెప్టెంబర్ 18 ( మనం ప్రతినిధి ): జగిత్యాల పట్టణం దరూరు క్యాంప్ ప్రైమ్ హైట్స్ అపార్ట్మెంట్ మండపంలో కొలువైన విఘ్నేశ్వరుని సన్నిధిలో శుక్రవారం శ్రీమాన్ జగన్ ఆచార్య చే మహిళలు ఘనంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఘననాతునికి రోజుక్క తీరు అలంకరణ లతో విశేష పూజలు నిర్వహిస్తు 5వ రోజున మహిళలచే సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నాలను తొలగించే వినాయకుడిని నవరాత్రులలో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని పండితులు చెబుతున్నారు. అందులోనూ శుక్రవారం మహిళలు కుంకుమతో అమ్మవారి స్వరూపంగా భావించి గణపతిని అర్చించడం వల్ల సౌభాగ్యం, సంతాన సౌఖ్యం, కుటుంబంలో ఐశ్వర్యం, సుఖశాంతులు వెల్లివిరుస్తాయని నమ్మకం. వినాయకుడికి ఎరుపు రంగు కుంకుమ అత్యంత ప్రీతికరమైనది. కుంకుమార్చన చేయడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని కుటుంబసభ్యులు అందరు విఘ్నాలను తొలిగించే గణనా తుని చల్లని చూపుతో ఆయురారోగ్యాలతో ఉండాలి భక్తుల విశ్వాసం తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సతీష్, గంగాధర్ కుటుంబ సభ్యులచే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం లో కుటుంబ సమేతంగా అందరు పాల్గొని అన్నప్రాసదాన్ని స్వీకరించారు.అనంతరం నిర్వాహకు లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రైమ్ హైట్స్ అధ్యక్షులు బ్రాహ్మండాబేరి నరేష్, ఉపాధ్యక్షులు మేనేని రవీందర్ రావు, కార్యదర్శి శంకర్, క్యాషియర్ చీటి భూపాల్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వరుణ్ కుమార్, రామాంజనేయులు, సురేష్ రావు, రాజా గౌడ్, తిరుపతి, మహిళలు, ఉమా, గీత,పద్మావతి, రజిత, శైలజ, సుజాత , లత, సంధ్యా, అనూష, సమతా, షాలిని, చంద్రకళ,వైష్ణవి, అక్షిత, దిక్షిత,తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి ఘనమైన పూజలు

### ఏకదంతాయూత్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాలు



వర్గల్ సెప్టెంబర్ 19(మనం న్యూస్): వర్గల్ మండల కేంద్రంలోని ఏకదంతాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద గణనాథునికి నిత్య పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వినాయక మండపం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు శివగౌని.పెంటగౌడ్ సహకారంతో నిర్వహించడం జరుగుతుందని ఏకదంతా యూత్ నిర్వాహకులు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వినాయకుని లడ్డూ ప్రసాదం 2023లో టేకులపల్లి గోపాల్ రెడ్డి 2లక్షల99 వేలకు వేలం పాటలో దక్కించుకోగా 2024 లో మక్తల జహంగీర్ గౌడ్ 3 లక్షల31,000 కైవసం చేసుకున్నాడు. 2025 సంవత్సరంలో మీనాజీపేట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నీల శ్రీనివాస్ 3 లక్షల 61 వేలకు వేలం పాటలో దక్కించుకున్నరు. ఈసారి నిర్వహించే వేలంపాటలో గణనాథుని లడ్డు ప్రసాదాన్ని ఎవరు సొంతం చేసుకుంటారు వేచి చూడాలి. 20వ తేదీ ఆదివారం వినాయక నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



టేకుమట్ల సెప్టెంబర్ 18 మనం న్యూస్: సమయ పాలన లేకుండా విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్న కట్టలను శుక్రవారం నాడు ఎస్సై అమూల్య పట్టుకున్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వెళ్లాల్సిన ఇసుక ట్రాక్టర్లు సమయం దాటిన కూడా విచ్చలవిడిగా ఇసుక రవాణా కొనసాగిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అమూల్య తెలిపారు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్ యజమానులకు ఇదివరకు హెచ్చరికలు జారీ చేసినా కూడా సమయపాలన పాటించకుండా రాత్రి సమయంలో రాఘవరెడ్డి పేట్ వైపు నుండి చిట్యాల వైపు వెళుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు చేయడం జరిగిందనీ తెలిపారు ట్రాక్టర్ యజమానులకు డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన మారని ఇసుక రవాణాపై ఉపేక్షించేది లేదని చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 22-ఏ భూములపై వాస్తవాలు వెలుగులోకి తేవాలి

- టీపీసీసీ స్పోక్ పర్సన్ నూక కిరణ్ యాదవ్
- పదేళ్లలో వందల ఎకరాలు ఎలా? భూముల లెక్క తేల్చాలి
- డీసీసీ అధ్యక్షురాలు . దన్వంతి లక్ష్మీ నారాయణ



జనగామ, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి): ఉద్యమ సమయంలో సెంటు భూమి కూడా లేని వారు పదేళ్ల కాలంలో వందల ఎకరాల భూములకు ఎలా అధిపతులయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడాతు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఫామ్హౌస్ల విస్తీర్ణం, భూముల కొనుగోళ్లు, బదలాయింపులు తదితర అంశాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను అధికారిక రికార్డుల ఆధారంగా నివృత్తి చేయాలని కోరారు. ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించిన ఆస్తులు, అనంతరం జరిగిన ఆస్తుల మార్పుల వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు. ధరణి, 22-ఏ భూములపై సమగ్ర విచారణ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ అమలు, వీఆర్వో వ్యవస్థ రద్దు తదితర మార్పుల నేపథ్యంలో భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర పరిశీలన అవసరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములపై పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, రెవెన్యూ పత్రాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై చట్టబద్ధమైన విచారణ జరపాలని కోరారు. వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు రాజకీయాల్లోకి రాకముందు ఉన్న ఆస్తులు, అనంతరం ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తుల వివరాలను పోల్చి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అఫిడవిట్ ఆధారిత సమాచారం ప్రకారం ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 2014లో సుమారు రూ.42.38 కోట్ల ఆస్తులు, 2018లో సుమారు రూ.41.83 కోట్ల ఆస్తులు ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎర్రబెల్లి దయాకర్రావు 2014 ఎన్నికల అఫిడవిట్లో సుమారు రూ.2.47 కోట్ల ఆస్తులు, 2018లో సుమారు రూ.8.12 కోట్లు, 2023లో సుమారు రూ.12.63 కోట్ల ఆస్తులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పల్లా రాజేశ్వర్రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్రావు తదితర ప్రజాప్రతినిధుల ఆస్తుల వివరాలను కూడా అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించి, ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఆస్తుల పెరుగుదలకు సంబంధించిన ఆదాయ వనరులు, భూముల కొనుగోళ్లు, యాజమాన్య బదలాయింపులు తదితర అంశాలపై అధికారికంగా పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. నాలుగువేల ఎకరాల లెక్క చెప్పాలి జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్పర్సన్ నూక కిరణ్ యాదవ్ మాట్లాడుతూ, 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు పేర్కొంటున్న భూముల ప్రస్తుత పరిస్థితిపై స్పష్టత అవసరమన్నారు. భూముల రికార్డుల్లో జరిగిన మార్పులు, రిజిస్ట్రేషన్లు, యాజమాన్య బదలాయింపులు, రెవెన్యూ రికార్డుల్లో మార్పులను అధికారికంగా పరిశీలించాలని కోరారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఎర్రవల్లి ఫామ్హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై వస్తున్న ఆరోపణలను కూడా రికార్డుల ఆధారంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు లేదా ఇతర నిషేధిత భూములకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.జనగామ భూములపై సమగ్ర సర్వే చేయాలి జనగామ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములకు సంబంధించిన వివాదాలు, కబ్జా ఆరోపణలు, రికార్డుల మార్పులపై సమగ్ర సర్వే నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రతి ఎకరానికి సంబంధించిన పాత రికార్డు, ప్రస్తుత రికార్డు, యాజమాన్య మార్పులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. భూములపై వచ్చిన ఆరోపణలకు రాజకీయ ఆరోపణలతో కాకుండా అధికారిక రికార్డులతో సమాధానం ఇవ్వాలి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్పోక్స్పర్సన్ నూక కిరణ్ యాదవ్, వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జగదీష్ చంద్రారెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, ఎర్రమల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, ఆర్టీఏ సభ్యుడు అభిగౌడ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మాజిద్ అప్సర్,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణ రెడ్డి, మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా చైర్మన్ సీసా ప్రదీప్ యాదవ్,వంగాల కళ్యాణి, డాక్టర్ రాజమౌళి,కౌన్సిలర్ మంత్రి సుమలత, సాధం మనోహర్,డీసీసీ స్పోక్ పర్సన్ నరేందర్ పవార్,డిసిసి జనరల్ సెక్రటరీ వేమల్ల పద్మ, బానోతు భాస్కర్, భీం రాజ్,సెక్రటరీ కొల్లూరి శివ, జొన్నగాని కిష్టయ్య, కోటా నాయక్, దూడల సిద్ధయ్య గౌడ్ చింతకింది మల్లేష్,కోళ్ళ రవి గౌడ్,ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ ఏలీయా, నల్ల మహేందర్, కళ్యాణం సమ్మయ్య, దండు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు అనిల్, సిరిపురం గ్రామ సర్పంచ్ చిలువేరి సంపత్,అఆఇ డైరెక్టర్ భూక్రెడీ శ్రీలత, బడికె కృష్ణస్వామి,మున్నీ బేగం,మేకల సమ్మయ్య, ఇస్మాయిల్, అజారుద్దీన్,అలీమొద్దీన్, భిక్షపతి, నరేందర్,ఉమ మహేశ్వరి, రజియా, జోయల్, సుధాకర్ రెడ్డి, సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# భ్రమరాంబిక అమ్మవారికి స్వర్ణాభరణం

## మూడు తులాల బంగారు నెక్లెస్ సమర్పణ

## భక్తితో సమర్పించిన శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు




**అమీన్‌పూర్, సెప్టెంబర్ 18 (మనం న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ గుట్టపై కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తి భావం వెల్లివిరిసింది. శ్రీ భ్రమరాంబిక అమ్మవారికి రెయిన్బో మెడోస్, బీరంగూడకు చెందిన వి. శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో మూడు తులాల బంగారు నెక్లెస్ను కానుకగా సమర్పించారు. అమ్మవారిపై తమకున్న అపారమైన భక్తి, విశ్వాసానికి ప్రతీకగా కుటుంబ సభ్యులు ఈ బంగారు నెక్లెస్ను సమర్పించారు. ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారుల సమక్షంలో శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు బంగారు నెక్లెస్ను ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్కు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో సమర్పించిన బంగారు నెక్లెస్ను అమ్మవారి అలంకరణలో వినియోగించేందుకు ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**భక్తి కానుకలు.. ఆధ్యాత్మిక సేవలు: ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్**

భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. అమ్మవారిపై భక్తులు చూపుతున్న విశ్వాసానికి ఇలాంటి భక్తి కానుకలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. భక్తులు తమ శక్తి మేరకు ఆలయానికి అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమన్నారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. భ్రమరాంబిక అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు ప్రహ్లాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీధర్ కుమార్ కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీతం నుండి హౌస్ రెంట్ అలయన్స్ రికవరీ ఉపసంహరించుకోవాలి



● దేవసాని వాసుదేవ్

**గజ్వేల్, సెప్టెంబర్ 18 మనం న్యూస్:** జీతం నుండి హౌస్ రెంట్ అలయన్స్( హెచ్ ఆర్ ఏ ) రికవరీ ఉపసంహరించుకోవాలని పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్ కోరారు. పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 సిద్దిపేట జిల్లా యూనియన్ అధ్యక్షులు కల్వ చక్రధర్ ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేయుచున్న రెగ్యులర్ ఎం పి హెచ్ ఏ ఫ్ లకు అడిషనల్ హెచ్ఆర్ఏ నిలుపుదల చేసినందున మరియు వారి శాలరీ నుండి రికవరీ గురించి ఎస్ టీఓ ఓ లకు ఆదేశాలు వచ్చి నందున , అడిషనల్ హెచ్ఆర్ఏ కంటిన్యు చేయమని మరియు జీతం నుండి అడిషనల్ హౌస్ రెంట్ అలవెన్స్ అమౌంట్ రికవరి చేయడం సోచనీయమన్నారు. ఎన్నో కష్టాల్లో ఉన్న ఏఎన్ఎంల నెల జీతం నుండి రికవరీ చేయడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వెంటనే స్పందించి డి టి ఓ సిద్దిపేట ఎస్ టి ఓ దుబ్బాక అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై రాష్ట్ర కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సంగీత సత్యనారాయణ ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. వారు సానుకూలంగా స్పందించి ఇట్టి విషయంపై చర్చించి మీకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది వాసుదేవ్ తెలిపారు.

# ముందే హెచ్చరించిన 'మనం'

## చివరికి మారిన ఇంటిగ్రేటెడ్ స్కూల్...

## కాలుష్య భయంతో పాఠశాల స్థల మార్పు.. మరి ప్రజల ఆరోగ్యం సంగతేంటి?

## ప్రజాప్రతినిధుల ముందున్న అవకాశం చేజారిందా? భిక్కనూరు భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలు...

## పాఠశాలకు కాలుష్యం ప్రమాదమైతే.. అదే ప్రాంతంలో పరిశ్రమల విస్తరణపై ఎందుకు మౌనం?



**భిక్కనూరు, సెప్టెంబర్ 18 (మనం న్యూస్):** భిక్కనూరు మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల మార్పుపై కొంతకాలంగా కొనసాగుతున్న చర్చకు ఇప్పుడు ఆచరణ రూపం కనిపిస్తోంది. పరిశ్రమలకు సమీపంలో పాఠశాల నిర్మాణం వల్ల విద్యార్థులపై కాలుష్య ప్రభావం ఉండొచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పాఠశాల స్థలాన్ని మార్చే దిశగా అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పరిణామం మరో కీలక ప్రశ్నను ముందుకు తెస్తోంది. పాఠశాల నిర్మాణానికి కాలుష్యం ప్రమాదకరమని గుర్తించిన అధికారులు.. అదే ప్రాంతంలో నివసిస్తున్న వేలాది మంది ప్రజలకు ఆ కాలుష్యం ప్రమాదం కాదా? అని ఆలోచించ లేకపోవడం దురదృష్టకరం.




మనం పత్రికలో ముందే వచ్చిన వరుస కథనాలు...

**ముందే 'మనం' దినపత్రిక హెచ్చరికలు.. ఇప్పుడు నిజమైన పరిణామం...**

ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో మనం దినపత్రిక గత కొంతకాలంగా వరుస కథనాల ద్వారా పలు ప్రశ్నలను ప్రజల ముందుంచింది. పరిశ్రమల సమీపంలో విద్యాసంస్థ ఏర్పాటు చేయడం వల్ల పాఠశాల మార్పు అవుతుంది ఆందోళనలు వ్యక్తం చేస్తూ కథనాలు ప్రచురించింది.జ అంతేకాదు.. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలం మార్పు ఎందుకు? వంటి అంశాలను ప్రజా చర్చలోకి తీసుకువచ్చింది. తాజా పరిణామాల్లో పాఠశాల స్థలాన్ని మార్చే అంశం తెరపైకి రావడంతో అప్పట్లో లేవనెత్తిన ప్రశ్నలకు ప్రాధాన్యం ఏర్పడింది.

**అధికారులకు కనిపించిన కాలుష్య ప్రమాదం.. ప్రజలకు కనిపించదా?**

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థలం ఎంపికలోనే కాలుష్య అంశం ప్రస్తావనకు రావడం గమనార్హం ఏ అధికారులు ప్రధానంగా ఆ అంశాన్ని కారణంగా చూపెట్టకపోయినా అదే అసలైన కారణమని సమాచారం. విద్యార్థులు చదివే ప్రదేశానికి కాలుష్యం ఇబ్బంది కలిగించే అవకాశం ఉందన్న కారణంతో స్థల మార్పు పరిశీలనకు వస్తే.. అదే పరిసర ప్రాంతాల్లో నివసించే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. పాఠశాలకు కాలుష్యం వద్దు.. మరి గ్రామానికి? విద్యార్థులకు స్వచ్ఛమైన వాతావరణం అవసరం.. మరి ప్రజలకు అవసరం లేదా? ఇలాంటి ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**ప్రజాప్రతినిధులకు వచ్చిన అవకాశం.. వినియోగించుకోలేదన్న విమర్శలు..**

ఇంటిగ్రేటెడ్ స్కూల్ వ్యవహారం కేవలం ఒక పాఠశాల స్థల మార్పు అంశంగా చూడకూడదని స్థానికులు చెబుతున్నారు. ఇది భిక్కనూరు మండల భవిష్యత్ అభివృద్ధి దిశను సూచించే అంశంగా వారు భావిస్తున్నారు. పాఠశాల స్థలంపై నిర్ణయం తీసుకునే దశలోనే ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, అధికారులు కలిసి చర్చించి ఉంటే.. మండలానికి సంబంధించిన పరిశ్రమలు-విద్యాసంస్థలు-ప్రజల నివాస ప్రాంతాలు అనే అంశాలపై సమగ్ర విధానం రూపొందించే అవకాశం ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ అవకాశం పూర్తిస్థాయిలో వినియోగించుకోలేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

# కోటి ఎకరాలు 22ఎలో ఉందని కేటీఆర్, హరీష్ రావు దుష్ప్రచారం చేస్తున్నారు

## డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడిన టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం



**సంగారెడ్డి, సెప్టెంబర్ 18 మనంప్రతినిధి :** కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్, హరీష్ రావు 22(ఏ) జాబితా విషయంలో దుష్ప్రచారం సాగిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి తీసుకొచ్చి, ఏకంగా 22.93 లక్షల ఎకరాలు 22(ఏ)లో పెట్టిన వాళ్లే.. ఇప్పుడు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణాన్ని 7 లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన వివరించారు. ప్రస్తుతం 22 ఏ లో కేవలం 3.75 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావు మాత్రం ప్రజలను గందరగోళానికి గురి చేసేలా కోటి ఎకరాలు 22(ఏ) లో ఉందని దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో, ధరణిని అడ్డుపెట్టుకొని టిఆర్ఎస్ నేతలు అసైన్డ్ భూములను దోచుకున్నారని ఆయన వివరించారు.

**బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలను బయట పెడతాం**

తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అడ్డగోలుగా పట్టాలు సృష్టించి, బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలన్నింటినీ బయట పెడతామని ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వెల్లడించారు. కేసీఆర్ ఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరిగిందన్నారు. బిల్లులు రాక ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కట్టిన బిఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రజా పాలనలో హామీలన్నింటిని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం తపిస్తున్నారని అన్నారు.

**దళితులను అవమానించిన బీఆర్ఎస్ నేతలు**

ఫామ్ హౌస్ ముందు డప్పు కొట్టిన దళితులను అవమానించేలా, ఆ రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆయన అన్నారు. స్పీకర్ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలను నెరవేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో కొత్త పాలసీలు తెచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని, ఎంపీగా గెలిచిన రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సత్యం శ్రీరంగం సమాధానం ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకోవడం వల్లనే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘు గౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# చలో కొడంగల్ పోస్టర్ ఆవిష్కరణ



● పాంచ జన్య సంకల్ప సభకు సిద్ధమవుతున్న గజ్వేల్ తెలంగాణ రక్షణ సేన శ్రేణులు

**గజ్వేల్, సెప్టెంబర్ 18 మనం న్యూస్:** చలో కొడంగల్ పోస్టర్‌ను శుక్రవారం నాడు టిఆర్ఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ కొట్టాల యాదగిరి మాట్లాడుతూ బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ రావాలని కొత్త రాజకీయ పార్టీ స్థాపించి తెలంగాణ రాష్ట్ర నలుమూలల విస్తరింపజేస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క కు అండదండగా ఉంటూ బహుజన రాజ్యాధికారానికై పాల్పడతామని అన్నారు. మన రాజ్యం రావాలంటే మనం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాంచ జన్యం అంటే ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి వ్యవసాయం సామాజిక న్యాయం ఇందులో ముఖ్యంగా ఏ పార్టీలో లేని సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనలో ఉందని ఇప్పటివరకు ప్రకటించిన పదవులలో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపిస్తోందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గం ప్రజలు,కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము అన్నారు. ఇట్టి కార్యక్రమం లో ఎడ్ల నర్సింలు మాజీ ఎంపీటీసీ, కూరాకుల శ్రీకాంత్ పట్టణ యువజన అధ్యక్షులు మరియు, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, రాజు, కనకరాజు, స్వామి, సాయి, గణేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత ఉన్న చోటే శక్తి

## యువత ఒక్కటైతే మార్పు ఖాయం

## ఒక చుక్క రక్తం - ఒక ప్రాణానికి ఊపిరి

## ఒక హెల్మెట్ - ఒక కుటుంబానికి భద్రత

## కార్యక్రమంలో పలువురు వక్తల వెల్లడి







**ములుగు, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** క్షీరసాగర్ గ్రామం ఎస్సీ కాలనీలో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం భారం కాదని, అది మనకు ఇచ్చే 'రక్షణ' అని తెలిపారు. 'హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ' అంటూ నినాదాలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరిస్తే అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. జరగబోయే ప్రమాదాలను ముందుగా ఊహించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. యజమాని లేకపోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదముందని హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధ రించకపోవడంతో కలిగే అనర్థాలను వివరిస్తూ కు టుంబ పెద్ద ప్రమాదంలో మరణిస్తే బాధిత కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులను గురించి వివరించారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబసభ్యుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సాయం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**రక్తదానం ప్రాణదానంతో సమానం...**

రోడ్డు ప్రమాదాల కారణంగా రాష్ట్రంలో ఏటా వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తం అందుబాటులో ఉంటే అందులో కొందరినైనా కాపాడే అవకాశముంటుంది. ఏటా ప్రతి ఒక్కరూ నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు. కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయాలి'' అని సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానం. ఇది ఎంతో మంది నిండు ప్రాణాలను కాపాడుతుందని, ఆరోగ్యకరమైన ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు, ప్రమాద బాధితులకు మీరిచ్చే రక్తం పునర్జన్మను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని హాజరై ప్రోత్సాహించిన ఎంపీడీవో స్వర్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి సోనిరెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు నల్ల లక్ష్మీనరేందర్, ఇరుకుల ఆనంద్ కుమార్, గ్రామ పెద్దలు కోణ్యాల నర్సింహా రెడ్డి, నల్ల కృష్ణ , నల్ల శ్రీనివాస్, ఆదాసు రవి, కొల్తూరు నరేష్, నక్క ప్రవీణ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగమ్మ ప్రభాకర్, ఆదాసు మహేష్, ఉద్దేమరి వెంకటేష్, లక్ష్మపురం మహేష్, నరిగాళ్ల సంజీవ్, కృష్ణ, రామ్, విజయ్ కుమార్, శ్యామ్, అనిల్, లింగం, తరుణ్, నంద కిషోర్, వరుణ్, యోగి, చందు, శ్రవణ్, దుర్గ ప్రసాద్, మహేందర్, అభిషేక్, నందు, సురేష్, మహేష్, మధు, తరుణ్, వివేక్, దేవేందర్, అనీష్, అజయ్, ముకేశ్, జశ్వంత్, ఏ. పవన్, రాజు, జి. చరణ్ లుపాల్గొన్నారు.

# బిపిఎల్ ఎలివేట్ తో ఎస్.ఎన్ హెల్త్‌కేర్ సొల్యూషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** బీపీఎల్ గ్రూప్లో 50 సంవత్సరాల గొప్ప వారసత్వం కలిగిన భారతదేశంలోని ప్రముఖ వైద్య పరికరాల బ్రాండ్ అయినబీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్,బీపీఎల్ ఎలివేట్ 2026 క్రిందఎస్. ఎస్.ఎన్ హెల్త్‌కేర్ సొల్యూషన్ గుర్తించింది, ఇది ఆరోగ్య సంరక్షణ మరియు డెలివరీ, కస్టమర్ మార్కెట్ సంబంధాలకు వారి సహకారం కోసం చానెల్ భాగస్వాములను జరుపుకునే వార్షిక గుర్తింపు వేదిక. 'రైజ్ టుగెదర్' అనే థీమ్తో రూపొందించబడిన ఈ చొరవ బలమైన స్థానిక నైపుణ్యం మరియు ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడానికి నిబద్ధతతో భాగస్వాములను గుర్తిస్తుంది. కర్నూలు కేంద్రంగా,ఎస్.ఎన్ హెల్త్కేర్ సొల్యూషన్స్ ప్రొప్రైటర్ రాఘవేంద్ర శర్మ నేతృత్వంలో, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్లో డిప్లొమా హోల్డర్, 15 సంవత్సరాలకు పైగా పరిశ్రమ అనుభవం ఉంది. కర్నూలు, అనంతపురం, కడప మరియు చిత్తూరు జిల్లాలను కవర్ చేస్తూ రాయలసీమ ప్రాంతం అంతటా కంపెనీ ఉనికిని అభివృద్ధి చేసింది. సంస్థ విక్రయాలు మరియు ప్రాంతీయ కార్యకలాపాలను నిర్వహించే నలుగురు సభ్యుల బృందాన్ని కలిగి ఉంది. దీని బృందంలో ఫైరోజ్, రాఘవేంద్ర శర్మ, హరి కుమార్ మరియు ఉదయ్ కిషోర్ ఉన్నారు, వారి వారి పాత్రలలో ఐదు నుండి 10 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉంది.ఎస్.ఎన్ హెల్త్కేర్ సొల్యూషన్స్ స్కానే టెక్నాలజీస్ మరియు సోనోస్కేప్తో సహా మెడికల్ టెక్నాలజీ కంపెనీలతో పనిచేసిన అనుభవం ఉంది. కంపెనీ టర్నోవర్లో స్థిరమైన వృద్ధిని కూడా నివేదించింది, 2022-23లో రూ. 10 లక్షల నుండి 2023-24లో రూ. 75 లక్షలకు మరియు 2024-25లో రూ. 95 లక్షలకు పెరిగింది. డాక్టర్లు, రేడియాలజిస్టులు మరియు కార్డియాలజిస్టులతో సహా దాని ఆపరేటింగ్ ప్రాంతంలోని ప్రధాన ఆసుపత్రులు, రోగనిర్ధారణ కేంద్రాలు మరియు వైద్య నిపుణులతో కంపెనీ సంబంధాలను ఏర్పరచుకుంది. ఎస్. ఎన్ హెల్త్కేర్ సొల్యూషన్స్ ప్రొప్రైటర్ రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ, 'రాయలసీమ ప్రాంతంలోని ఆరోగ్య సంరక్షణ సంస్థలు మరియు వైద్య నిపుణులతో మేము ఏర్పరచుకున్న సంబంధాలకు మేము విలువ ఇస్తున్నాము.బీపీఎల్ ఎలివేట్ 2026 కింద ఈ గుర్తింపు మా బృందానికి ప్రోత్సాహకరమైన మైలురాయి మరియు మా టీమ్కు ప్రోత్సాహకరమైన మైలురాయి మరియు మా ప్రాంతపు ఆరోగ్య సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి ప్రోత్సహిస్తుంది.' ఇదే విషయంపై వ్యాఖ్యానిస్తూ, బీపీఎల్మెడికల్ టెక్నాలజీస్ సీఈవో గురుస్వామి కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఎస్.ఎన్ హెల్త్కేర్ సొల్యూషన్స్ విలువైన ప్రాంతీయ మార్కెట్ అవగాహనను మరియు రాయలసీమ ప్రాంతం అంతటా సుస్థిర సంబంధాలను తెస్తుం ది. వైద్య సాంకేతికతలో దాని అనుభవం మరియు ఆరోగ్య సంరక్షణ సంస్థలకు సేవ చేయడంపై దృష్టి పెట్టడం ముఖ్యమైన బలాలు. బీపీఎల్ ఎలివేట్ 2026 ద్వారా దాని స్ఫూర్తిని గుర్తించి సంతోషిస్తున్నాము. బీపీఎల్ ఎలివేట్ 2026 - రైజ్ టుగెదర్ ద్వారా, భారతదేశం అంతటా వైద్య సాంకేతికత యాక్సెస్ యొక్క విస్తృత అభివృద్ధికి ప్రాంతీయ నైపుణ్యం, మార్కెట్ సంబంధాలు మరియు హెల్త్కేర్ ప్రొవైడర్ల పట్ల నిబద్ధతతో కూడిన ఛానెల్ భాగస్వాములను బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ గుర్తించడం కొనసాగిస్తోంది. బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్ గురించి 2013లో స్థాపించబడిన బీపీఎల్ మెడికల్ టెక్నాలజీస్, కార్డియాలజీ, క్రిటికల్ కేర్, ఇమేజింగ్ మరియు హోమ్ హెల్త్కేర్లో నమ్మకమైన మరియు వినూత్నమైన పరిష్కారాలను అందజేస్తూ, భారతదేశంలోని ప్రముఖ స్వదేశీ వైద్య పరికరాల బ్రాండ్. 1967లో స్థాపించబడిన బీపీఎల్ వారసత్వంతో, కంపెనీ భారతదేశపు మొట్టమొదటి ఈసీజీ మెషీన్కు మార్గదర్శకత్వం వహించింది మరియు పేషెంట్ మానిటర్లు, వెంటిలేటర్లు, అల్ట్రాసౌండ్ మరియు ఎక్స్-రే సిస్టమ్లు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్లు మరియు వినియోగదారుల ఆరోగ్య ఉత్పత్తులతో సహా అనేక రకాల 'మేడ్ ఇన్ ఇండియా' వైద్య పరికరాల రూపకల్పన మరియు తయారీని కొనసాగిస్తోంది. 14 ప్రాంతీయ కార్యాలయాలు మరియు 500 కంటే ఎక్కువ మంది నిపుణుల బృందంతో దేశవ్యాప్తంగా ఉన్న బీపీఎల్పట్టణ మరియు గ్రామీణ భారతదేశంలోని ఆసుపత్రులు, క్లినిక్లు మరియు సంరక్షకులకు సేవలు అందిస్తోంది. కంపెనీ 2014 మరియు 2024 మధ్య 16.9% సీఏజీఆర్ సాధించింది మరియు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 32% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది.



# ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు



**కామారెడ్డి, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి):** ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలోని కమ్యూనిటీల ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు కొనుగోలు చేసి శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లో వినియోగిస్తున్నట్లు సర్పంచ్ కలెక్టర్కు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామపంచాయతీకి అందించే వారికి ప్రోత్సాహకంగా స్టీల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ సంఘ భవనంలో వినియోగం కోసం దాత 300 స్టీల్ ప్లేట్లు విరాళంగా ఇవ్వనున్నట్లు చెప్పారు.

**ఆరు మహిళా సంఘాలకు రూ.కోటి రుణాలు...**

కెనరా బ్యాంకు ద్వారా ఆరు మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.కోటి రుణాలను మంజూరు చేయగా, చెక్కులను కలెక్టర్ అందజేశారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నీరు, నేల, పర్యావరణానికి నష్టం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల అవగాహన స్కిట్ను తిలకించారు. ప్రతి ఇంటికీ జూట్ బ్యాగులను పంపిణీ చేసి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీఏ పీడీ దామోదరరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ‘సర్‘ హియరింగ్ వేగవంతం చేయాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

ఖమ్మం, సెప్టెంబర్ 18(మనంబ్యూరో): ‘సర్‘ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఓటర్లకు నోటీసులు స్వీకరిస్తున్న హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కొత్తగూడెం తాహసిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా సందర్శించి హియరింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటు కోల్పోయిన వారికి బి.ఎల్.ఓలు నేరుగా అందజేసిన నోటీసులకు సరైన ధ్రువపత్రాలను తాహసిల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చిన అర్హులైన ఓటర్లతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడారు. నోటీసులు ఇంటికి ఎవరు తీసుకొచ్చారని.. ఎన్ని రోజుల క్రితం నోటీసులు మీకు అందాయని ఓటర్లతో మాట్లాడారు. సరైన ధ్రువపత్రాలు పత్రాలు తీసుకు వచ్చామని ఓటర్లు కలెక్టర్ కు సమాధానం చెప్పగా, ఆ పత్రాలను స్వయంగా పరిశీలించి బి.ఎల్.ఓ లకు అందజేసి తక్షణమే ఆన్లైన్ ప్రక్రియ సక్రమంగా.. పకడ్బందీగా పొరపాట్లు దొర్లకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల దృవపత్రాలు సక్రమంగా ఉండేలా ఏ.ఈ.ఆర్.ఓ,బి.ఎల్.ఓ లు చూసుకోవాలని తెలిపారు. అనంతరం డేటా ఎంట్రీ చేస్తున్న విభాగం వద్ద దృవపత్రాలను, వాటి వివరాలను ఆన్లైన్ చేస్తున్న



సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిన ధ్రువపత్రాలను పరిశీలించారు. కొత్తగూడెం ప్రాంతంలో నాలుగు ఏ.ఈ.ఆర్.ఓ లు ఈ హియరింగ్ ప్రక్రియలో పనిచేస్తున్నారని, ఆగస్టు 27వ తేదీ నుంచి నోటీసులు స్వీకరిస్తున్నామని, మొత్తం 9036 హియరింగ్ నోటీసులకు గాను ఇప్పటివరకు ఇప్పటివరకు సుమారు ఆరు వేలు నోటీసులు తీసుకున్న దరఖాస్తులుదారుల నుంచి సరైన ధ్రువపత్రాలను తీసుకున్నట్లు తహసీల్దార్ పుల్లయ్య జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈనెల 22వ తేదీ ఈ హియరింగ్ ప్రక్రియకు చివరి గడువు కావున వేగవంతం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తాహసిల్దార్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన కొత్తగూడెం మండలంలోని పీఎంశ్రీ పథకంలో కొనసాగుతున్న కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సందర్శించారు. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా ఆరవ తరగతిలో ఇంగ్లీష్ సబ్జెక్టు పై పాఠ్యాంశాల్లో ప్రావీణ్యం ఏ విధంగా ఉంది అని విద్యార్థులతో చదివించి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఇంగ్లీష్ తోపాటు అన్నీ సబ్జెక్టులల్లో రాణిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయుడు హరిబాబుకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటశాలను పరిశీలించి 160 మంది విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు కూర, పప్పు, అన్నం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న పథకంలో పౌష్టికాహారం అందిస్తుందని అవి విద్యార్థులకు అందేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాలు రాథోడ్ చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలకు త్రాగునీరు వసతులు ఏమున్నాయని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తో పాటు బయటనుంచి మినరల్ వాటర్ విద్యార్థుల త్రాగునీరు కోసం అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి

- గణేష్ యూత్ మండపంలో ఘనంగా కుంకుమాభిషేకం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు



కొత్తగూడెం టౌన్ సెప్టెంబర్ 18(మనం న్యూస్): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో క్లాత్ మర్చంట్స్ పక్కన ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఐదో రోజు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేకంగా కుంకుమాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కుంకుమాభిషేకం నిర్వహించారు.

మహిళలు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమాభిషేకం అనంతరం స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండపం పరిసర ప్రాంతం భక్తులతో కిటకిటలాడడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణేష్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ గణనాథుడు విభిన్న అవతారాలు, ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తున్నాడు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో మండపానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ఉత్సవాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, పవన్, నరేందర్, ప్రేమ్, సాయి, సందీప్, రాంరెడ్డి, సంతోష్, శ్రీధర్, శివ, మనోజ్, చింటూ, శశాంక్ తదితర గణేష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.




# ఏసిబికి చిక్కిన హాస్టల్ వార్డెన్

చర్ల, సెప్టెంబర్ 18 (మనం న్యూస్) : చర్ల మండలం సత్యనారాయణపురం గిరిజన సంక్షేమ వసతిగృహం అదికారి భూక్యా వాల్ సింహ క్రింది స్థాయి సిబ్బంది నుండి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసిబి అదికారులకు పట్టుబడ్డాడు. వసతి గృహంలో పనిచేసే రాంబాయి అనే కాంట్రాక్ట్ పద్దతిన పనిచేసే వంట కుక్ వేతనాల బిల్లుంపులతో పాటు ఇటీవల కొన్నాల్ల పాటు ఆమె విదులకు గైర్హాజయినట్లు తెలుస్తోంది. ఈ విషయమై వసతి గృహ అదికారి లంచం డిమాండ్ చేసారు. దీంతో రాంబాయి ఖమ్మం ఏసిబి డి ఎస్ పి వై రమేష్ ను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో శుక్రవారం 14 వేల నగదు లంచం తీసుకుంటుండగా ఏసిబి అదికారులు వలపన్ని వార్డెన్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తదుపరి వార్డెన్ నివాసంలో తనిఖీలు చేపట్టి ఖమ్మం తరలించారు. ఈ సందర్భంగా డి ఎస్ పి వై రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే తమను సంప్రదించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసారు. కాగా వాల్ సింహ చర్లలోని బిసి సంక్షేమ వసతి గృహం, బాలుర ఎస్ ఎం ఎస్ వసతి గృహంకు కూడా వార్డెన్ గా వ్యవహరిస్తారు.

# శ్రీనివాసనగర్ లోని టింబర్ డిపోలను నగరం వెలుపలకి తరలించాలి

- కొత్తగూడెం – తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిని కలిసిన సిపియం ఖమ్మం బృందం



ఖమ్మం, సెప్టెంబర్ 18 (మనం న్యూస్): స్థానిక శ్రీనివాసనగర్ లోని టింబర్ డిపోలను,కట్టెల మండెలను నగరం వెలుపలికి తరలించాలని సిపియం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపైన సిపియం బృందం కొత్తగూడెంలోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిని కలిసి ఫిర్యాదును అందజేశారు. సిపీయం బృందంతో అధికారులను కలిసిన అనంతరం, వై విక్రమ్ మాట్లాడుతూ శ్రీనివాసనగర్ ప్రాంతంలోని అనేక టింబర్ డిపోలు, కలప నిల్వలు, కలపకు సంబంధించిన కార్యకలాపాలు నివాస ప్రాంతాల మధ్యలో కొనసాగుతున్నాయని, వీటి వలన ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని అన్నారు. కలపను కోయడం, లోడింగ్,అన్లోడింగ్, రవాణా వంటి కార్యకలాపాల సమయంలో గాలిలో కలప దుమ్ము, ఇతర ధూళి కణాలు వ్యాపిస్తున్నాయని తెలిపారు. ఇవి ఇళ్లలోకి, రోడ్లపైకి, పరిసర ప్రాంతాల్లోకి చేరడం వల్ల వాయు నాణ్యత దెబ్బతింటోందని ,ప్రజలకు అనేక రకాల శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే

కలప కోత యంత్రాల వల్ల నిరంతర శబ్ద కాలుష్యం ఏర్పడుతోందని, రోడ్లపై కలప దుమ్ము పేరుకుపోవడం వల్ల ప్రజలకు అసౌకర్యం ఏర్పడుతోందని తెలిపారు.

కలప వ్యర్థాలు,రంపపు పొట్టు మరియు ఇతర దహనశీల పదార్థాల వలన పర్యావరణం సైతం పాడవుతోందని అన్నారు.

పేద,మధ్య తరగతి ప్రజల నివాస ప్రాంతాలలో ఇలాంటి కార్యకలాపాలు కొనసాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని,లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాల్సి వస్తోందని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో మాన్ ఫోర్ట్ హై స్కూల్,సెయింట్ జోసెఫ్ హై స్కూల్,రాజేంద్రనగర్ హైస్కూల్,గీతాంజలి స్కూల్ , ఎస్ వి ఎం స్కూల్. వివాన్ స్కూల్ తదితర విద్యాసంస్థలు ఉన్నాయని, ఈ విద్యాసంస్థల్లో వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి సైతం ఈ టింబర్ డిపోల కార్యకలాపాలు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టింబర్ డిపోల ప్రక్కనే ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి సంవత్సరం పొడవునా వేల మంది భక్తులు వస్తుంటారని, వారికి కూడా ఇది ఓ పెద్ద సమస్యగా ఉందని తెలిపారు. ప్రభుత్వం టింబర్ డిపోల నిర్మాణం కోసం నగరం వెలుపల స్థలం కేటాయించి,కొత్త ప్రాంతంలో ఆ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల పట్ల అధికారులు, ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించి,వెంటనే టింబర్ డిపోలను ఈ ప్రాంతం నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపియం కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరాజు, సిపియం త్రీ టౌన్ మండల కార్యదర్శి భుక్యా శ్రీనివాసరావు,సిపియం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్,నాయకులు బండారు యాకయ్య,బండారు వీరబాబు,యర్రా మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కుటుంబం భూకబ్జాలకు పాల్పడ్డారు



- భూ కబ్జాదారులను ప్రజలు ముందు నిలబెడతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం పై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదు
- విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం సెప్టెంబర్ 18(మనం న్యూస్): కెసిఆర్ ప్రభుత్వం భూ కబ్జాలకు పాల్పడి ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బిఆర్ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్సే భూకబ్జాలకు పాల్పడుతుందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని నిజాలను నిగ్గు తేల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా భూ కబ్జాదారుల లెక్కలు తెలుస్తానని అన్నారని గుర్తు చేశారు కేసీఆర్ కుటుంబం అధికారములు ఉన్నప్పుడు ఎన్నో భూములను కొల్లగొట్టారని అన్నారు. 2004 సంవత్సరంలో కెసిఆర్ ఎంపీ అభ్యర్థిగా ఉన్నప్పుడు వ్యవసాయ భూములు లేవని ఎన్నికల పేర్కొన్నారని ఇప్పుడు ఇన్ని వందలఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కెసిఆర్ కుమారుడు కేటీఆర్ హరీష్ రావు సంతోష్ కవిత ప్రభుత్వ భూములను వేల ఎకరాలను ఆక్రమించారని దుయ్యబట్టారు. భూ సమస్యలను పరిష్కరిస్తామని 22ఏలో నిలిచింది జాబితాలో ఉన్న భూ సమస్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్ బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని అన్నారు. అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరిమాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ధనార్జన ధ్యేయంగా లక్షల ఎకరాలు కొల్లగొట్టారని సీలింగ్ ఫ్యాక్టు లేకుండా విలేకరాలను పెద్ద చేశారని విమర్శించారు వందల ఎకరాలు ఆక్రమించారని అన్నారు . అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని పేర్కొనడం సిగ్గుచేటు అని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిద్దంగుల సంస్థ మాజి చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, ఏ ఐ సి సి సేవాదల్ కో ఆర్డినేటర్ చోటా బాబా, జిల్లా అనుబంద సంఘ అధ్యక్షులు కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహీద్ హుస్సేన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, ఖాజా మురళి,లాల్ సింగ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వెదురు పెంపకాన్ని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (మనంప్రతినిధి): ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్యఅతిథిగా పాల్గొని వెదురు పెంపకం, పర్యావరణ పరిరక్షణ, వెదురు ఆధారిత ఉత్పత్తుల ప్రాధాన్యతపై మాట్లాడారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, వెదురు వేగంగా పెరిగే సహజ వనరు మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే మొక్క అని తెలిపారు. వెదురు పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు నేలకోతను నియంత్రించవచ్చని అన్నారు . ప్రకృతి వనరులను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు వెదురు వంటి ఉపయోగకరమైన మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వెదురును ఇళ్ల నిర్మాణం, ఫర్నిచర్, కాగితం, హస్తకళలు, అలంకరణ వస్తువులు తదితర అనేక రకాల ఉత్పత్తుల తయారీలో వినియోగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. వెదురు ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కళాకారులు, చేతివృత్తిదారులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక సాంకేతికత, డిజైన్లను జోడించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

వెనుకబడిన తరగతులకు చెందిన కళాకారులు, చేతివృత్తిదారులను వెదురు ఆధారిత ఉత్పత్తుల తయారీ వైపు ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. వెదురు ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అవసరమైన శిక్షణ, అవగాహన కల్పించడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అన్నారు.

భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వెదురు ప్రాధాన్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని విజయలక్ష్మి ,మేదరి కుల సంఘ నాయకులు కొంటు శ్రీనివాస్, స్వరూప,సింధూజ,కళావతి, రమాదేవి, పిల్లి శీను, సోమయ్య, బొల్లం శ్రీనివాస్, ప్రవల్లిక, కళాకారులు, చేతివృత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దలను వదిలి పేదలకు నోటీసులా..?

- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మం, సెప్టెంబర్ 18 (మనం న్యూస్): ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పెద్దలను వదిలి పేదలకు నోటీసులు ఇవ్వడం ఏమిటని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. ఎన్నెస్పి కాలువలను ఆక్రమించుకున్న అధికార పార్టీ నాయకుల వైపు కనీసం కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం పేదలను మాత్రం అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. శ్రీనివాస్ నగర్ పేదల ఇండ్లకు తొలగింపు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఐ నాయకులు శ్రీనివాస్ నగర్లో పర్యటించారు. పేదల ఇండ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని



జీవిస్తున్నారని గత ప్రభుత్వం జీవో నెం.58 క్రింద క్రమబద్ధీకరించిందని ఆయన తెలిపారు. కోట్లకు పడగలెత్తిన టింబర్ డిపో యజమానులకు అనుకూలంగా అధికారులు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తారా అని సురేష్ -అధికారులను ప్రశ్నించారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తుందని అదే పెద్దలు అక్రమించుకుంటే అధికారులు నివేదికలు ఇచ్చినా న్యాయస్థానాలు తీర్పునిచ్చినా ఆ వైపు కన్నెత్తి చూడరని ఆయన తెలిపారు. రోటరీ నగర్ ప్రాంతంలో అధికార పార్టీ నాయకులు లక్షలాది రూపాయల -విలువైన స్థలాలను అక్రమిస్తే ఈ అధికారులు ఎందుకు స్పందించ లేదని పేదలకు ఒక న్యాయం పెద్దలకు మరో న్యాయమని ఆయన నిలదీశారు. పేదల ఇండ్లను తొలగిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. త్రీటౌన్ ప్రాంతానికి కాలుష్యాన్ని కలిగిస్తున్న టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. టింబర్ డిపోలను తొలగించకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర -సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, నాయకులు సైదా, కుమార్ పాల్గొన్నారు.

# యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి

- హెచ్ఐవి రహిత జిల్లాగా ఖమ్మం ను తీర్చిదిద్దాలి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్




ఖమ్మం, సెప్టెంబర్ 18 (మనం న్యూస్): ఖమ్మం జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఆర్బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, లింక్ వర్కర్లు తదితరులు హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు అవగాహన, జాగ్రత్తలు, బాధ్యతాయుతమైన ఆరోగ్య అలవాట్లు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా యువతలో ఎయిడ్స్ పై శాస్త్రీయమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎయిడ్స్ తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారికి సామాజిక మద్దతు అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు, అధిక ప్రమాదానికి లోనయ్యే వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి నిర్ధారణ, చికిత్స, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జానపద కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కథన విధానం ‘పల్లె సుద్దులు’ ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డా. రామారావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వేణు మాధవ్, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ లెప్రసి) డాక్టర్ ఎల్. ప్రవీణ, ఎస్ఆర్బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకీరుల్లా, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చెంచు రత్నయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునంద, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బంది, కె.సి. పుల్లయ్య స్వచ్ఛంద సేవా సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవా సిబ్బంది, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవా సిబ్బంది, ఎ. శంకర్, అప్పా ప్రెసిడెంట్ , డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల భద్రతకు సీసీ కెమెరాలు



- రాష్ట్రంలోనే తొలిసారి జనగామలో అన్ని పంచాయతీల్లో ఏర్పాటు
- రూ.కోటి 50 లక్షలతో సీసీ కెమెరాలు: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి): గ్రామాల భద్రతకు సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు కీలకమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ లతో కలిసి గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.కోటి 50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో రెండు కెమెరాల చొప్పున ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి దశలో మండలాల వారీగా బచ్చన్నపేట-56, నర్మెట్ట-38, తరిగొప్పుల-34, జనగామ రూరల్-167, లింగాల ఘనపురం-54, రఘునాథపల్లి-84, చిల్పూర్-42, ఘనపూర్ స్టేషన్-38, జఫర్ గడ్-46, పాలకుర్తి-80, కొడకండ్ల-46, దేవరుప్పుల-68 కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేబుల్ నెట్ వర్క్, ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్ వేర్, వీడియో వాల్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జాతీయ రహదారులు, మండల కేంద్రాల పరిసరాల్లో పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియను ఈ-టెండర్ విధానంలో పారదర్శకంగా, జీవో నెం.52 నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఓ వెంకట్ రెడ్డి, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, సూపరింటెండెంట్లు వెంకటేశ్వర్లు, ఫణి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నిమ్మలకు అమెరికా ఏపిటిఏకి ఆహ్వానించిన సుభాష్

పాలకొల్లు,సెప్టెంబర్ 18 మనం ప్రతినిధి: సెప్టెంబర్ 24, 25 తేదీల్లో అమెరికాలోని చార్లెట్ నగరంలో జరగనున్న అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఏపిటిఏ) 18వ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారికి ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేశారు.ప్రముఖ పారిశ్రామికవేత్త రావూరి రంగారావు కుమారుడు, పాలకొల్లుకు చెందిన ప్రవాసాంధ్రుడు రావూరి చినబాబు సోదరుడు, ప్రముఖ వ్యాపారవేత్త, హీరో ఆటోమొబైల్ డీలర్ రావూరి పవన్ సుభాష్ మంత్రి ని ఆహ్వానించారు.ఈ సందర్భంగా రావూరి పవన్ సుభాష్ సేవా కార్యక్రమాలను మంత్రికి వివరించారు. అమెరికాలో స్థిరపడిన సుభాష్ వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. విద్య, వైద్య, సాంస్కృతిక రంగాల్లో పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు అందించడం, స్టెమ్ సెల్ డోనర్ ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించడం, సంకురాత్రి ఫౌండేషన్ వంటి సేవా సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.



## నషాముక్త్ వికసిత్ యువ భారత్ సంకల్ప అభియాన్ పోటీలు



- ఈ నెల 23న జిల్లాస్థాయి పోటీలు

వాసవి పెనుగొండ,సెప్టెంబర్18 మనం న్యూస్: మేరా యువభారత్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎస్వీకేపీ డాక్టర్ కె.ఎస్. రాజు ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్లో నషాముక్త్ యువ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి పోటీలకు సంబంధించిన గోడపత్రికను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు ఆవిష్కరించారు.ఈ నెల 23న నిర్వహించనున్న పోటీల్లో సంగీతం, నృత్యం, రీల్ షాట్స్, నాటక్, కవిత్వం, డిబేట్, స్లోగన్స్, పెయింటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యకరమైన జీవన విధానం, యువతలో సానుకూల ఆలోచనలు, డ్రగ్స్ ఫ్రీ ఇండియా వంటి అంశాలపై అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేరా యువభారత్ సిబ్బంది, ఆఫీస్ సూపరింటెండెంట్ సంక్రాంతి సూర్యనారాయణ, ఎన్సీసీ ఏఎన్ఓ డాక్టర్ కె. చిరంజీవి, జి. శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బాపిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్.ఎన్. శ్రీనివాస్, పి. మీరయ్య, టి. దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు ఎర్రవల్లిలో భూ సర్వే కొనసాగింపు

- హరీష్ రావు ఫామ్ హౌస్, రంగనాయక సాగర్ పరిసరాలను పరిశీలించి వివరాలు సేకరణ
- భూ బాధితుల ను పలకరించి వాస్తవాల సేకరణకు ప్రయత్నాలు



సిద్దిపేట, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ భూముల వ్యవహారంపై రెండో రోజు శుక్రవారం సర్వే జరిగింది. మరోవైపు కాంగ్రెస్ ఎంపీలు ఎమ్మెల్సీల బృందం అసెంబ్లీ నుండి ప్రత్యేక బస్సుల్లో నేరుగా సిద్దిపేట చేరుకొని హరీష్ రావు ఫామ్ హౌస్ తోపాటు రంగనాయక సాగర్ రిజర్వాయర్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. సిద్దిపేటకు వచ్చిన ప్రతినిధి బృందంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి ఎమ్మెల్యేలు అద్దంకి దయాకర్, బాల్కూరు వెంకట్ తదితరులు ఉండగా ముందుగా హరీష్ రావు ఫామ్ హౌస్ చేరుకొని పరిశీలించారు. అక్కడ కొంతమంది చుట్టుపక్కల రైతులను కలిసి వాస్తవ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్దిపేట పట్టణ సమీపంలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ ను పరిశీలించారు. రిజర్వాయర్ భూబాధితులను కలిసి పరిహారము ఇతర సౌకర్యాలు అందిన విధానాలను తెలుసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఏ విధమైనటువంటి సహాయ సహకారాలు ప్రభుత్వ నుండి అందాయని ఇంకా ఎవరికైనా అందవలసిన పరిహారాలు పెండింగ్ లో ఉన్నాయా అన్న విషయాలు తెలుసుకున్నారు. భూ సేకరణ పై వాస్తవాలను వివిధ కోణంలో అడిగి తెలుసుకున్నారు. సదరు భూములకు సంబంధించిన రికార్డులను, నక్షాలను కూడా పరిశీలించారు. బాధిత రైతులు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## ఎర్రవల్లి వద్ద రెండో రోజు భూ సర్వే



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ లో అసైన్ పట్టా భూములు ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరుకోవడంతోపాటు పూర్తిస్థాయిలో సర్వే చేసి వివరాలను అందించాలని కోరడంతో రెవెన్యూ అధికారులు రెండో రోజు శుక్రవారం సర్వే నిర్వహించారు. అసైన్ భూములు ఉన్న 325 సర్వేనెంబర్ హద్దులను గుర్తించడంతోపాటు ఇతర ప్రభుత్వ భూముల సర్వే నంబర్లను క్షేత్రస్థాయిలో వాటి వివరాలను గుర్తించడానికి సర్వే నిర్వహించారు. డిజిటల్ సర్వే ద్వారా భూముల హద్దులను గుర్తిస్తున్నారు. కాగా రెండో రోజు కూడా ఎర్రవలి గ్రామానికి చెందిన దళిత రైతులు కేసీఆర్ తమ భూములను కొనుగోలు చేయలేదని పట్టా భూములను మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. తాము కాస్తులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని దళిత రైతులు కోరడం గమనార్హం.

## పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

- సిడిపిఓ ఎం. ఉమా

పోడూరు, సెప్టెంబర్ 18, మనం ప్రతినిధి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పాలకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ ఎం. ఉమా అన్నారు. శుక్రవారం పోడూరు సచివాలయంలో నిర్వహించిన పోషణ మాస కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. జంక్ఫుడ్, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.పోడూరు మండలంలోని జిన్నూరు సెక్టార్ ఎన్ఆర్పేట అంగన్వాడీ కేంద్రం, గుమ్ములూరు సెక్టార్ అప్పిచెరువు అంగన్వాడీ కేంద్రాల్లోనూ పోషణ మాస కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అందించే భోజనం, మెనూ, ఆహార నాణ్యతపై అవగాహన కల్పించారు. మునగాకు పొడి, కరివేపాకు పొడిని ప్రతిరోజూ ఆహారంలో వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.పోడూరు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి వెంకటలక్ష్మి, ఎంఎస్కేబీ మౌనిక, ఆరోగ్యశాఖ హెచ్వీ సుధ, ఏఎన్ఎంలు శ్రీదేవి, జయంతి, ఆరోగ్య సహాయకుడు అమ్మిరాజు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్ హసీనా పాల్గొన్నారు. జిన్నూరు, గుమ్ములూరు సెక్టార్ల కార్యక్రమాల్లో ఏసీడీపీఓ పి. నాగరత్నం, సూపర్వైజర్లు కె. మోహనరాణి, హేమతులసి, ఏఎన్ఎం, ఎంఎల్హెచ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కష్టాలు కళ్లముందే ఉన్నా.. పట్టించుకోరా?

- మూడో రోజూ ఆందోళన బాటలో వీఆర్ఏలు

పోడూరు, సెప్టెంబర్ 18, మనం ప్రతినిధి: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజూ కొనసాగింది. పోడూరు తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో మండలంలోని 33 మంది వీఆర్ఏలు శుక్రవారం నిరసన చేపట్టారు. తమ సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

### ఏళ్ల తరబడి సేవలు.. అయినా సమస్యలు తీరవు

రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో కీలకమైన విధులు నిర్వహిస్తూ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ తమ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, అర్హతకు అనుగుణంగా పదోన్నతులు, సేవా ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### మా బాధను ప్రభుత్వం వినాలి

ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో గ్రామస్థాయిలో నిరంతరం పనిచేస్తున్నాం. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్నా మా కుటుంబాల భవిష్యత్తుపై భరోసా లేకుండా ఉంది. మా సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎదురుచూపులే మిగులుతున్నాయి.



మా బాధలను ప్రభుత్వం అర్థం చేసుకుని ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు, పదోన్నతులు కల్పించి మా కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నాం అని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమానికి మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు బి. ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు కె. సూర్యనారాయణ నాయకత్వం వహించారు. పోడూరు మండలానికి చెందిన మొత్తం 33 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ప్రత్యేక పిజిఆర్ఎస్తో సమస్యల సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

మొగల్తూరు, సెప్టెంబరు 18 (మనం న్యూస్) : ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 2 వ ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి, స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని నియోజకవర్గ ప్రజల నుండి అందిన 124 ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, పిజిఆర్ఎస్ ద్వారా వారి సమస్యలను స్వీకరించి నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. సమస్యలు ఏ శాఖకు సంబంధించినవో గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడం, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం అధికారుల ప్రధాన లక్ష్యమని ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, ఆర్డీవో దాసిరాజు, డిపివో దోసిరెడ్డి, స్వర్ణగ్రామం స్వర్ణవార్డు జిల్లా అధికారి ఎ వెంకటలక్ష్మి, తాసిల్దార్లు ఎండి అబ్దుల్ ఫరూక్, నాగార్జున, ఎంపీడీవో సి హెచ్ త్రిశూలపాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ధర్మవరంలో గణపతి నవరాత్రి వేడుకల్లో మురళీకృష్ణంరాజు

శంఖవరం సెప్టెంబర్ 18 మనం ప్రతినిధి: వినాయక చవితి సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం ధర్మవరం గ్రామంలోని రామారావుపేట కృష్ణుడు గుడి వీధిలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన గణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా రూ.5,000 విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మచ్చర్ల దాసు, కోలా తాతబాబు, మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ, జువ్వల దొరబాబు, కోన బాబ్జి, దాడి పుత్రయ్య, నల్ల వెంకటేష్, బలిజీ వీర్రాజు, మాదేపల్లి సూరిబాబు, కర్రి రాము, పెదిరెడ్డి కృష్ణ, మర్రి మురళి, పిట్టి లోవరాజు, పోకనాటి వరహాలరావు, దేవరపు రాంబాబు, ఇంటి సత్తిబాబు తదితరులు, కృష్ణుడు గుడి కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## వరుస చోరీలకు పోలీసులు చెక్



- ఇద్దరు దొంగలు అరెస్టు
- ఐదు కేసుల్లో నిందితులుగా గుర్తింపు.. రెండు కిలోల వెండి వస్తువులు స్వాధీనం

పెనుమంట్ర సెప్టెంబర్ 18 మనం న్యూస్ : అంతర జిల్లా పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెనుమంట్ర, ద్వారకాతిరుమల, రావులపాలెం, పోడూరు పోలీస్స్టేషన్ల పరిధిలో నమోదైన ఐదు చోరీ కేసుల దర్యాప్తులో వీరి ప్రమేయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.అరెస్టయిన వారిలో పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన గెడ్డాడ సురేంద్ర అలియాస్ సూర్య (24), తణుకుకు చెందిన సోదవరపు సాయి అలియాస్ దూలా సాయి (22) ఉన్నారు. పెనుమంట్ర పోలీస్స్టేషన్ పరిధిలో రెండు, ద్వారకాతిరుమల, రావులపాలెం, పోడూరు పరిధిలో ఒక్కో చోరీకి వీరు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ అద్నాన్ నయిమ్ అస్మి ఆదేశాలతో, నరసాపురం డీఎస్పీ మేకా సుధాకర్ సూచనల మేరకు పెనుగొండ సీఐ రాయుడు విజయ్కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. పెనుమంట్ర ఎస్ఐ కె. స్వామి, ఆచంట ఎస్ఐ కె. వెంకటరమణ, సర్కిల్ సిబ్బంది సమన్వయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో దర్యాప్తు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## సింహాద్రిపురంలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి అందజేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కిర్లంపూడి, సెప్టెంబర్ 18( మనం న్యూస్): పేదల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ స్పష్టం చేశారు. మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన జాజిమొగ్గల సుబ్బలక్ష్మి, కాలపురెడ్డి సుబ్బలక్ష్మి, మొగిలి రూపాదేవి, కంద దొంగబ్బాయి, కంద వీరబాబులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ. 1,60,456 విలువైన చెక్కులను శుక్రవారం ఆయన నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు వైద్యం భారం కాకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సీఎంఆర్ఎఫ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరి పోసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణ వైద్యసాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింహాద్రిపురంలో ఐదుగురు బాధితులు అనారోగ్యంతో దరఖాస్తు చేసుకోగానే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో వెంటనే నిధులు మంజూరయ్యేలా చేశామని వివరించారు. ఆర్థిక సాయాన్ని నేరుగా ఇంటి వద్దకే తెచ్చి అందించడం పట్ల లబ్ధిదారుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు నవీన్లకు కృతజ్ఞతలు తెలిపాయి. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని దర్శించుకున్న నవీన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరంరెడ్డి కాశిబాబు, తోట రవి, చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, బోదిరెడ్ల సుబ్బారావు, బుర్రి సత్తిబాబు, రేఖ బుల్లిరాజు, గండే కాశి, కాకిలేటి రాయుడు, కాకిలేటి బుజ్జి, కంద సత్యానందం, నంది రాజారావు, నంది బాలకృష్ణ, కాకిలేటి వీర్రాజు, కంద అప్పన్న, కాకిలేటి జయబాబు, గొల్లపల్లి సూరిబాబు, మాదేపల్లి నందీశ్వరుడు, కాకిలేటి రాజా తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



ఏలేశ్వరం,సెప్టెంబర్,18(మనం న్యూస్): యూటీఎఫ్ ఏలేశ్వరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో,మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి,విద్యారంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, మండల విద్యాశాఖ అధికారులు అబ్బాయి, వరలక్ష్మి,యూటీఎఫ్ నాయకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టి రాయవరం హత్య కేసు ఛేదించిన ప్రత్తిపాడు పోలీసులు



ప్రత్తిపాడు,సెప్టెంబర్,18:-(మనం న్యూస్): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టి రాయవరం చేపల చెరువు వద్ద ఈ నెల 11న జరిగిన హత్య కేసును ప్రత్తిపాడు పోలీసులు ఛేదించారు.సీఐ బి సూర్య అప్పారావు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ సమక్షంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు.డీఎస్పీ తిలక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పడాల వాని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వీర్ల జయ నాగ వెంకట సత్యనారాయణ అలియాస్ జయబాబు ఉద్దేశపూర్వకంగానే మోరు నరసింహారావును హత్య చేసినట్లు తెలిపారు.జయబాబు టి రాయవరం చేపల చెరువు వద్ద మేత డ్రైవర్గా పనిచేస్తున్నట్లు తెలిపారు.మృతుడి కుమార్తె బలే నాగలక్ష్మితో జయబాబు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ విషయంపై మృతుడు తన కుమార్తెను మందలించడంతో జయబాబు కక్ష పెంచుకున్నట్లు తెలిపారు.ఈ క్రమంలో పథకం ప్రకారం అర్ధరాత్రి మోటార్సైకిల్ చేపల చెరువు వద్దకు చేరుకున్న నిందితుడు,తన వెంట తెచ్చుకున్న కత్తితో మోరు నరసింహారావు కంఠంపై కోసి,నడుముపై పొడిచి హత్యకు పాల్పడినట్లు వివరించారు.అనంతరం బీరువాలో ఉన్న మృతుడి సెల్ఫోన్,రూ.2 వేల నగదు, రోల్డ్గోల్డ్ వస్తువులను తీసుకుని నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు డీఎస్పీ తిలక్ తెలిపారు.నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.త్వరితగతిన హత్య కేసును ఛేదించిన సీఐ బి.సూర్య అప్పారావు,ఎస్సై లక్ష్మీకాంతం,ప్రత్యేక బృందాల సిబ్బందిని జిల్లా ఎస్పీ జిబిందు మాధవ్,ఉన్నతాధికారులు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

## భద్రవరంలో 9వ పోషణ మాసోత్సవం



- సీడీపివో పద్మావతి

ఏలేశ్వరం,సెప్టెంబర్,18:-(మనం న్యూస్): ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామంలో 9వ పోషణ మాసోత్సవ ఐసీడీఎస్ సీడీపివో పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవంలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం,ఆరోగ్య సంరక్షణ,బాలల ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'మన అంగన్వాడీ-మన బాధ్యత' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం,ఆరోగ్య సేవలు,బాలల వికాస కార్యక్రమాలను వివరించారు.అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం,సమాజ సహకారం అవసరమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని,వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవగాహన కల్పించారు. అనంతరం పోషణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి బాబ్జి,జిగటాపు సూరిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ శివాజీ,ఇంజినీరింగ్ అసిస్టెంట్, సూపర్వైజర్ సూర్యకుమారి,అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు,బాలింతలు పాల్గొన్నారు.

### అమెరికా యుద్ధనౌకను

# ముంచేయాలని పాక్ అధికారుల ప్లాన్!

- 'డైరెక్టరేట్' పుస్తకంలో ప్రస్తావన



**వాషింగ్టన్, సెప్టెంబర్ 18:** ఇటీవల ఉత్తర అరేబియా సముద్రంలో పాకిస్థాన్‌కు చెందిన పీఎన్ఎస్ హునన్ యుద్ధ నౌక భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ కోల్కతా యుద్ధ నౌకను ఉద్దేశపూర్వకంగా ఢీ కొట్టింది. ఇదే తరహా ఘటన 2011లోనూ జరిగింది. పీఎన్ఎస్ బాబర్.. ఐఎన్ఎస్ గోదావరిని ఢీ కొట్టింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ జలాల్లో పాక్ వ్యవహరిస్తున్న తీరుపై భారత్ దౌత్యపరమైన నిరసనను తెలియజేసింది. అయితే.. ఈ తరహా ఘటనలకు పాల్పడటం పాకిస్థాన్‌కు కొత్తేం కాదు. 12 ఏళ్ల క్రితం పాక్ నేవీ అధికారుల కుట్ర ఫలించి ఉంటే.. యావత్ ప్రపంచం నివ్వెర పోయే పరిస్థితి తలెత్తేది!

**అసలేం జరిగిందంటే..?**

పాక్ కుట్రలపై అమెరికా జర్నలిస్ట్, రచయిత స్టీవ్ కోల్ గతంలో రాసిన 'డైరెక్టరేట్' పుస్తకంలో పేర్కొన్న ప్రకారం.. అల్ ఖైదాతో సంబంధం ఉన్న పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు నేవీ అధికారులు లెఫ్టినెంట్ జీషన్ రఫిక్, జర్ఖానీ 2014లో అమెరికాకు చెందిన యూఎస్ఎన్ఎస్ సప్లై యుద్ధ నౌకను ధ్వంసం చేయాలని కుట్రపన్నారు. అందుకు పీఎన్ఎస్ జుల్ఫికర్ యుద్ధ నౌకను ఉపయోగించాలని ప్లాన్ వేశారు. పీఎన్ఎస్ జుల్ఫికర్ చైనా తయారు చేసిన అత్యాధునిక యుద్ధనౌక. దీన్ని పాక్ కొనుగోలు చేసి 2012లో సైన్యంలో ప్రవేశపెట్టింది. అప్పట్లో అణ్వాయుధాలను ప్రయోగించే జలాంతర్గాములు పాక్ వద్ద లేవు. దీని సాయంతో అణ్వాయుధాలను ప్రయోగించవచ్చన్న ఉద్దేశంతో సైన్యంలో మోహరించింది. రెండు కిలో టన్నుల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలిగే సామర్థ్యం దీనికుంది. అంతేకాకుండా అత్యవసర సమయంలో టార్పిడోలను ప్రయోగించేందుకు వీలుగా దీని నిర్మాణం చేపట్టారు. అలాంటి అత్యాధునిక నౌకను ముందుగా హైజాక్ చేసి.. దానిని అరేబియా సముద్రంలోకి తీసుకెళ్లి.. దాని సాయంతో 44 వేల టన్నుల యుద్ధ సామగ్రితో వెళ్తున్న యూఎస్ఎన్ఎస్ నౌకను ధ్వంసం చేయాలన్నది పాక్ నేవీ అధికారుల ప్లాన్.

కుట్రలో భాగంగా రఫిక్, జర్ఖానీ యూనిఫామ్ ధరించి, కొన్ని రహస్య ఆయుధాలతో 2014 సెప్టెంబర్ 6న కరాచీ నావెల్ డాక్‌యార్డ్‌లోని పీఎన్ఎస్ జుల్ఫికర్ నౌక వద్దకు చేరుకున్నారు. కుట్రలో భాగమైన మరికొందరు నిందితులు కూడా అక్కడికి వచ్చారు. వారిని సెంట్రీ గమనించి కాల్పులు జరిపాడు. దీంతో వారు కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఈ క్రమంలో రఫిక్, జర్ఖానీతోపాటు మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు పట్టుబడ్డారు. రహస్య మిలిటరీ విచారణ తర్వాత వారికి మార్చి 2016లో పాక్ నావెల్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించింది. అయితే, దీనిపై 2024లో అక్కడి ప్రభుత్వం స్టే విధించింది.

**వారి కుట్ర ఫలించి ఉంటే..**

అరేబియా, హిందూ మహా సముద్రాల్లో ఉగ్రవాద నిరోధక, సముద్ర భద్రతా విధుల కోసం ఏర్పాటైన వివిధ దేశాలకు చెందిన నౌకా దళ కూటమి కంబైన్డ్ టాస్క్ ఫోర్స్- 150. ఇందులో పాకిస్థాన్ చురుకైన పాత్ర పోషించేది. అందువల్ల పీఎన్ఎస్ జుల్ఫికర్ తమ వైపు వస్తే అమెరికా దళాలు తమ మిత్రపక్ష నిఘా నౌకగా మాత్రమే భావిస్తాయి తప్ప శత్రువుగా అనుమానించే అస్కారం లేదు. యుద్ధ సామగ్రితో వెళ్తున్న యూఎస్ఎన్ఎస్ సప్లై నౌకను ఉద్దేశపూర్వకంగా ఢీ కొట్టేందుకు వస్తున్నట్లు గుర్తించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయేది.

ఆ రెండు దేశాల మధ్య సంబంధాలను పక్కన పెడితే.. పెను నష్టం వాటిల్లేది. రఫిక్, జర్ఖానీ మృతి చెందిన దాదాపు ఆరు వారాల తర్వాత భారత్‌కు చెందిన రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ ఏజెంట్లు.. జాతీయ భద్రతా సలహాదారుకు కీలక సమాచారం ఇచ్చినట్లు స్టీవ్ కోల్ తన పుస్తకంలో పేర్కొన్నారు. దాడికి కుట్ర పన్నిన సమయంలో పీఎన్ఎస్ జుల్ఫికర్‌కు న్యూక్లియర్ వార్ హెడ్ అమర్చి ఉందనేది దాని సారాంశం. కాకపోతే, అది ఎంతవరకు నిజమో స్పష్టత లేదు. అటు యూఎస్ఎన్ఎస్ సప్లై నౌకలోనూ ఆ సమయంలో అణ్వాయుధాలు ఉన్నాయి. ఒకవేళ వారి కుట్రలు ఫలించి ఉంటే.. ప్రపంచం నివ్వెరపోయే ఘటనకు పాక్ కారకురాలయ్యేది..!

### ఇంధన సంక్షోభంలోకి పాక్..

# పెళ్లిలో ఒక్క వంటకమే

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 18:** పాకిస్థాన్ ఇంధన సంక్షోభంలో కూరుకుపోతోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా సాధారణ స్థితిలోకి రాకపోవడంతో ఇంధన కొరతతో నానా అవస్థలు పడుతోంది. ఈ క్రమంలోనే ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ఫ్యూయల్ అలవెన్సుల్లో 50 శాతం కోత విధించింది. ఇతర అలవెన్సుల్లోనూ 5శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఆర్మీ, లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు అత్యవసర సేవలు అందించేవారికి మినహాయింపు ఇచ్చింది. పెళ్లిళ్లలో కేవలం ఒకే ఒక్క వంటకంతో సరిపెట్టాలని కోరింది.

అధికారిక విదేశీ పర్యటనలపై మూడు నెలల పాటు నిషేధం విధించింది. కేంద్ర మంత్రులు, ప్రభుత్వ



సలహాదారులు, అధికారులు అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణించాలని షరతు పెట్టింది. వీలైనంత వరకు వర్చువల్గానే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని అధికార యంత్రాంగాన్ని కోరింది. విదేశీ అతిథులు వచ్చిన సందర్భాల్లో మినహా అధికారిక విందులపైనా నిషేధం కొనసాగనుంది. సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు, కాన్ఫరెన్స్‌లపేరిట అనవసరపు ఖర్చులు చేయరాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా, దుకాణాలు, వాణిజ్య సముదాయాలను రాత్రి 9 గంటలలోపే మూసివేయాలని కోరింది. రెస్టారంట్లు, కేఫ్‌లను మాత్రం రాత్రి 11 గంటల వరకు నిర్వహించేందుకు అవకాశం ఇచ్చింది.

ఇదే తరహా పొదుపు చర్యలను పాకిస్థాన్ గత మార్చిలోనూ విధించింది. పాఠశాలలను రెండు వారాల పాటు మూసివేసింది. ప్రభుత్వ అధికారులు ఇంటి నుంచే పని చేసేలా ప్రోత్సహించింది. ఐటీ, టెలికం కంపెనీలు కూడా తమ ఉద్యోగులు ఇంటి నుంచి పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మార్చి 23న జరగాల్సిన రిపబ్లిక్ డే పరేడ్‌ను కూడా రద్దు చేసిందంటే అక్కడి పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అంచనా వేయొచ్చు.

ఫిబ్రవరిలో అమెరికా, ఇరాన్ మధ్య ప్రత్యక్ష యుద్ధం మొదలైనప్పటి నుంచి పాకిస్థాన్ ఇబ్బందుల్లో పడింది. పాకిస్థాన్‌కు అవసరమైన చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచే దిగుమతి అవుతుంది. అది కూడా కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా జరుగుతుంది. యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ మూసివేతతో పాకిస్థాన్‌కు ముడి చమురు రవాణా నిలిచిపోయింది. దీంతో ఇప్పటికే బలహీనంగా ఉన్న పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.

### యుద్ధం వేళ.. ఇరాన్ అగ్రనాయకులకు

# అమెరికా వీసాలు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 18:** పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచాన్ని తీవ్ర కలవరానికి గురిచేస్తోన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. యుద్ధం వేళ.. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఇతర కీలక నేతలు అమెరికాలో పర్యటించనున్నారు. ఆ నేతల వీసాలకు అమెరికా ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని యూఎస్ విదేశాంగశాఖ ధ్రువీకరించింది.

వచ్చేవారం న్యూయార్క్ నగరంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 81వ సమావేశాలు జరగనున్నాయి. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సహా ఇతర బృందం పాల్గొనేలా అమెరికా అనుమతులిచ్చింది. ''ఒక ఆతిథ్యదేశంగా మాకున్న బాధ్యతలకు అనుగుణంగా.. ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి బృందం సమావేశాల్లో పాల్గొననుంది'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి వెల్లడించారు. అయితే గతేడాదితో పోలిస్తే ప్రతినిధుల సంఖ్య తక్కువగా ఉంటుందని చెప్పారు. వారిపై ప్రయాణ ఆంక్షలు ఉంటాయని, విలాస వస్తువులు, ఇతర వుస్తువుల కొనుగోలుపై నిషేధం ఉంటుందని వెల్లడించారు.

అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ కోరుకుంటోందని, అయితే అందుకు అవసరమైన షరతులను అంగీకరించడానికి మాత్రం సిద్ధంగా లేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ''మనం చేసుకుంటే మంచి ఒప్పందం చేసుకుందాం. లేకపోతే లేదు'' అని ట్రూత్ పోస్ట్ పెట్టారు.

ఇదిలా ఉంటే.. ఇరాన్ ప్రతినిధులకు వీసాలు ఆమోదించిన అమెరికా.. పాలస్తీనా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందానికి మాత్రం



వీసాలను తిరస్కరించింది. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం విషయంలో తమ వాగ్దానాలను నిలుపుకోవడంలో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ సహా ఇతర ఉన్నతాధికారులు విఫలయ్యారని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. మరోవైపు, ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశాల నేపథ్యంలో ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భద్రతామండలిలో తిష్ఠవేసిన అగ్రదేశాలే అంతర్జాతీయ చట్టాలను ఇష్టారీతిగా ఉల్లంఘిస్తున్నాయని, అందువల్లే ఈ ఉమ్మడి వేదిక నిస్తేజంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంతర్జాతీయ వేదికను తక్షణమే సంస్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# రష్యా నుంచి మీరు కొనొద్దు..

- మేమైతే కొంటాం : ట్రంప్ తీరే వేరు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 18:** రష్యా నుంచి మీరు కొనద్దు.. కానీ మాకు మాత్రం నిబంధనలేవీ ఉండవన్నట్టుగా ప్రవర్తిస్తోంది అమెరికా. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం సుంకాలు వేస్తామని బెదిరిస్తోన్న ట్రంప్ సర్కార్.. తాను మాత్రం యురేనియం దిగుమతి చేసుకుంటుందట. రష్యా, ఇరాన్, చైనా, భారత్‌లను ఒకేసారి దెబ్బతీసేలా 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' బిల్లులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఉభయసభలు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇక ట్రంప్ సంతకమే మిగిలి ఉంది. అయితే ఈ బిల్లులో అగ్రరాజ్యం తనకుతాను మినహాయింపులు ఇచ్చుకుంది. దీనిద్వారా అణు ఇంధన అవసరాలను తీర్చుకోనుంది.



చమురు కొనుగోలు విషయంలో ఇతర దేశాలపై కఠిన ఆంక్షలు విధిస్తున్నప్పటికీ, తన సొంత అణు విద్యుత్ అవసరాల కోసం రష్యన్ యురేనియం దిగుమతులకు అమెరికా మినహాయింపులు ఇచ్చుకుంది. తన పౌర అణు రంగానికి అవసరమైన యురేనియం శుద్ధి లో దాదాపు 26% వరకు రష్యాపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం అమెరికాలో ఒకే ఒక్క యురేనియం శుద్ధి ప్లాంట్ మాత్రమే ఉంది. దాంతో దేశీయంగా ప్రాసెసింగ్ కొరత ఉంది. రష్యన్ ఇంధన సంస్థ 'రోసాటమ్' చాలా చౌకగా, నాణ్యమైన ప్రాసెస్డ్ యురేనియాన్ని సరఫరా చేస్తోంది. దాంతో అమెరికన్ పవర్ కంపెనీలు దశాబ్దాలుగా రష్యాపైనే ఆధారపడి ఉన్నాయి. ఇక, అమెరికాలో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తులో దాదాపు 20 శాతం వరకు అణు విద్యుత్ ప్లాంట్ల నుంచే వస్తుంది. ఇప్పుడు ఆంక్షల బిల్లులో మినహాయింపులు ఇచ్చుకోకపోతే ఆ విద్యుత్ ఆగిపోయి, యుఎస్ పవర్ గ్రిడ్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రస్తుతం అమెరికా దేశీయంగా యురేనియం శుద్ధి రంగాన్ని పునరుద్ధరించడానికి బిలియన్ల డాలర్లను వెచ్చిస్తోంది. అయితే ఆ వ్యవస్థలు అందుబాటులోకి రావడానికి కొన్ని సంవత్సరాల సమయం పట్టనుంది.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణపై సి.ఎస్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** డిసెంబర్ 11 వ తేదీనుండి 22 వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ను విజయ వంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై నేడు డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్. స్పోర్ట్స్ కార్పొరేషన్ ఎండి సోని బాలాదేవి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐ.టి శాఖ జాయింట్ సెక్రెటరీ అనుదీప్ దురిశెట్టి, రైతు డిస్కోమ్ ఎండి ముషారఫ్ అలీ, హెచ్ ఎండీఏ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితర సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు



మాట్లాడుతూ, ఈ డిసెంబర్ 11 నుండి 22 వ తేదీ వరకు హైదరాబాద్ తోపాటు మరో ఐదు నగరాల్లో ఈ ఖేలో ఇండియాయూత్ గేమ్స్ ను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్ తోపాటు హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొనే ఈ క్రీడా పోటీలు, దేశంలో జాతీయ క్రీడల అనంతరం అంతే ప్రాధాన్యత ఉన్న పోటీలని అన్నారు. మొత్తం 27 స్పోర్ట్స్ ఈవెంట్ లో దాదాపు 6050 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. వీటిలో 14 వ్యక్తిగత క్రీడా విభాగాలు, 6 విభాగాలు టీమ్ ఈవెంట్లు, మరో ఆరు ఇతర క్రీడా ఈవెంట్లు ఉంటాయనాను. ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్ గా, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి కో-చైర్మన్ గా మొత్తం 18 మంది తోకూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. దీనితోపాటు 28 ఉన్నతాధికారులతో కూడిన ఎక్సిక్యూటివ్ కమిటీ, మరో 18 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని సంజయ్ జాజు వెల్లడించారు.



# భూటాన్ అభివృద్ధికి తోడ్పాటు

### భారత విదేశాంగ మంత్రి జై శంకర్

**థింపూ, సెప్టెంబర్ 18:** భూటాన్ పురోగతికి, సుసంపన్నతకు దృఢమైన నిబద్ధతతో తోడ్పాటునందిస్తామని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. థింపూలో భూటాన్ ప్రధాని షెరింగ్ తొబ్గేతో ఆయన భేటీ అయ్యారు. అంతకుముందు భారత్‌లో తయారైన 54 విద్యుత్ వాహనాలను తొబ్గేకు జైశంకర్ అందజేశారు. భూటాన్ పౌరుల కోసం అంతర్జాతీయ యూపీఐ చెల్లింపుల రెండో దశను ప్రారంభించారు. భారత ప్రధాని మోడీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని థింపూలోని ప్రసిద్ధ తాషిచ్ఛో ఝూంగ్ బౌద్ధారామంలో 'ఆశిర్వాద్ క దియా' కార్యక్రమాన్ని భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్గ్యల్ వాంగ్చుక్ నిర్వహించారు.

# విమానంలో ప్రయాణికుల ముష్టిఘాతాలు

**ఢాకా, సెప్టెంబర్ 18:** ఇద్దరు ప్రయాణికులు దాడి చేసుకున్న ఘటన బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ విమానంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

లండన్ నుంచి ఢాకాకు ప్రయాణిస్తోన్న విమానంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఇరువురూ ఆగ్రహంతో ముష్టిఘాతాలు కురిపించుకోవడంతో ఓ వ్యక్తి షర్టు



చిరిగిపోయింది. దీంతో తోటి ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. క్యాబిన్ సిబ్బంది, ఇతర ప్రయాణికులు జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయితే ప్రయాణికుల మధ్య గొడవకు కారణం ఏంటనే విషయం తెలియరాలేదు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ జనరల్ మేనేజర్ మహబూబుద్దీన్ అహ్మద్ తెలిపారు.

## భద్రతామండలిలో తిష్ఠవేసిన అగ్రదేశాలే

### అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయి!

### ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్ ఆవేదన

**న్యూయార్క్, సెప్టెంబర్ 18:** అంతర్జాతీయంగా శాంతిభద్రతల పరిరక్షణ, యుద్ధాల నివారణలో కీలకపాత్ర వహించాల్సిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి పనితీరుపై ఐరాస సెక్రటరీ జనరల్



ఆంటోనియో గుటెరస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భద్రతామండలిలో తిష్ఠవేసిన అగ్రదేశాలే అంతర్జాతీయ చట్టాలను ఇష్టారీతిగా ఉల్లంఘిస్తున్నాయని, అందువల్లే ఈ ఉమ్మడి వేదిక నిస్తేజంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 15 దేశాలు (ఐదు శాశ్వత సభ్య దేశాలు, 10 తాత్కాలిక సభ్య దేశాలు) సభ్యులుగా ఉండే ఈ అంతర్జాతీయ వేదికను తక్షణమే సంస్కరించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన ఈ వేదిక నేటి ప్రపంచ పరిస్థితులకు తగిన విధంగా లేదని ఆక్షేపించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ (యూఎన్జీఏ) 81వ సమావేశాలు వచ్చే వారం ప్రారంభం కానున్న నేపథ్యంలో గుటెరస్ విలేకరులతో మాట్లాడారు. బహుపాక్షిక వాదం ద్వారా ప్రపంచ సంక్షోభాలను పరిష్కరించవచ్చనే భరోసాను కీలక దేశాలు ఇస్తున్నాయని ఇటీవలి బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్‌ను ఉద్దేశించి గుటెరస్ తెలిపారు.

# మసీదులో ఆత్మాహుతి దాడి

- పాకిస్తాన్‌లో 16మంది మృతి

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 18:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో ఓ మసీదులో ప్రార్థనలు జరుగుతోన్న సమయంలో ఓ వ్యక్తి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 16 మంది మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. మసీదు ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. అధికారులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయకచర్యలు ప్రారంభించాయి.



మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తూ ఏ ఉగ్ర సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

# తీవ్రమైన కరవులోనూ ఎండిపోని బావి

**బోస్నియా, సెప్టెంబర్ 18:** తీవ్రమైన ఎండలు, కరవుతో నదులు జలాశయాలు ఎండిపోతున్న వేళ.. దక్షిణ బోస్నియాలోని శతాబ్దాల నాటి ఓ బావి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఏడాది నెలల తరబడి వర్షం పడకపోయినా ఈ పురాతన బావిలో నీరు ఇంకిపోలేదు. ఇది ఎప్పటికీ ఎండిపోదనే స్థానికుల నమ్మకాన్ని నిజం చేస్తూ నీటితో కళకళలాడుతోంది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది ఈ వింత బావి.





## ఈయూలో కెనడాకు చోటిస్తే ఖబడ్దార్

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**షార్లట్, సెప్టెంబర్ 18:** యురోపియన్ యూనియన్‌లో కెనడాకు అనుబంధ సభ్యత్వం కల్పించాలన్న ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్యను తమ పట్ల శత్రుత్వాన్ని ప్రదర్శించడంగా భావించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన కార్యరూపు దాలిస్తే యూరప్‌పై మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు.

# లిఫ్ట్ సౌకర్యం కల్పించాలి

**మహబూబాబాద్, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్లాట్ ఫామ్ నం:2 వైపున అదనపు ప్లాట్ ఫాం నిర్మాణం లేదా లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్య డివిజినల్ రైల్వే మేనేజర్ గారికి రిప్రజెంటేషన్ ఇచ్చినట్లు సామాజిక కార్యకర్త మణికంటి చందర్ రెడ్డి తెలిపారు. ప్లాట్ నం:2 వైపున ప్రయాణికుల భద్రత కోసమే ఇటుక గోడను నిర్మించినప్పటికీ, స్టేషన్ లోపలికి వెళ్లేందుకు 70 మెట్ల ఎత్తుతో కూడిన కాలినడక వంతెన మాత్రమే ఉన్నది. ఎస్కావేటర్ లేదా లిఫ్ట్ సౌకర్యం కూడా లేకపోవడంతో కాలినడక వంతెన మార్గం ద్వారా 70 మెట్ల ఎత్తు ఎక్కడం వృద్ధులకు, అనారోగ్య సమస్యలున్న వారికి, లగేజీతో వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. ఈ విషయం ఒక ఎంపీ, మంత్రి స్థాయి వ్యవహారమే అయినప్పటికీ ఒక పౌరుడిగా, సామాజిక కార్యకర్తగా ఇచ్చిన రిప్రెసెంటేషన్.ను నమోదు చేసుకుని, స్టేషన్ గ్రేడ్, రెవెన్యూ జనరేషన్, రైల్వే గైడ్ లైన్స్ ప్రకారం పరిష్కార మార్గం చేస్తామన్నారని పేర్కొన్నారు.

# దళితులు తరిమికొట్టిన బుద్ధి రాలే

## కెసిఆర్ ఎర్రబెల్లి ఫామ్ హౌస్ పై నీ కుట్ర ప్రజలకు అర్థమైంది
## కరెంటు కోతతో సాగు రైతుల అవస్థలు పట్టణాలలో తాగునీటి ఎద్దడి
## బట్టి ఉత్తమ్ తూములు మూసివేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారి
## ఉమ్మడి జిల్లా మంత్రులకు రైతుల గోస పట్టదా ౦ దమ్ముంటే అసెంబ్లీకి పిలిచి చర్చ పెట్టు
## విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి




**సూర్యాపేట సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి):** సర్వే పేరుతో రేవంత్ రెడ్డి నాటకాలు ఆడితే ఎర్రబెల్లి దళితులు తరిమికొట్టిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిగ్గు రాలేదు అని స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని యద్దేవా చేశారు. మొన్న జరిగిన కేసీఆర్ ఎరవెల్లి ఫామ్ హౌస్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలకు ఆ ప్రాంత దళిత రైతులు బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 40% పంటలు ఎండబెట్టి సాగునీరు లేక రైతుల అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కరెంటు కోతతో రైతులు సాగునీరు అందక రోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గ్రామ పట్టణాలలో త్రాగునీరు లేక ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కెసిఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటలు కరెంటు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రజలను సంక్షోభం లోకి నెట్టి డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డి నడుపుతున్నాడని విమర్శించారు. నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువ సాగునీటిని మళ్లించుకునేందుకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎల్ఎంసి మీద ఉన్న అన్ని ఓటిఎస్ తూముల ను మూసివేయాలి ఈ మంత్రులే ఇరిగేషన్ సీఈ కి ఆదేశాలు ఇచ్చి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎడమ కాల్వ రైతాంగాన్ని తీరని అన్యాయం చేశారని దొడ్డిదారి ఆదేశాలతో సాగు నీళ్ళన్నీ ఖమ్మం జిల్లా బోనకల్, ముదిగొండ, చింతకాని మధిర ప్రాంతాలకు తరలించారని అన్నారు. సాగర్ ఎడమ కాలవ రైతులకు సరిపడా నీరు అందివ్వకుంటే తప్పకుండా ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నీళ్ల కోసం పాదయాత్ర చేపడుతుందని హెచ్చరించారు.రేవంత్..ఎన్ని డ్రామాలు చేసినా 22 ఎ.నుంచి తప్పించుకోలేవు ఇతరుల పై ఆరోపణలు చేసి తప్పించుకోవాలనేవి తెలివితక్కువ వేషాలు 22 ఎ పై ప్రజల నుండి శిక్ష తప్పదని నిండు శాసనసభలో అబద్దాలు చెప్పి దొరికిన దొంగ రేవంత్ రెడ్డి దమ్ముంటే మమ్మల్ని శాసనసభకు అనుమతించి

**చర్చ పెట్టాలి అని సవాల్ విసిరారు.**

మమ్మల్ని బయటకు పంపి బ్యాట్స్మెన్ లేకుంటానే బౌలింగ్ చేస్తున్న రేవంత్ మాకు అవకాశం ఇచ్చి చూడు.. అసెంబ్లీలో సిక్సులతో బౌండ్రిల మోత మోగిస్తాం కెసిఆర్ దగ్గర ఏందో చేస్తామని నోటికొచ్చినట్టు వాగితే తగిన శాస్తే మా భూముల్లో మేమే ఉన్నామని దళితులు చెప్పుతో కొట్టినట్లు చెప్పారని మరో మారు గుర్తు చేశారు.ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకుండా సర్వే పేరిట ఫామ్ హౌస్ చుట్టూ తిరుగుతున్నారు..

డ్రామా పొడిగింపు కోసమే ఎమ్మెల్యేలు ఎంపీలను పంపుతామంటున్నారు..22ఎ భూ బాధితులు రేవంత్ వెంట పడటం ఖాయమని జోష్యం చెప్పారు. కాలయాపన, డైవర్సన్ చేయడానికే హైలెవెల్ కమిటీ రేవంత్ ఆయన కుటుంబ సభ్యులు విలువైన భూములన్నీ గుంజుకు ంటున్నారు.. రకరకాల పేర్లతో తోడేళ్ళలా జనాన్ని భయపెట్టి 30%, 40% భూములు లాగేసుకుంటూ దందా రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు.

**ఎల్నినో పేరిట డ్రామాలాడి నీటిని ఆంధ్రాకు పంపుతున్నావ్..**

సాగునీరు , కరెంట్ , తాగునీరు పై పట్టింపులేదు సర్వేల పేరుతో డైవర్షన్ చేస్తున్నరు నువ్వు కాదు.. మేము ఇన్నింగ్స్ మొదలుపెడతాం ఎవర్నీ వదిలి పెట్టేది లేదని మీ భూ బాగోతాలు మొత్తం బయటపెడతాం అని హెచ్చరించారు. ఎన్ హెచ్ 65 హైద్రాబాద్ - విజయవాడ రహదారికి సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ కేటాయించేవరకు ఉద్యమాలు ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు.చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని రంగాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ ప్రకటించి ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. సూర్యాపేట ప్రజలందరి ఆకాంక్ష మేరకు స్థానిక శాసన సభ్యునిగా జేఏసీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో నా వంతు మద్దతు నిరంతరం ఉంటుందని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో మాజీ మార్కెట్ చైర్మన్ వై వెంకటేశ్వర్లు మున్సిపల్ మాజీ చైర్మన్ పెరుమళ్ళ అన్నపూర్ణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్. జిల్లా గ్రంధాలయ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్. గుర్రం సత్యనారాయణ రెడ్డి ఉప్పల ఆనంద్ మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున గాలి సాయి. ముదిరెడ్డి అనిల్ రెడ్డి పలువురు గులాబీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గప్‌చుప్‌గా.. కల్తీ పల్లీల దందా?



## మేళ్లచెరువులో అనుమతులు లేకుండా యదేచ్ఛగా వ్యాపారం
## గతంలో ఇదే వ్యాపారిపై పలు కేసులు
## ప్రజలు అనారోగ్య బారిన పడకుండా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్
## జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ ఆవశ్యం

**మేళ్లచెరువు, సెప్టెంబర్ 18(మనం న్యూస్):** మేళ్లచెరువు మండలంలో కల్తీ పల్లీలు (వేరుశెనగ గింజలు) వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా నడుస్తున్నట్లు తెలుస్తోంది... మేళ్లచెరువు గ్రామానికి చెందిన.. ఓ వ్యక్తి ఎటువంటి లైసెన్సు లేకుండా తన బంధువులు స్నేహితుల వద్ద నుండి బస్తాల ద్వారా నాస్తి రకం పల్లీలు దిగుమతి చేసుకొని.. ధనార్జన ధ్యేయంగా కల్తీ పల్లీలను స్థానిక వ్యాపారస్తులకు అంటగడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం...ఈ మోసం పసి గట్టని.. కొందరు వ్యాపారస్తులు ఇతగాడి మాయలో పడి.. తెలియక పల్లీలు కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు తమకు కల్తీ సరుకు వద్దు అంటే బలవంతంగా కట్టబెడుతున్నాడని పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు వ్యాపారస్తులు ఆరోపించారు. ఈ వ్యక్తి ఎన్నో ఏండ్లుగా... ఈ దందా నడిపిస్తున్న పట్టించుకునే నాధుడే ఉండకపోవడం గమనార్హం... ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎలాంటి అనుమతులు గాని లైసెన్స్ లేకుండా వ్యాపారాన్ని దర్జాగా కొనసాగిస్తుండడం... దీనిపై ఇప్పటివరకు సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికార యంత్రాంగం నజర్ పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది... ఇదే వ్యాపారం ఏదేచ్ఛగా కొనసాగిస్తే నాస్తి రకం పల్లీల నూనెతో ప్రజలు అనారోగ్య పాలు కావడం ఖాయం.. దీనిపై జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికార యంత్రాంగం దృష్టి సారించి కల్తీ పల్లీల వ్యాపారానికి. చరమగీతం పాడి జనం అనారోగ్య పాలు కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.. ఇకనైనా ఆ వ్యాపారి ఆగడాలను నివారించాలని స్థానిక వ్యాపారస్తులు సైతం కోరుతుండడం కొసమెరుపు.. ఇదిలా ఉంటే గతంలో కూడా ఈ అక్రమ వ్యాపారి పై కేసులు పలు కేసులు నమోదయినట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది..

# పూర్తిచేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించండి

## నిరుద్యోగ యువత ఇబ్బందులు తొలగించండి: రాపోలు నవీన్ కుమార్



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 18(మనం న్యూస్):** విజ్ఞాన భాండారాలైన, ఆధునిక దేవాలయాలు గా ప్రసిద్ధిగాంచిన గ్రంథాలయాల నిర్మాణం పూర్తయి చాన్నాళ్లు అయినందున హుజూర్ నగర్ మరియు నేరేడుచర్లలో తక్షణమే మంత్రి ఉత్తమ్ వాటిని ప్రారంభించి నిరుద్యోగ యువతకు అందుబాటులోకి తేవాలని బి ఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ కోరారు గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ ముందు బిఆర్ యస్ మరియు నిరుద్యోగ యువతతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు ఉండే గదులు కావు అని అవి జ్ఞానానికి నిలయాలు, యువత భవిష్యత్తుకు బాటలు వేసే కేంద్రాలు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఖరీదైన పుస్తకాలు, కోచింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా, గ్రంథాలయాలు వారికి ఎంతో ఉపయోగపడతాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు పుస్తకాలు, పత్రికలు, ప్రశాంతమైన చదువు వాతావరణం అవసరం అలాంటి జ్ఞాన భాండాగారాలు మూసి ఉంటే నష్టపోయేది ఒక భవనం కాదు చదువుకునే అవకాశం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత సమయం, వారి భవిష్యత్తు అని వెనువెంటనే వాటిని ప్రారంభించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బిఆర్ యస్ నాయకులు తకెళ్ళ నాగార్జున షేక్ నాగుల్ మీరా పత్తిపాక రమేష్ గౌతమ్ వాస విజయ్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- **రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు తప్పక హాజరు కావాలి**
- **మెగా కార్పొరేట్ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి**
- **టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి**



**కోదాడ, సెప్టెంబర్ 18(మనం న్యూస్):** నేడు కోదాడలో సీసీ రెడ్డి కాన్వెంట్ లో నిరుద్యోగ యువత కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడుతున్న మెగా కార్పొరేట్ జాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు తప్పక హాజరుకావాలని టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలలో నిరుద్యోగ సమస్యను అధిగమించాలంటే నిరుద్యోగులకు జాబ్ మేళా లు ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఉమ్మడి నల్లగొండ జిల్లా, ఖమ్మం జిల్లా నుండి ఎక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నట్లు తెలిపారు. చాలామంది నిరుద్యోగ యువత వేలకు వేలు ఖర్చుపెట్టి కోచింగ్ లు తీసుకొని ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఖర్చు లేకుండా కంపెనీలనే నిరుద్యోగుల వద్దకు తీసుకురావాలనే సంకల్పంతో మంత్రి, ఎమ్మెల్యే ఎనలేని కృషిచేసి సుమారు 300 కంపెనీలను కోదాడకు తీసుకు వస్తున్నట్లు తెలిపారు. కావున కోదాడ నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వృధా చేసుకోకుండా సద్వినియోగం చేసుకొవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారు 19వ తారీఖు నాడు సిసి రెడ్డి కాన్వెంట్ కు వస్తే వారి రిజిస్ట్రేషన్ చేసి వారికి కూడా అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనకై బందు విజయవంతం

## అఖిలపక్ష నాయకులు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు



**సూర్యాపేట టౌన్ సెప్టెంబర్ 18 (మనం న్యూస్):** జాతీయ రహదారి 65 కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ నిర్మాణం చేపట్టాలని బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీ ఇచ్చిన సూర్యాపేట పట్టణ బంద్ శుక్రవారం అఖిలపక్ష పార్టీలు అన్ని వర్గాల ప్రజల మద్దతు ప్రశాంతంగా ముగిసింది. సూర్యాపేట బస్ డిపో ఎదురుగా తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన బంద్ 8 గంటలకు కొందరు నేతల అరెస్టుతో బంద్ పట్టణంలోకి చేరింది. వివిధ సంఘాలు భారీ ర్యాలీలతో బంద్ జయప్రదం చేసేందుకు మోటార్ సైకిల్ ర్యాలీలతో పట్టణ వీధుల్లో మా బుల్లెట్ ట్రైన్ మాకు రావాలని నినాదం మారిపోయింది. అప్పటికే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న వర్తక, వాణిజ్య, వ్యాపార, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలు, వర్క్ షాప్ లు, హోటళ్లు షాపింగ్ మాల్ లు, కిరాణా షాపులు, ఆటో నగర్, బైక్ మెకానిక్ ల అసోసియేషన్ ఇలా ఒక్కటేమిటి పట్టణంలోని అన్ని రంగాల సంస్థలు మూసివేసి సంఘీభావం ప్రకటించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, సూర్యాపేట బార్ అసోసియేషన్, ఆటోనగర్ కార్మిక సంఘం, హోటల్ యజమానుల సంఘం, టైలర్స్ అసోసియేషన్, సంఘాలు,క్లాత్ మర్చంట్ అసోసియేషన్, దివ్యాంగుల అసోసియేషన్, తదితర సంఘాలు బందుకు మద్దతుగా ర్యాలీలు తీశారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు,ముస్లిం మైనారిటీ నేతలు,మహిళా సంఘాల బాధ్యులు, బందులో, ర్యాలీ లో పాల్గొన్నారు. అన్ని పార్టీల నేతలు, విద్యార్థి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ ప్రధాన బాధ్యులు పట్టణ బందులో పూర్తిగా పాల్గొని ముందుండి నడిచారు. మధ్యాహ్నం దీక్షా శిబిరం నుండి కొత్త బస్టాండ్ వరకు అన్ని సంఘాలు సంస్థలు పార్టీలతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. దీనిలో స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, జుట్టు కొండ సత్యనారాయణ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ,కొనకంచి వీరభద్రయ్య, అనంతుల యల్లయ్య, యాదగిరి రావు, గండూరు శంకర్ యమా ప్రభాకర్, ఇరుగు కోటేశ్వరి జహంగీర్,పోలేబోయిన కిరణ్, గంట నాగయ్య, బిలిదే శ్రీను బండారు రాజా కర్నాటి కిషన్,రవి సలిగంటి వీరేందర్ ముప్తి సయ్యద్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్,రాందేని అదినారాయణ,యాతకుల రాజయ్య,సంపత్ సింహాద్రి సుమన్ నాయక్ నాగు నాయక్ మురళి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ నుండి చెన్నై కి వయా జాతీయ రహదారి 65 సూర్యాపేట కు మద్దతుగా సూర్యాపేట పట్టణ బందును, విజయవంతం చేసి ప్రజల ఆకాంక్షను బలంగా రాష్ట్ర స్థాయికి చేరిందని ఉద్యమ కమిటి అభిప్రాయం వ్యక్తం చేసింది.బంధు మొత్తాన్ని కవర్ చేస్తూ ఎప్పటికప్పుడు ప్రచారంలోకి తీసుకువచ్చి మద్దతుగా నిలిచిన ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా బాధ్యులకు బుల్లెట్ ట్రైన్ ఉద్యమ కమిటీ ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉద్యమ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి , గౌరవ సలహా దారులు పెద్దిరెడ్డి గణేష్ , రమణాచారి, పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్,మల్లు నాగార్జున రెడ్డి , తండు శ్రీనివాస్ యాదవ్, డేవిడ్ కుమార్ , బూర వెంకటేశ్వర్లు ,కొత్తపల్లి శివకుమార్, రేణుక, నెమ్మది వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకన్న, అనంతుల మధు,జర్నలిస్టు భూపతి రాములు, యాదగిరి,సట్టు నాగయ్య, వెలుగు వనిత, శోభారాణి విద్యార్థి సంఘం నాయకులు బషీపంగు సునీల్, ఎనిగా సంతోష్ రెడ్డి, పోరెళ్ల విప్లవ్ కుమార్, గుగులోత్ సురేష్ నాయక్, దారావత్ శివ నాయక్, సందీప్, మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**అక్రమ అరెస్టులు**

బుల్లెట్ ట్రైన్ సాధనలో ముందస్తుగా బందుకు పిలుపునిచ్చి పట్టణ ఆర్టీసీ డిపో ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల పక్షాల ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి ఏడున్నర గంటల వరకు డిపో ముందు ఆంధ్ర వ్యక్తం చేశారు. ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి.

పట్టణ సిఐ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఉద్యమకారులను అరెస్టు చేశారు.కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి, చలమల నరసింహ, బూర వెంకటేశ్వర్లు,వెలుగు వనిత, సట్టు నాగయ్య, యార్క చర్ల శోభారాణి, రేణుక, పద్మ, ఇమామ్ బి, రామ్మూర్తి గౌడ్, యాదగిరి, మీనయ్య తో పాటు మొత్తం 14 మందిని అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు లకు నిరసనగా అఖిల పక్షాల నిరసన వ్యక్తం చేశారు.

# బాన్సువాడ గణేష్ ఉత్సవాల భద్రతపై ఎస్పీ పరిశీలన



**కామారెడ్డి, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్చంద్ర శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని గణేష్ మండపాలను సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక బస్సులో నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. పాత బాన్సువాడ చావిడి నుంచి సంగమేశ్వర్ కాలనీ, అంబేడ్కర్ చౌరస్తా, తాడుకోల్ చౌరస్తా, గాంధీచౌక్, జండాగల్లి మీదుగా కల్కి చెరువు వరకు రూట్ను పరిశీలించారు. రహదారులు, ట్రాఫిక్, విద్యుత్ తీగలు, లైటింగ్, పారిశుద్ధ్యం, బారికేడింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కల్కి చెరువు వద్ద రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్స్టేషన్లో గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి, పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో పాల్గొన్నారు.సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. 'భక్తి, భద్రత, బాధ్యత' సూత్రంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బాన్సువాడ రూరల్ పోలీస్ కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, సున్నిత ప్రాంతాల పర్యవేక్షణపై సూచనలు చేశారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పి. విఠల్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, ఎస్హెచ్ఓ శ్రీధర్, పోలీసు అధికారులు, సిబ్బంది, మున్సిపల్ చైర్మన్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హౌస్ ఆఫ్ మెక్డొవెల్స్ సోడా 'యారీ కీ నయా వైబ్'తో 'యారీ'కి కొత్త రూపు

**వరంగల్, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** హౌస్ ఆఫ్ మెక్డొవెల్స్ సోడా, తమ దీర్ఘకాల బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండతో 'యారీ కీ నయా వైబ్' అనే తాజా ప్రచారాన్ని ఆవిష్కరించింది. స్నేహంతో బ్రాండ్కు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తూ, ఈ ప్రచారం కొత్త తరం ' స్నేహాన్నీ అనుభవించే విధానంలో వస్తున్న మార్పును ప్రతిబింబిస్తుంది. కేవలం కలిసి సమయం గడపడానికే పరిమితం కాకుండా, ప్రతి కలయికను మరింత గుర్తుండిపోయేలా చేసే అనుభవాలను సృష్టించడం వైపు ఈ ప్రచారం సాగుతుంది.

హౌస్ ఆఫ్ మెక్డొవెల్స్ సోడాకు, 'యారీ' అంటే ఎల్లప్పుడూ స్నేహితుల మధ్య ఉండే సులభమైన, సహజసిద్ధమైన అనుబంధమే. 'యారీ కీ నయా వైబ్'తో, నేటి స్నేహాలు ఆకస్మికత, పంచుకున్న అనుభవాలు మరియు కలిసి ఏదైనా కొత్త పని చేయాలనే నిరంతర కోరిక ద్వారా రూపుదిద్దుకుంటాయని గుర్తిస్తూ, ఈ బ్రాండ్ ఈ సుపరిచితమైన అంశాన్ని ముందుకు తీసుకువెళుతోంది.

ఈ ప్రచారంపై డయాజియో ఇండియా వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ మరియు కేటగరీ హెడ్ ఆనందితా దత్తా, బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, సాచి సాచి ఇండియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ కార్తీక్ స్మెటాసెక్ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# వెదురును ప్రోత్సహిద్దాం.. పర్యావరణాన్నికాపాడుదాం




**కామారెడ్డి, సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి):** ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో మేదర మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో కేతేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మల్లికార్జున్, డా. భవాని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు, మేదర మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు కిషన్, కామారెడ్డి పట్టణ అధ్యక్షులు, భిక్కనూరు మండల అధ్యక్షులు రమేష్, ఏబీసీడీఓ చక్రధర్, ఏఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణలో వెదురు కీలక పాత్ర**

ఈ సందర్భంగా వెదురు ఉత్పత్తుల ప్రాముఖ్యత, వాటి వినియోగం, వెదురు ఆధారిత జీవనోపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో వెదురు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతులు మెరుగుపరిస్తే మేదర వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందని తెలిపారు. మేదర సంఘం ప్రతినిధులు తమ వృత్తికి సంబంధించిన పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. వెదురు ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వెదురు సాగు, ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిసరుకుపై సబ్సిడీ కల్పించాలని కోరారు. వెదురు మొక్కల పెంపకానికి బంజరు భూములను కేటాయించాలని, మేదర కుల వృత్తిదారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మేదర సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, పవన్, స్వామి, శాంతయ్య, వెంకటేష్, శ్రీకర్, అశ్వాక్, తిరుమల, అనసూయ తదితరులతో పాటు మేదర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీలకు ఉచిత వైద్య సాయం

తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం
డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు

**ములుగు,సెప్టెంబర్ 18, మనం ప్రతినిధి:** తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన అర్హులైన రోగులు 'డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్' కింద అందించే వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు కోరారు. శుక్రవారం కలెక్టర్ ఒక ప్రకటనలో పథకానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన వ్యాధులతో బాధపడుతూ ప్రత్యేక వైద్య చికిత్స, శస్త్రచికిత్స అవసరమైన ఎస్సీ, ఎస్టీ వర్గాల రోగులకు ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దరఖాస్తుదారు తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించకూడదని తెలిపారు. గుండె సంబంధిత శస్త్రచికిత్సలు, మూత్రపిండ వ్యాధులకు డయాలసిస్, క్యాన్సర్‌కు కీమోథెరపీ, రేడియోథెరపీ, మెదడు సంబంధిత శస్త్రచికిత్సలు, మూత్రపిండాలు, కాలేయం తదితర అవయవాల మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సలతోపాటు ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఆసుపత్రి ధ్రువీకరించిన అంచనా చికిత్స వ్యయంలో నిబంధనల మేరకు వందశాతం సహాయాన్ని, ఆయా చికిత్సలకు నిర్దేశించిన గరిష్ట పరిమితికి లోబడి మంజూరు చేస్తారని పేర్కొన్నారు. మంజూరైన మొత్తాన్ని రోగికి నగదు రూపంలో అందించకుండా, చికిత్స నిర్వహించే ఆసుపత్రి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారని తెలిపారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రులు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం గుర్తింపు పొందిన ఆసుపత్రులతోపాటు డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన రోగులు డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ నిర్దేశించిన నమూనాలోని దరఖాస్తు పత్రాన్ని వినియోగించాలని, అవసరమైతే అదే నమూనాలో సాధారణ కాగితంపై దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రోగి ఫోటోతోపాటు సంబంధిత ఆసుపత్రి వైద్య పర్యవేక్షకుడు ధ్రువీకరించిన చికిత్స అంచనా వ్యయం, ప్రతిపాదిత చికిత్స, శస్త్రచికిత్స తేదీ వివరాలను జతచేయాలని తెలిపారు. మూత్రపిండాలు, ఇతర అవయవాల మార్పిడి చికిత్స కోసం దరఖాస్తు చేసుకునేవారు అవయవ దాత వివరాలతోపాటు రోగికి, దాతకు మధ్య ఉన్న బంధుత్వాన్ని నిర్ధారించే ధ్రువపత్రాలను కూడా సమర్పించాలని పేర్కొన్నారు.పూర్తిచేసిన దరఖాస్తును ప్రతిపాదిత శస్త్రచికిత్స, డయాలసిస్, కీమోథెరపీ, ఇతర చికిత్స తేదీకి కనీసం 15 రోజుల ముందుగా దరఖాస్తులను డైరెక్టర్, డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్, 15, జనపథ్, న్యూఢిల్లీ-110001 చిరునామాకు పంపించాలని తెలిపారు. పథకం మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనా, ఇతర పూర్తి వివరాల కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ అధికారిక వెబ్సైట్ [illegible] సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ రోగులకు ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అర్హులైన రోగులు అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకొని వైద్య సహాయం పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీగా నాగేంద్రబాబు



**మంగపేట, సెప్టెంబర్ 18, మనం ప్రతినిధి:** మంగపేట మండలం రాజుపేటకు చెందిన కర్రి నాగేంద్రబాబు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా సెక్రటరీగా నియమితులైన సందర్భంగా మంత్రి ధనసరి అనసూయ సీతక్కను శుక్రవారం ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబును సీతక్క శాలువాతో సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ సోషల్ మీడియాను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐజేక్ ఆదినారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ, మాజీ డైరెక్టర్ గంగినేని శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకత్వ పిలుపుమేరకు ములుగు జిల్లా ఇండస్ట్రీస్ డీఎం సిద్ధార్థ రెడ్డికి గత తొమ్మిది రోజుల నుండి జిల్లాలోని రైస్ మిల్లులు నిరవధిక సమ్మెలో ఉన్నాము అని తెలియజేస్తూ రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, కార్యదర్శి సూదిరెడ్డి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్ ఉపాధ్యక్షులు అక్కల రగేశం, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు

## లంచం తీసుకుంటుండగా పట్టుబడిన ఎంఆర్వో



**గోవిందరావుపేట, సెప్టెంబర్ 18, మనం ప్రతినిధి:** ఎమ్మార్వో సృజన్ కుమార్ పోస్టింగ్ ఎక్కడ చేసిన అక్కడ అమాయకులైన రైతులను పట్టాల పేరుతో మోసం చేస్తూ లక్షల రూపాయలు తీసుకున్న ఎమ్మార్వో రెవెన్యూ ఆర్ఐతో కుమ్మక్కై అవినీతి కార్యక్రమాలు ఇతను చేసిన మండలాలలో చాలామంది రైతులు ఇతని చేతిలో మోసపోయారు ఏటూర్ నాగారంలో ఇతని చేతివాటంతో ఒకరి పేరు మీద ఉన్న పట్టాలు మరొకరికి చేసి రెవెన్యూ ఆర్ ఐ చేతివాటాలతో రైతుల భూములు మరొకరికి పట్టాలు చేశారు ఇతనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని విచారించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గోవిందరావుపేటలో ఎమ్మార్వో గా విధులు నిర్వహిస్తున్న సృజన్ కుమార్ పట్టా మార్పిడి పేరుతో 14 వేల రూపాయలు లంచం అడగగా సంబంధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు దీనితో అప్రమత్తమైన ఏసిబి అధికారులు రెడ్ అండ్ డేట్ గా పట్టుకొని ఆధీనంలోకి విచారిస్తున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



- బాధిత కుటుంబానికి రఘు పరామర్శ

**ఏటూర్ నాగారం, సెప్టెంబర్ 18 మనం ప్రతినిధి:** మండల కేంద్రంలోని క్రాస్రోడ్ ఐటీఐ వెనుక నివాసముంటున్న ఇర్పా సుజాత-నరేష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమై కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషయం తెలుసుకున్న జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు బాధితులను పరామర్శించిన ఆయన.. ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని తహసీల్దార్కు ఫోన్ చేసి కోరారు. కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్కెర లాలయ్య, కూరపాటి వేణు, గండపెల్లి సత్యం, ముమ్మనేని రమేష్, గండపెల్లి మహాలక్ష్మి, గండపెల్లి రజిని పాల్గొన్నారు.

## బాలాజీ బంజారా కాలనీలో ఘనంగా కుంకుమ పూజ



- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

**హనుమకొండ, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయకుని మండపంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కుంకుమ పూజ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని మంథని దేవి రామ్ శర్మ అయ్యగారు వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లావుడియా పల్లవి రాజు నాయక్, పోరిక వనిత, భూక్య మౌనిక, రజిత, రాజేశ్వరి, సరిత, మానస, విమల, కమల, అనూష, ఝాన్సీ, రజిని, అనిత, కవిత, లలిత, భారతి, మణి, శారద, నీల, బద్రి, పావని, షీల, జాను తదితరులు పాల్గొని కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో భక్తి వాతావరణం నెలకొంది. వినాయక చవితి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

## టీజీఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి



**హనుమకొండ, సెప్టెంబర్ 18(మనంన్యూస్):** ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్లో సంతోష్నగర్లో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా కమిటీ లో జిల్లా కార్యదర్శి వి వీరన్న నాయక్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధన కోసం తెలంగాణ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తు పోరాటాలకు మహాసభలు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. ఈ నెల 27న ఠాను నాయక్ నంగారా ఉత్సవాలతో రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో రోజు రాష్ట్రంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను మహాసభలు రూపొందిస్తాయని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు ఉద్యోగ కల్పన చేయాలని స్వయం ఉపాధి చూయించాలని గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా కేంద్రాలలో శ్రీ సేవాలాల్ మహారాజ్ కామ్రేడ్ తాను నాయక్ స్థలము కేటాయించాలని గిరిజన ఉద్యోగ అవకాశాల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో నాణ్యమైన కోచింగ్ తో పాటు ఆన్లైన్ కోచింగ్ ఇప్పియాలని తండాలను రెవెన్యూ గ్రామ పంచాయితీలుగా గుర్తించాలని రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని గిరిజనులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని పట్టణాలకు వలస వచ్చిన గిరిజనులకు ఉపాధి చూపించి ఆదుకోవాలని పాలకపక్షాన్ని జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది ఈ నెల 27న జరిగే సాంస్కృతిక సంబరాలు, బహిరంగ సభకు గిరిజనులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు మహాసభలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు డి రమేష్ డీజే లాలూ సునీల్ విజయ్ రాఘవ,తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



- మంత్రి కోమటిరెడ్డి బాధ్యత తీసుకోవాలి
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- ఇంటి స్థలాలు వచ్చేవరకు జర్నలిస్టులకు అండగా ఉంటాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి

**నల్లగొండ, సెప్టెంబర్ 18( మనం ప్రతినిధి):** నల్లగొండ జిల్లాలో మూడు దశాబ్దాలుగా ఇంటి స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు తక్షణమే ఇంటి స్థలాలు కేటాయించే బాధ్యతను జిల్లా ఇన్చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సాధన కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను నిర్వర్తిస్తూ, తమ కుటుంబాల్లో ఎన్నో ఇబ్బందులు, ఆర్థిక కష్టాలు, అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పక్కనబెట్టి సమాజం కోసం పనిచేస్తున్నారని అన్నారు. అలాంటి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయో చెప్పాలని ప్రశ్నించారు.

హైదరాబాద్ వంటి నగరాల్లో కోట్ల రూపాయల విలువైన భూములను వివిధ పథకాల పేరుతో క్రమబద్ధీకరిస్తున్న ప్రభుత్వం, నల్లగొండ జర్నలిస్టులకు 200 నుంచి 300 గజాల ఇంటి స్థలాలు కేటాయిస్తే ప్రభుత్వానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు.

30 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా నల్లగొండకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జర్నలిస్టుల సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్కు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, గతంలో శాసన మండలిలో జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించినట్లుగానే రానున్న మండలి సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.



జర్నలిస్టుల కోసం మంత్రి కార్యాలయం ముట్టడిస్తాం: నాగం వర్షిత్ రెడ్డి

దీక్షలకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాడుతామని, అవసరమైతే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రెండూ జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు పి. ప్రభాకర్ రెడ్డి, యూసుఫ్ బాబు పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి సలీం, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, నల్లగొండ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి, 36వ డివిజన్ కార్పొరేటర్ గంట్ల అనంతరెడ్డి, నాయకులు తేలు అన్న రవి, బీజేపీ నాయకులు పాలకూరి రవి తదితరులు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

ఈ దీక్షా కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, జక్కల పరమేష్, ఎస్.కే. సలీం, దోటి శ్రీనివాస్, జిల్లా యాదయ్య, అశోక్, మదనాచారి, కత్తుల యాదగిరి, వంగాల శ్రీనివాసరెడ్డి, చింత యాదగిరి, ఎండి సయ్యద్, శ్రీరామోజు కనకాచారి, రమేష్, కంచనపల్లి చంద్రశేఖర్, చెనగోని గిరిప్రసాద్, మేకల వెంకట్ రెడ్డి, రెడ్డిపల్లి యాదగిరి, చేపూరి రవి వినోద్, మధు, సైదాచారి, లింగయ్య, సుధాకర్, స్రవంతి, మాధురి, వెంకన్న, గుండాల యాదగిరి, ఈశ్వర్, ప్రవీణ్, సూరారపు రాంప్రసాద్, ఉపేందర్, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీను, నగర భాస్కర్, కంది సూర్యనారాయణ, స్వామి, ఎండి ఖయ్యూం, సోమచంద్రశేఖర్, తాడికొండ సత్తిరెడ్డి, డి.ఎస్. యాదవ్, తెలుగమల దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతును త్వరితగతిన పూర్తి చేయాలి



**గజ్వేల్, సెప్టెంబర్ 18 మనం న్యూస్:** ధర్మ రెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు మరమ్మతును త్వరితగతిన పూర్తి చేయాలి అని బిజెపి జిల్లా కార్యదర్శి ఎలికంటి సురేష్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నుండి చేగుంట వెళ్లే రోడ్డు మార్గంలో ధర్మారెడ్డి పల్లి గ్రామ సమీపంలో గల రైల్వే బ్రిడ్జి క్రింద రోడ్డు చెడిపోయి ఇనుప రాడ్లు తేలడం వలన రోజు వందలాది మంది ప్రయాణికులు ప్రయాణించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది ని,మరియు చేగుంట వద్ద స్క్రాప్ దుకాణాలు ఉండడం వలన పెద్ద ఎత్తున భారీ వాహనాలు పోవడం వలన గుంతలు రోజుకి రోజురోజుకి పెద్దగా అవుతున్నాయన్నారు. కావున సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి మరమ్మతు అయ్యేవరకు సూచిక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని సమస్య ను పరిష్కారం చేయవలసిందిగా భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు . ఇక్కడ ఉన్న రెండు పార్టీలు కాంగ్రెస్ టీఆర్ఎస్ ఒకరిపై ఒకరు దూషణలు చేసుకోకుండా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించడం జరిగింది ఈ రోడ్డు మరమ్మత్తులు త్వరిత గతిన పూర్తి చేయకుంటే భారతీయ జనతా పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వంజరి రాజు మండల ప్రధాన కార్యదర్శిలు ఇప్ప స్వామి బారు అరవింద్ మండల ఉపాధ్యక్షులు శివమల్లు శ్రీకాంత్ గౌడ్ బీజేవైఎం నాయకులు మహేష్ చారి మండల నాయకులు రామస్వామి మురారి లక్ష్మణ్ శ్రీరామ్ నగేష్ శ్రీరామ రాజు సోషల్ మీడియా నాయకులు మణికంఠ ముదిరాజ్ నాయకులు మల్లేశం వెంకటేష్ రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని సెప్టెంబర్18(మనం న్యూస్):** రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు,ఓపీ,ఐపీ సేవలు,సర్జరీలు, ప్రసవాల నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతిరోజూ సుమారు1,500 నుంచి1,600 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నందున,ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు.రోగులకు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఇన్పేషెంట్ సేవలను కూడా మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో చేపట్టిన పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.హిమబిందు, ఆర్ఎంఓ డా.కృప బాయి, టీజీఎంఐడీసీ ఏఈ విక్రమ్,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## పైడాకుల అశోక్ జన్మదినానికి ఘనంగా ఏర్పాట్లు



**గోవిందరావుపేట్ సెప్టెంబర్18, మనం ప్రతినిధి:** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్న అశోక్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాల్లో అశోక్కు శుభాకాంక్షలు తెలిపేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలి

- కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్
- ఖైరతాబాద్ బడా గణేశుని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 18 (మనం న్యూస్):** ఖైరతాబాద్లో కొలువుదీరిన బడా గణేశుడిని కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. దర్శనం అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు నీలం మధుకు తీర్థప్రసాదాలు అందించి, వేద ఆశీర్వచనాలతో సత్కరించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నీలం మధు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ఖైరతాబాద్ బడా గణేశుడు ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తూ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన మహాగణపతిగా నిలిచారని తెలిపారు. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా బడా గణేశుడిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్కుమార్, ఫౌండర్ వీణ మాధురి, రాజశేఖర్, మొగోల్, రాజు, బాబుల్, సందీప్, రాకేష్, అభిషేక్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# సెహ్వాగ్ కొడుకు మెరుపులు.. ద్రవిడ్ కుమారుడి విధ్వంసం





రాజ్కోట్ వేదికగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరుగుతున్న అనాధికారిక తొలి వన్డేలో భారత యువ బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్లో.. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బ్యాటర్లలో యశ్వర్ధన్ చౌహాన్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 54 పరుగులు) టాప్ స్కోరర్గా నిలిచాడు.

## అదరగొట్టిన అన్వయ్, ఆర్యవీర్

ఈ మ్యాచ్లో యశ్తో పాటు భారత దిగ్గజ క్రికెటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ల కుమారులు అన్వయ్ ద్రవిడ్, ఆర్యవీర్ సెహ్వాగ్లు మెరిశారు. భారత అండర్-19 జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఆర్యవీర్, తన తండ్రి శైలిలోనే దూకుడుగా ఆడుతూ జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు.

అతడు 26 బంతుల్లో 5 ఫోర్లతో 28 పరుగులు చేశాడు. అదేవిధంగా ఆరో స్థానంలో బ్యాటింగ్కు వచ్చిన అన్వయ్ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 18 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 38 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.



# బీసీసీఐ 95వ వార్షిక సమావేశం..

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 95వ వార్షిక సభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన మీటింగ్కు బోర్డు అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా పది కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు బీసీసీఐ వెల్లడించింది.

**బీసీసీఐ ఏజీఎం తీసుకున్న కీలక నిర్ణయాలు ఇవే**

1. బీసీసీఐ జనరల్ బాడీలో భాగమైన అరుణ్ సింగ్ ధుమాల్ మరోసారి ఐపీఎల్ చైర్మన్గా ఖరారు కాగా.. ఖైరుల్ జమాల్ మజుందార్ సభ్యుడిగా చేరారు.

2. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్కు బీసీసీఐ జనరల్ బాడీ ఆమోదం తెలిపింది.

3. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బీసీసీఐ ఆడిట్ చేయబడిన ఖాతాల నివేదికను జనరల్ బాడీ ఆమోదించింది.

4. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను నియమించారు.

5. అదేవిధంగా 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్ను అత్యంత ఘనంగా నిర్వహించాలని జనరల్ బాడీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

6. బీసీసీఐ శత వసంత ఉత్సవాలు 2028లో ఘనంగా నిర్వహించాలని జనరల్ బాడీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టింది. డిసెంబరు 2027 నుంచి 2028 వరకు దాదాపు ఏడాది పాటు వేడుకలు చేయాలని నిర్ణయించింది. భారత క్రికెట్ చరిత్రలోని కీలక ఘట్టాన్ని వీలైనంత ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది.

7.దేశవాళీ క్రికెట్లో పని చేస్తున్న అంపైర్లు, రిఫరీల వేతనాలను పెంచాలని బీసీసీఐ నిర్ణయించింది. 2026-27 సీజన్ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. దేశవాళీ అంపైర్లను ఎ, బి, సీ, డీ అనే నాలుగు గ్రేడ్లుగా విభజించేందుకు చర్యలు చేపట్టింది.

8.లైంగిక వేధింపుల నిరోధక విధానంలో భాగంగా బీసీసీఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది.

9.ఆటగాళ్ల వయసు నిర్ధారణకు సంబంధించిన విధానంలో అప్డేట్ తీసుకువచ్చింది.

10. దివ్యాంగ క్రికెటర్లకు మద్దతుగా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు, వారికి కల్పించాల్సిన వనరులు, సౌకర్యాల గురించి రాష్ట్ర అసోసియేషన్లతో చర్చించింది. దివ్యాంగ క్రికెటర్ల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించింది.

# కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న కేతిక శర్మ..

టాలీవుడ్ లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమాల్లో నటించి గ్లామర్ తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్ లో కొద్దిగా విరామం తీసుకున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్ లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీసయ్య మురుక్కు-2' సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్గా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ పై కోలీవుడ్ లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు. అక్కడ తనకు కేవలం అపారమైన ప్రేమ, ఆప్యాయత మాత్రమే దొరికాయని, అందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని చెప్పారు. తమిళ పరిశ్రమతో తన మనసు పూర్తిగా మమేకమైపోయిందని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే తన సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంటుందని కేతిక చెప్పుకొచ్చారు.

# 'మగాళ్లు జిందాబాద్' ఫస్ట్లుక్ విడుదల..

టాలీవుడ్ యంగ్ హీరో శ్రీనందు వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలు, ప్రత్యేకమైన కాన్సెప్ట్లను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన,ఇటీవల 'అగ్లీ స్టోరీ' చిత్రంతో పలకరించారు. తాజాగా, తన కొత్త సినిమాను అనౌన్స్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీనందు , లక్ష్మి, టాలీవుడ్ స్టార్ కమెడియన్లు వెన్నెల కిషోర్, వైవా హర్ష ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్కి 'మగాళ్లు జిందాబాద్' అనే ఫన్నీ టైటిల్ను ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తోంది. ఇందులో శ్రీనందు, వెన్నెల కిషోర్, వైవా హర్ష ముగ్గురూ పూల దండలతో విభిన్నంగా కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఇక విడుదలైన వీడియోలో ముందుగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను చూపించగా, ఆ తర్వాత హీరోయిన్ లక్ష్మి ఎంట్రీ హైలైట్గా నిలిచింది. ఈ సినిమాలో హీరో శ్రీనందు 'గన్నెల్' అనే పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన శారదాంబ హోటల్ను నిర్వహిస్తూ ఈ రోల్లో అలరిస్తారని మేకర్స్ తెలిపారు. మరోవైపు వైవా హర్ష 'ఈగల్'గా, వెన్నెల కిషోర్ 'ముక్కోడు' అనే ఒక కటింగ్ షాప్ ఓనర్గా తమదైన శైలిలో కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. నారా ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్స్ బ్యానర్పై నిర్మాతలు ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల మరియు మదిన్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఫుల్ ఆన్ కామెడీ ఎంటర్టైనర్గా రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను పూర్తిగా నవ్విస్తూ థియేటర్లలో వినోదం పంచేందుకు వస్తోందని మేకర్స్ స్పష్టం చేశారు.



# 'జాంబీరెడ్డి-2'నుంచి భీకరమైన పోస్టర్ విడుదల

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జా హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ చిత్రం 'జాంబీరెడ్డి-2 నెక్ట్స్ లెవెల్'. 2021లో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'జాంబీరెడ్డి' మూవీకి ఇది సీక్వెల్గా వస్తోంది. ఈసారి ప్రశాంత్ వర్మ స్థానంలో సుపర్ణ ఎస్ వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై ఈ సినిమా అత్యంత భారీ బడ్జెట్తో తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి హీరో తేజ సజ్జా ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేయగా, ప్రేక్షకులలో భారీ స్థాయిలో హైప్ క్రియేట్ అయింది. నేడు రియల్ స్టార్ ఉపేంద్ర పుట్టినరోజు (సెప్టెంబర్ 18) సందర్భంగా మేకర్స్ మరో సంచలన అప్డేట్తో ముందుకు వచ్చారు. ఉపేంద్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ సినిమా నుంచి ఒక భయంకరమైన, సరికొత్త పోస్టర్ను విడుదల చేశారు.



ఈ పోస్టర్లో రియల్ స్టార్ ఉపేంద్ర చెట్టుకు తలకిందులుగా వేలాడుతుండగా, ఆయన కింద మొత్తం భీకరమైన మంటలు అలుముకుని ఉన్నాయి. ఈ విజువల్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేశాయి. ప్రపంచాన్ని తలకిందులు చేసేందుకు రియల్ స్టార్ సిద్ధమవుతున్నారంటూ మేకర్స్ ఈపోస్టర్ ద్వారా స్పష్టం చేశారు. ఇప్పటివరకు వెండితెరపై ఎన్నడూ చూడని విధంగా ఒక సరికొత్త, వైవిధ్యమైన మాస్ అవతార్లో ఉపేంద్ర ఈ చిత్రంలో కనిపించబోతున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఆయన పోషించబోయే పాత్రలో ఉండే మ్యాడ్నెస్, పక్కా మాస్ యాటిట్యూడ్ కలిసి ఉండే సరికొత్త ఫ్లేవర్ ఖచ్చితంగా ప్రేక్షకులను థియేటర్లలో షాక్కు గురిచేసేలా ఉంటుందని మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.





# దేవిలా కొలవడం.. గ్లామర్ పేరుతో వాడుకోవడం..

## బాలీవుడ్ సినిమాలపై రాధికా సెన్సేషనల్ కామెంట్స్

బాలీవుడ్ స్టార్ బ్యూటీ రాధికా ఆప్టే, శకున్ బాత్రా ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ చిత్రాలలో రొమాన్స్ను ప్రదర్శించే తీరుపై రాధికా ఆప్టే తన అభిప్రాయాలను పంచుకుంటూ.. తాను షారుఖ్ ఖాన్ సినిమాలకు వీరాభిమానినని చెబుతూనే.. చిన్నతనంలో తాను ఎంతో ఆస్వాదించిన ఆయన పాత చిత్రాలను ఇప్పుడు తిరిగి చూసినప్పుడు కొన్ని దృశ్యాలు తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ఒకప్పుడు తెరపై ఎంతో శృంగారభరితంగా, గొప్ప ప్రేమగా చూపించిన అనేక సీన్లు నిజానికి ఎంత అభ్యంతరకరంగా ఉన్నాయో ఆమె వివరించారు. ముఖ్యంగా ఒక మహిళ వద్దు అని స్పష్టంగా చెప్పినప్పటికీ, ఆమె అభ్యంతరాన్ని పట్టించుకోకుండా బలవంతంగా వెంటపడటాన్ని ప్రేమగా చూపించడాన్ని ఆమె విమర్శించారు. టీనేజ్ వయసులో ఇలాంటి వాటినే గొప్ప కలలుగా కనేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆలోచిస్తే అది ఎంత భయానకంగా అనిపిస్తుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇదే విషయమై దర్శకుడు శకున్ బాత్రా స్పందిస్తూ.. పాతకాలపు హిందీ సినిమాలలో మానసిక కోరికలను తెరకెక్కించిన విధానం గురించి ప్రస్తావించారు. ఆ కథలన్నీ కేవలం పురుషుల కోణం నుంచే నడిచాయని చెప్పారు. శకున్ అభిప్రాయంతో పూర్తి ఏకీభవించిన రాధికా ఆప్టే.. అప్పట్లో తెరపై మహిళలను చిత్రించిన విధానంలోనే అసలైన లోపం ఉందని అన్నారు. ఒకవైపు మహిళలను కేవలం గ్లామర్ కోణంలో వాడుకుంటూనే.. మరోవైపు వారిని మంచి చెడుల పరిధిలో బంధించడం సరికాదన్నారు. ఒకవైపు వారిపై జోకులు వేస్తూ, మరోవైపు వారిని 'దేవి'లా కొలుస్తూ పీఠంపై కూర్చోబెట్టడం తనకు అస్సలు నచ్చలేదని రాధిక ఆప్టే స్పష్టం చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.